# యుగాంతం

-యండమూరి వీరేంద్రనాథ్

అనంతాకాశమైన విశ్వంలో కొన్ని వేల సంవత్సరాల్నుంచీ నిర్విరామంగా ఒకే కక్ష్యలో పరిభ్రమిస్తున్న కోటానుకోట్ల గోళాల మధ్య ఒక చిన్న కదలిక క్షణంలో వెయ్యోవంతు సేపు ఏర్పడి మామూలుగా సర్దుకుంది. సూక్ష్మాతి సూక్ష్మ మైన కదలికని ప్రపంచంలో ఏ విజ్ఞాన పరికరమూ పట్టుకొలేకపోయింది.

భూమి మామూలుగానే తిరుగుతోంది. సూర్యుడి ఉదయాస్తమయాలు మామూలుగానే జరుగుతున్నాయి. అయితే భూమికి కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఒక నక్షత్రం- ప్రాక్సిమా సెంట్యారీ అని పిలువబడేది- వెంట్రుకవాసిలో తన కక్ష్య నుంచి భయటపడి అమితమైన వేగంతో జారిపోసాగింది.

అది ఏప్రిల్ పదమూడు. గ్రీన్‌విచ్ కాలమానం ప్రకారం 14-30 నిమిషాలు. అప్పుడు సగం ప్రపంచం గాఢ నిద్రలో వుంది. శైలజ, రమణ, జానకి, రాజయ్య, మెక్‌డొనాల్డు, జగదీష్‌చంద్ర అందరూ కలిస్తే ప్రపంచం.

సమస్యలు- సాంఘికం, మానసికం రాజకీయం, నైతికం అన్నీ కలిస్తే ప్రపంచం.

## *మహాప్రళయం జగం నిండా*

## *ప్రగల్భిస్తుంది!*

***ఇండియన్*** టైమ్స్ ప్రకారం పత్రికా కార్యాలయం రెండో అంతస్థు కుడివైపు హాల్లో బల్లమీదున్న ఓ చిన్న కాగితం ముక్కని భూతద్దంలో పరిశీలిస్తున్నది శైలజ.

"ఏమిటది అంత పరీక్షగా చూస్తున్నావ్?" అన్నది టైపిస్టు రాణి దగ్గర కొస్తూ.

"ఏదో చెత్త కాగితం. ఏమి వ్రాసివుందా అని చూస్తున్నాను".

"సబెడిటర్ లక్షణం పోనిచ్చావు కాదు. ప్రతీదాన్నీ శోధించనిదే మనసు నిలవదా ఏం?".

శైలజ నవ్వింది "మనం ఇంకా నయం. అమెరికాలో జర్నలిస్టులైతే.....".

"చాల్చాలు...." అంటూ రాణి టేబుల్ మీద కాగితం తీసుకొంది.

ఏదో పురాతన కాలపు పుస్తకంలోంచి వూడిపోయిన ముక్క అది. ఎండకి ఎండి, వానకి నాని చివికిపోయింది. శిధిలావస్థలో వుంది.

"ఎక్కడ దొరికిందిది?".

"మా ఇంటి పెరట్లో".

రాణి నవ్వింది. "పెరటిలో దొరికిన కాగితాలన్నీ ఇక్కడికి తీసుకొచ్చి శోధించడం కోసమేనా నీకు జీతమిస్తున్నది?".

"ఏ పుట్టలో ఏ కాగితం వుందో ఎవరికి తెలుసు?".

"సర్లే పద. టీకి టైమవుతూంది".

ఇద్దరూ క్యాంటిన్ వేపు నడుస్తూంటే శైలజ అన్నది- "మా యింటి పెరటికి అవతలివేపు గోరీలున్నాయి. అక్కణ్నుంచి గాలికి ఎగిరి వచ్చుంటుంది".

"ఏ పుస్తకంలోదో చిరిగి వుంటుంది. దానికింత ప్రాముఖ్యత ఇవ్వటం అనవసరం".

శైలజ మాట్లాడలేదు.

ఇద్దరూ కాంటీన్‌లో ఓ మూల కూర్చున్నారు. కుర్రాడు టీ తీసుకొచ్చి ముందు పెట్టేడు.

రాణి ముందుకూ వంగుతూ "ఎంత బావుందో!" అన్నది.

"ఏమిటి?".

"అలా ముందుకి వంగొని కూర్చొంటే నీ కడుపుమీద మడత".

శైలజ చప్పున సర్దుకొని కూర్చుంటూ "ఇడియట్" అంది.

రాణి నవ్వింది "నేనన్నదాంట్లో తప్పేముంది?".

తప్పు లేదు. శైలజ పక్కనుంచి వెళ్ళే పదిమందిలో తొమ్మిది మంది ఆమెవైపు చూస్తారు తిరిగి.

"నీ వయస్సెంత?" రాణి అడిగింది.

"ఇరవై ఆరు".

"మైగాడ్!" అంది రాణి "ఇరవై ఆరేళ్ళ జీవితాన్ని డ్రైగా గడిపేవా?".

"డ్రై... అంటే?".

"వెట్ కానిది".

కొంచెం నిశ్శబ్దం. మళ్ళీ రాణీయే టీ కప్పు తీసుకుని తాగుతూ అన్నది "వేడివేడి కప్పులో టీ లాటిది యవ్వనం".

"అవును. మూడు గుక్కలేస్తే అయిపోతుంది".

"వెయ్యకపోతే చల్లారిపోతుంది".

ఈ మాటలకి శైలజ నవ్వింది. రెండు చేతుల్లోకి కప్పు తీసుకుంది "నా జీవితాన్ని ఇలా దోసిలిలో వుంచి అర్పిద్దామని ఎదురు చూస్తున్నాను. ఈ నా మనసు, ఈ శరీరం ఒకరికే. ఆ ఒకరూ ఎవరో నాకు తెలీదు. ఇదొక 'వే ఆఫ్ లైఫ్'. నువ్వన్నట్టూ జీవితాన్ని ఇంకోరకంగా కూడా అనుభవించవచ్చు. అది పెద్ద కష్టమేమీ కాదు. కానీ ఇక్కడ ప్రశ్న ఏ రకం జీవితాన్ని కొనసాగించాలా అని. నేను మొదటి రకాన్నే ఇష్టపడతాను".

"ట్రాష్" అంది రాణి "ఇవన్నీ సెంటిమెంట్లు. నీ ఒక్క జీవితం మీద కుటుంబం

వరకూ నిన్ను ప్రేమగా చూసి ఆ తర్వాత ఎగిరిపోతారు. అప్పటికి నీకు నలభై యేళ్ళొస్తాయి".

ఒక్క క్షణం నిశ్శబ్దం.

శైలజ ఖాళీ కప్పు కింద పెట్టి, చిన్న స్వరంతో "ఇవన్నీ నేను ఆలోచించలేదంటావా?".

"ఆలోచిస్తే యిలా నిస్సారంగా గడపవు" అన్నది రాణి "దూరంగా చిన్న వెలుగు రేఖ కూడా కనిపించని చీకటే భవిష్యత్తయితే, దొరికిన మినుగురుల్తో ఆడుకోవటమే మంచి పద్ధతి. "మీ ఇంట్లో చిదిమి దీపం పెట్టుకోండిరా" అని ఓ అపరంజి బొమ్మని పల్లకీలో పంపితే, వాళ్ళు సంతృప్తి చెందరు. ప్రక్కన నోట్లకట్ట వుందా, లేదా అని చూస్తారు.

నీ శరీరాన్ని నువ్వెంత పవిత్రంగానైనా వుంచూ- నీ మనసెంత పవిత్రంగానైనా వుండనీ- పెళ్ళి దగ్గరికి వచ్చేసరికి మళ్ళీ డబ్బే ప్రధాన పాత్ర వహిస్తుంది. అలాంటప్పుడు అటువంటి మొగవాడి కోసం ఎందుకు శరీరాన్ని పవిత్రంగా వుంచడం? ఎంజాయ్!".

ఆమెవైపు కన్నార్పకుండా చూసింది శైలజ. అంతర్లీనంగా డబ్బు, మనిషి నైతిక విలువలమీద ఎంత ప్రభావం చూపిస్తుంది!

ఈ కొత్త థియరీ చాలా చేదు నిజం. కానీ జీర్ణం చేసుకోవాలి.

పొరలు పొరలుగా విడదీసి చూస్తే ముగ్ధంగా వుండాల్సిన స్త్రీని రాటుతేలేటట్టు చేసింది వ్యవస్థేనేమో అనిపిస్తుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?".

"వ్యవస్థ మారాలంటే ఏం చెయ్యాలి?".

రాణి నవ్వింది "ప్రళయం రావాలి".

శైలజ నవ్వలేదు "ఈ వ్యవస్థ మారటంకోసం ప్రళయమే రావాల్సి వస్తే, ఆ ప్రళయాన్ని ఈ క్షణమే ఆహ్వానిస్తున్నాన్నేను. ప్రళయం రావాలి. ఆ ప్రళయకాల ఝంఝ్ఝూ మారుతంలో.... ప్రక్షాళనమైన మనస్సుతో, ప్రక్షాళనమైన వ్యవస్థలో మనిషి కొత్త జీవితం ప్రారంభించాలి".

రాణి ఆమె చెయ్యి పట్టుకుని, "ఏయ్, ఏమిటది? అందరూ చూస్తున్నారు" అంది.

శైలజ తన ఆవేశానికి తానే సిగ్గుపడి, "సారీ, పద పోదాం" అంది.

ఇద్దరూ పైకి శైలజ సీటు దగ్గరికి వచ్చారు. రాణి కుర్చీ వెనక్కి జారబడి, "ఏమిటీ ఫైలు?" అని అడిగింది ఫైలు విప్పుతూ.

"ఇంటర్వ్యూ అప్లికేషన్లు. రేపు ఇంటర్వ్యూ వుందిగా".

"కొత్త కుర్రాళ్ళు వస్తారన్నమాట" ఒక్కో అప్లికేషనూ, దాని కుడివేపు మూలనున్న ఫోటో చూస్తూ పేజీలు తిప్పసాగింది రాణి.

అలా చూస్తున్నదల్లా ఒకచోట ఆగి, "హాయ్!" అంది, "ఈ అబ్బాయి చూడు ఎంత బావున్నాడో"

శైలజ అటు చూడలేదు ‘‘అయితే ఏమిటట’’ అన్నది.

‘‘సర్లే సర్లే. తెలియక అన్నానా మాట’’ నవ్వింది. మళ్ళీ ఫోటోవైపు చూస్తూ, ‘‘అయినా ఇంతందంగా ఉన్నాడూ అంటే యీ పాటికే ఎవర్తోనో ప్రేమలో పడే ఉంటాడు’’ అంది.

‘‘లంచ్ టైమ్ అయిపోయినట్టుంది?’’ శైలజ గుర్తుచేసింది.

రాణి నవ్వి, లేస్తూ ‘‘సర్లే సాయంత్రం కలుస్తాను’’ అని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక శైలజ అప్లికేషన్ ఫైల్లో తిరిగి ఫోటోవేపు చూసింది. రాణి అన్నట్టు అతడు చాలా అందంగా వున్నాడు. అమాయకంగా. తన కన్నా చిన్నగా.

పేరు చూసింది.

రమణ.          బి.ఏ. యూనివర్సిటీ ఫస్ట్. ఫైల్లో అప్లికేషన్ పెట్టేసి, దాన్ని డ్రాయర్‌లోకి తోసేసి, తన పనిలో మునిగిపోయింది.

*          *          *          *          *          *

సాయంత్రం అయిందింటి వరకూ ఆమెకి ఊపిరి సలపని పని తగిలింది. మేటర్ కంపోజింగ్‌కి యివ్వటం, కంపోజ్ అయివచ్చిన మేటర్ ప్రూఫ్‌లు దిద్దటం, అడ్వర్టయిజుమెంట్ బ్లాకులకు ఫోన్ చెయ్యటం లాంటివి. ‘పగవాడికైనా సబ్ ఎడిటర్ పని వద్దురా బాబూ!’ అంటూ ఆమె వళ్ళు విరుచుకుంటుంటే రాణి వచ్చింది.

‘‘పోదామా?’’.

‘‘ఇదిగో అయిపోయింది’’.

మరో అయిదు నిమిషాల్లో ఆమె టేబుల్ సర్దివేసింది.

ఇద్దరూ బయటకొస్తుంటే రాణి అడిగింది- ‘‘ఆ కాగితంలో ఏం వుందో కనుక్కొన్నావా!’’.

‘‘ఏ కాగితం?’’.

‘‘అదే! గోరీల మధ్య దొరికిందన్నావే- అది’’.

‘‘ఉహు..... ఎక్కడ తీరిక దొరకందే!’’.

వాళ్ళిద్దరూ కారిడార్లో నడుస్తూంటే యెదురుగా అటెండర్ వస్తూ కనిపించేడు. వాడి పేరు ఇస్మాయిల్.

రాణి అతణ్ణి ఆపి, ‘‘ఇదిగో, ఈ కాగితంలో ఏం వ్రాసి వుందో చెప్పూ’’ అంది.

అతడు కాగితం అందుకొన్నాడు. చదువుతూంటే అతడి మొహంలో భయం కొట్టొచ్చినట్టు కనబడింది.

‘‘ఏముందందులో?’’ నిశ్శబ్దాన్ని భరించలేక అడిగింది.

అతడు మాట్లాడలేదు.

‘‘ఏమిటది...? ఉత్తరమా?’’

అతడు కాగితంవైపు మళ్ళీ చూసేడు.

"కాదు... అరబ్బీ!".

"నీ కొచ్చా?".

"వచ్చు".

అతడు చదివేడు, "యెామాయూన్ ఫిక్క్ ఫినూరి పతుతూనా ఆఫ్ వాజా!".

"అంటే.....?" ఇద్దరూ ఒకేసారి అడిగేరు.

అతడు తల పైకెత్తాడు. అతడి కళ్ళు నిస్తేజంగా ఉన్నాయి. మొహం భావరహితంగా వుంది. అనాసక్త కంఠంలో అతనన్నాడు- ***"....ఒకరోజు శంఖం వూదబడుతుంది. ఆకాశం తెరవబడుతుంది. అప్పుడు శవాలన్నీ గుంపులు గుంపులుగా లేచి వస్తాయి".***

అత నా మాటలంటూవుంటే దూరంగా యెక్కడో ఉరిమింది. ఆ రాత్రి కురవబోయే కుంభవృష్టికి సూచనగా మేఘాలు అలుముకుంటున్నాయి.

## ***నాంది:***

మినుకు మినుకుమని వెలుగుతూన్న దీపాన్ని టప్పున ఆర్పి చీకటి మరింత చేతనత్వాన్ని పొందింది. మనిషి మనసులో పాపంలాంటి చీకటి; మనోసముద్రపు నిబంధనల చెలియకట్టని కొద్ది తొలిగిస్తే వెల్లువలా బయటకుదూకే పాపం.

తలుపు సందుల్లోంచి బలంగా వీస్తున్న ఈదురుగాలి శబ్దం శరీరాన్ని గగుర్పొడుస్తూంది.

మనిషి అనుక్షణమూ బ్రతికిస్తూన్న గాలి కొద్దిగా చెలరేగితే మనిషి గడ్డిపోచలా ఎగరాలి.

బాబు జానకి ఒళ్ళో మరింత మునగదీసి పడుకున్నాడు. గదిలో దీపం ఆరిపోయినా ఆమె కదల్లేదు. మినుకు మినుకు వెలుగుకన్నా చీకటే బావుంది. ప్రక్కగదిలో మరిది ఇంకా చదువుతూనే వున్నాడు. రేపు ఇంకో ఇంటర్వ్యూ. ప్రకాశరావు ఇంకా రాలేదు. మామగారి దగ్గు వినిపిస్తూ వుంది. అప్పుడప్పుడు. దూరంగా గడియారం ఒంటి గంట కొట్టింది.

గదిలో రమణ పుస్తకంలోకి చూస్తూ మాలతి గురించి ఆలోచిస్తున్నాడు. మరుసటి రోజు ఇంటర్వ్యూ. అయినా ఆలోచనలు మాలతి చుట్టూనే.

......జానకి బాబుని ఒళ్ళోంచి లేపి, మంచం మీద పడుకోబెట్టింది. కిటికీ తలుపు తెరిచి చూడబోతే ఫెడేలున వర్షపు జల్లు మొహం మీదకు కొట్టింది. చప్పున తలుపు మూసింది. గడియ విరిగిపోతుందేమో నన్నంత బలంగా గాలి వీస్తూంది.

శివుడి జటాజూటం నుంచి దభిల్లున జారిన గంగా నది. ఏనుగు తొండాల్తో పోసినట్టు కుంభవృష్టి.

తలుపు దబదబా బాదిన చప్పుడు. వెళ్ళి తలుపు తీసింది. ప్రకాశరావు ముద్దగా తడిసిపోయాడు. చలికి వణికిపోతున్నాడు. గాలితో పాటు లోపలికొచ్చాడు. తలుపు బలంగా వేసింది.

“ఇక్కడ జల్లు పడుతోంది” అని ముసలాయన గొణుగుతున్నాడు. ఆయన్ని లేపమని చెప్పి మంచం మరిది గదిలో వేసింది. ముసలాయనకి లైటుంటే నిద్ర పట్టదు. రమణ లైట్ ఆర్పేసేడు. చీకట్లో వెల్లకిలా పడుకొని కళ్ళు మూసుకున్నాడు మాలతి.

మాలతి.....మాలతి.

ప్రకాశరావు తల తుడుచుకొని బట్టలు మార్చుకొంటుంటే జానకి వంటింట్లోకి వెళ్ళి అన్నం, నీళ్ళూ పెట్టింది. అతడు రెండు మెతుకులు తిని లేచిపోయాడు. జానకి అన్నీ చూస్తూంది. మాట్లాడాలేదు. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది మాట్లాడటానికేమీ లేదు. కంచం తీసింది.

ప్రకాశరావు గదిలోకి వచ్చేడు. బాబుని క్షణం చూసి పక్కనే పడుకున్నాడు. లోపల వంట గదిలో సామాను సర్ది జానకి కూడా వచ్చింది. మంచం పక్కనే చాప వేసుకుని పడుకొంది. తల దగ్గరే వున్న మాసిన బట్టల పెట్టెలోంచి తడిసిన బట్టల వాసన.

కుడిచేతి పక్కకి వత్తిగిల్లుతూ ‘ప్రళయం వచ్చేటట్టు వుంది పాడు వర్షం’ అనుకొన్నది జానకి. తథాస్తన్నట్టు మిన్ను వెన్నుమీద మెరుపు మెరిసింది.

## 2

***విరిగి*** పడటానికి సిద్ధంగా వున్న పాక చూరుకింద రాజయ్య పడుతున్న వర్షాన్ని చూస్తున్నాడు. అతడి మొహం మీద ముడతలు అతడి గత జీవితపు కష్టాల్లా లెక్క పెట్టలేనంతగా వున్నాయి. ఆనందాన్నీ, విషాదాన్నీ ఒకేలా ప్రదర్శించటానికి అలవాటుపడ్డ గాజుకళ్ళు వర్షాన్ని నిర్లిప్తంగా చూస్తున్నాయి.

రాజయ్య ఎకనమిక్స్ చదువుకోలేదు. ఎనిమిదో క్లాసుకూడా చదువుకోలేదు. అయినా భూషణం చెప్పిన లెక్క సరిగ్గానే వున్నట్టు తోచింది. ఆ లెక్క అర్థమయ్యేటట్టు చెప్పటానికి భూషణమూ, పెదకామందూ చాలా కష్టపడవలసి వచ్చింది.

మరి యెనిమిదో క్లాసు వరకూ అయినా చదువుకోని రాజయ్యకి, వ్యవస్థ చాలా కట్టుదిట్టంగా నిర్మించిన ఆర్థ శాస్త్రాన్ని బోధించటం అంటే సామాన్యం కాదు. అయినా వాళ్ళిద్దరూ చాల కష్టపడ్డారు చేతివేళ్ళు ఉపయోగించి లెక్కలు కట్టడం నేర్పారు.

ఎలాగైతేనేం ఆ చిన్న లెక్కని అతని బుర్రలోకి ఎక్కించారు. అది బాగా అర్థమయినా కాకపోయినా ఒక విషయం మాత్రం అతడికి బాగా అర్థమైంది. ఇంకో నెలలో తన పాకా, పొలమూ ఖాళీచేసి అతడు భూషణానికి అర్పించాలి.

పాక సంగతి సరే- దాంట్లో వున్నా, బయట వర్షంలో వున్నా ఒక్కటే. అయితే తాత ముత్తాతల పొలం అది. దాన్ని వదులుకోవాలంటే బాధ.

రాజయ్యవాళ్ళ తాత రాజయ్యకిచ్చిన ఆరెకరాన్నీ భూషయ్యవాళ్ళ తాత భూషయ్య కిచ్చిన వందెకరాల్తోనూ కలపకుండా ఎవరాపగలరు?

ప్రవాహంలా కదుల్తూన్న వాన నీటిలోకి తుపుక్కున ఉమ్మేసి, "ఎదవలోకం! ఎదవ లోకమంట. థూ, భూకంపం వచ్చి కూలిపోకూడదూ" అన్నాడు చుట్టకోసం తడుముకుంటూ.

## 3

***లాస్ఏంజెల్స్,*** వెస్టర్న్ కాలిఫోర్నియా, హోటల్ షెర్టాన్ నాలుగో అంతస్థులో అయిదువందల ఇరవై రెండో నెంబరు గదిలో రాత్రి ఒంటిగంటా నలభై అయిదు నిమిషాలకి ఫోన్ ఎడతెరిపిలేకండా మోగసాగింది.

ఫస్ట్ సెక్రటరీ టు ది ప్రెసిడెంట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్- జేమ్స్ డొనాల్డ్ కొద్దిగా కదిలి రజాయి కిందనుంచి చెయ్యి బయటికి పెట్టి రిసీవర్ అందుకొని "హలో!" అన్నాడు విసుగ్గా.

రూమ్ టెంపరేచర్ కృత్రిమంగా కంట్రోలు చెయ్యబడినా, గాజు అద్దాల్లోంచి, బయటి మంచు వెన్నులో చలి పుట్టిస్తూంది.

రిసీవర్‌ని చూపుడు వేలితో టాప్ చేసి "హలో" అన్నాడు మళ్ళీ హోటల్ ఆపరేటర్ లైనులోకివచ్చి. "ఎక్స్యూజ్‌మి సర్" అంది. "కాల్ ఫ్రమ్ శాన్‌ఫ్రాన్సిస్కో".

రజాయి కింద మెక్ కొద్దిగా కదిలేడు.

నలభై అయిదేళ్ళ వయసు, తెల్లబడుతూన్న జుట్టు, అరడగుల రెండంగుళాలు ఎత్తు. యునైటెడ్ స్టేట్స్ కాన్స్టిట్యూషన్ పట్ల అపారమయిన గౌరవం. ఒక భార్య, ఇద్దరి పిల్లలు.

"హలో".

అవతలిపక్క లైనులోకి ఎవరో వచ్చిన ధ్వని "హలో మెక్!".

"ఎవరూ?".

"రోజర్స్....విలియమ్ రోజర్స్".

మెక్ చేతిలో రిసీవర్ బిగుసుకుంది. పక్కమీద చప్పున లేచి కూర్చొని "సర్!" అన్నాడు.

"నువ్వు వెంటనే బయల్దేరు".

"సర్!".

"వాషింగ్టన్ కాదు......ఫ్రిస్కో".

నిన్న సాయంత్రం న్యూయార్క్ నుంచి తనతో మాట్లాడాడే అట్లాంటిక్ సముద్రం నుంచి పసిఫిక్ వైపు ఇంత అర్జంటుగా ఈయనెందుకు వచ్చేడు?

"ఇంకో గంటలో నువ్విక్కడ వుండాలి. ఈ లోపులో మనక్కా వలసిన పూర్తి సమాచారం వస్తుంది".

ఏ సమాచారం అని అడగలేదు. "వస్తున్నాను" అని ఫోన్ పెట్టేశాడు.

మంచంమీద నుంచి దిగి, గబగబా పది బస్కీలు తీసి, సింక్‌లో మొహం కడుక్కొని బాటిల్ చివర్లో వున్న నాల్గు చుక్కలూ కొట్టేసి, సూట్‌కేస్ సర్దుకొని అయిదు నిమిషాల్లో మెట్లు దిగేడు.

"ఇంత అర్థరాత్రి వెళ్ళిపోతున్నారేం?" రిసెప్షనిస్టు పలకరించింది. ఇరవై యేళ్ళ యవ్వనాన్ని ముద్దచేసినట్టుంది రెండ్రోజుల క్రితం పరిచయం.

మెక్ నవ్వి, "ఫోనొచ్చింది" అన్నాడు.

మెక్ నవ్వితే గ్రేగరీపెక్‌లానూ వుంటాడు, నవ్వకపోతే చార్లెస్‌బ్రాన్‌సన్‌లానూ వుంటాడు. రాత్రి రెండు. నిర్మానుష్యమైన వరండా.

"ఎవరు? భార్య?".

తల అడ్డంగా వూపి "కాదు" అన్నాడు.

"బైట బాగా మంచు కురుస్తోంది. కారు నడవదు".

"ఎలాగో సర్దుకొంటాను".

"దార్లో మాటి మాటికి కాప్స్ (పోలీసులు) ఆపుతారు".

"గుర్తింపు కార్డు వుంది".

"పీటర్స్ స్ట్రీట్‌లో రెండు తర్వాత వెళ్ళనివ్వరు".

"చుట్టూ తిరిగి నార్త్ స్క్వేర్ మీంచి వెళతాను" ఆగి అన్నాడు...."ఎలాగూ రూమ్ ఖాళీ చేసేశాను".

"రూమే సమస్య అయితే ఇంకో గంటలో నేను రిలీవ్ అయిపోతున్నాను. షెర్టాన్ హోటల్, రిసెప్షనిస్టులకి మంచి కాటేజీలిస్తుంది మిష్టర్ మెక్".

మెక్ ఆమె వైపు చూశాడు. బాబ్డ్‌గ్రే హెయిర్, నీలి కళ్ళు పగడాల్లాంటి పెదవులు.

నవ్వి, "ఉండేవాణ్నే, కానీ పిల్చింది విలియమ్ రోజర్స్" అని, సూట్‌కేసు పట్టుకొని చీకటిలో కలిసిపోయాడు.

ఆమె అటే చూస్తూ నిలబడింది. నెమ్మదిగా ఆమె పెదవుల మీద చిరునవ్వు వెలిసింది. 'విలియమ్ రోజర్స్' అట. నలభై సంవత్సరాల క్రితం చాలా మంది తల్లిదండ్రులు కొడుకులకి ఆ పేరే పెట్టుకున్నారు. ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాది కూడా ఆ పేరే.

# 4

***మెక్ కాంటెస్సా*** ఎయిర్‌పోర్టు వైపు దూసుకుపోతున్న సమయాన ఢిల్లీ ఇంద్రప్రస్థమార్గ్ పధ్నాలుగో నెంబరు యింటిలో జగదీష్‌చంద్ర తన టేబుల్ ముందున్న కాగితాల మధ్య మోచేతులాన్చి, చేతుల మధ్య తల పెట్టుకొని నిస్త్రాణగా కళ్ళు మూసుకొన్నాడు.

అలసటతో అతని కళ్ళు మూతలు పడసాగాయి. కానీ ఆ రాత్రి ఆ విషయాన్ని తేల్చేయాలి. మరుసటి రోజు పార్లమెంటులో మంత్రివర్గాన్ని ప్రకటించాలి.

అతి కష్టం మీద అతడి పార్టీ మెజారిటీ సంపాదించ గలిగింది. కానీ యీ మంత్రుల్ని యెన్నుకోవటంలో ఏమాత్రం పొరపాటు చేసినా తన పార్టీ అధికారం నుంచి పేకముక్కలా పడిపోవటం ఖాయం. అందర్నీ సంతృప్తి పరచటం ఎలా?

జగదీష్‌చంద్ర చిన్నతనం నుంచీ కొన్ని కొన్ని సిద్ధాంతాల మధ్య పెరిగినవాడు. తన జీవితాన్ని దేశం కోసం అర్పితం చేసినవాడు. అందుకే నలభయి రెండేళ్ళ వయసులోనే ప్రధానమంత్రి కాగలిగేడు.

దేశాన్ని యెదుర్కొంటున్న సమస్యలు ఇన్ని వుండగా ప్రతిపార్టీ రాజకీయాలకి యింత ప్రాముఖ్యత యెందుకిస్తుందో అతడికి అర్థంకాలేదు. ఏ మంచిపని చేయబోయినా దాంట్లో తప్పులు పట్టడానికి సిద్ధంగా ఉంటుంది ప్రతిపక్షం. దేశం గురించి ఆలోచించటం కన్నా వీళ్ళ గురించి ఆలోచించటానికే తన సమయం సరిపోవటంలేదు.

ఎలా-

ఉత్తరప్రదేశ్‌కి చెందిన వాడికి ఉపప్రధాని పదవి ఇవ్వాలి. తన పార్టీతో చేతులు కలిపిన లేబర్‌పార్టీ ముగ్గురు మంత్రుల్ని రికమెండ్ చేసింది. ఉత్తరభారతానికి, దక్షిణానికీ మధ్య సంబంధాలు అసలు బాగా లేవు. ఈసారి మెజారిటీ వాళ్ళకే ఇవ్వాలి. ఇద్దరు ముస్లిం మంత్రులూ, ఒక సిక్కు ప్రతినిధి.

తల వదిలించేడు.

రాజ్యాంగాన్ని మార్చి ఎన్నికల్ని రద్దు చేస్తే తప్ప దేశం బాగు పడదు. ఊహు. తను అలా ఆలోచించకూడదు. భారతదేశపు ప్రధాని అలా ఆలోచిస్తున్నాడని తెలిస్తే దేశంలో.....

ఫోన్ మ్రోగింది.

పార్టీ అధ్యక్షుడు అవినాష్!

"ఏమన్నా తేలిందా?".

"ఉహు ఓ పన్నెండు పేర్లు ఫైనలైజ్ చేసేను".

"అందులో పది సాయంత్రమే అనుకున్నాంగా".

జగదీష్ మాట్లాడలేదు.

"...నేను మెలకువగా వుంటాను, చెప్పు, ఎంత సేపయినా సరే-".

"ఎవరెవరున్నారు మీ గదిలో-".

అవతలి వైపు నవ్విన ధ్వని. "అందరూ...మొత్తం దేశమంతా.

ఫోన్ పెట్టేశాడు.

గడియారం రెండు కొట్టింది.

కిటికీ దగ్గర కొచ్చి బయటకు చూడసాగేడు. మబ్బులు విడిపోయి, వెన్నెల పడుతూంది. విశాలమయిన కాంపౌండు. సగం వరకూ పూల మొక్కలు, అక్కడక్కడ పెద్ద బండరాళ్ళు. జుట్టు విరబోసుకున్న దెయ్యంలా దూరంగా పెద్ద చెట్టు. ఏదో ఒకటి తేల్చెయ్యాలి. కానీ అందరినీ సంతృప్తి పరచాలి, లేకపోతే పార్టీలో వుంటూనే గోతులు తీస్తారు. సమ్మెలు, లూటీలు, పోలీసు కాల్పులు, పార్లమెంటులో ప్రశ్నలు, సైన్యం.....

తన చేతకానితనాన్ని చాలా జాగ్రత్తగా నిరూపిస్తారు.

చీకట్లోకి చూస్తూ తనని తనే ఈ ప్రశ్న వేసుకొన్నాడు జగదీష్ చంద్ర. అతడికి నవ్వొచ్చింది.

విశ్వంతో పోలిస్తే.... యాభై అడుగుల పొడవూ, నలభై అడుగుల వెడల్పూవున్న తెల్లకాగితం మీద సూదిని ఇంకులో ముంచి చుక్క పెడితే- కనబడే సూక్ష్మబిందువులాంటి భూమీ దానిమీద పీలికలాంటి మనిషి.

.....కిటికీ వూచల్ని పట్టుకొని బయటికి చూస్తున్న చంద్ర ఉలిక్కిపడ్డాడు. చూస్తున్నది నిజమో, కలో అర్థంకాలేదు. గొంతులోంచి రాబోయిన కేకని బలవంతం మీద ఆపుకొన్నాడు అలాగే నిశ్చేష్టుడయి, అచేతనంగా వుండిపోయాడు.

క్రేన్‌తోగాని పదిమంది మనుషులు యెత్తితేగానీ లేవని పెద్ద బండరాయి, గాలిలో నాలుగైదు అడుగులు పైకి లేచి, రెండుక్షణాలు శూన్యంలో ఊగిసలాడి ఎవరో వదిలేసినట్లు దభేలున పడిపోయింది.

చుట్టూ గాఢమైన నిశ్శబ్దం.

## *ప్రారంభం:*

## *జూన్ ఇరవై తొమ్మిది*

రాత్రి కురిసిన వర్షం ప్రభావం వల్ల చల్లటిగాలి దక్షిణం నుంచి వీస్తూ వుంది.

తొమ్మిదిన్నరయింది. రమణ బట్టలేసుకున్నాడు. ఉన్నవి రెండు జతలు. అందులో ఒకటి

ఇంటర్వ్యూల కోసం మాలతిని కలుసుకోవటం కోసం అట్టే పెట్టింది. అది వేసుకున్నాడు. జేబులో అర్థరూపాయి వుంది. అన్నయ్యని అడగటానికి మనసొప్పలేదు. అడిగినా వుండదు. అడక్కపోతే అడిగి లేదనిపించుకొన్న అసంతృప్తి వుండదు.

ఫైల్లో సర్టిఫికెట్లు వున్నయ్యో లేదో చూసుకొన్నాడు. బి.ఏ.-ఎకనామిక్సు. యూనివర్శిటీ ఫస్టు. ఎన్.సి.సి. బాడ్మింటన్. మంచి కుర్రవాడు.

ఫైలు మూసి "వదినా వెళుతున్నాను" అని అరిచేడు! జానకి లోపల్నించే "మంచిది బాబూ" అంది.

"తడుముకోకుండా చెప్పరా"అన్నాడు దగ్గుతూ ముసలాయన రమణకి నవ్వొచ్చింది. ఇది పదహారో ఇంటర్వ్యూ.

తలూపి బయటకొచ్చాడు.

పత్రిక ఆఫీసు కొచ్చేసరికి పావుతక్కువ పది. తనలాంటి మరో ఇరవయిమంది భారతీయులు చావబోతున్న ఆవుకోసం ఆకాశంలో తిరిగే గ్రద్దలు....

అతడి వంతు వచ్చేసరికి పన్నెండయింది. నెమ్మదిగా గదిలో ప్రవేశించాడు.

ఆ గదిలోవున్న రోజ్‌వుడ్ టేబుల్ ఖరీదుతో ఒక సగటు మనిషి రెండు నెలలు, అక్కడున్న వాళ్ళు ఒక్కొక్కరి కోటు కుట్టాటానికయిన ఖర్చుతో ఒక నెలా, ఆ గది కేసిన పెయింటింగు ఖరీదుతో మూడు నెలలు భోజనం చెయ్యొచ్చు.

ఆ గదిలో గాలి కూడా నమ్రతగా వీస్తోంది.

పేపర్ వెయిట్ కూడా హుందాగా వుంది.

"బీ సీటెడ్ మిస్టర్ రమణా!".

"థాంక్యూ సర్!".

"మీ క్వాలిఫికేషను?".

"బి.ఏ.".

"క్లాసు?".

"ఫస్టుక్లాసు. యూనివర్శిటీ ఫస్ట్".

"సబ్జెక్టు!".

"ఎకనామిక్స్".

క్షణం నిశ్శబ్దం.

"....భూమికి, సూర్యుడికి మధ్య దూరం యెంత?".

"తొమ్మిదికోట్ల ముప్పైనాలుగులక్షల మైళ్ళు".

"మిష్టర్ రమణా! ఆకాశంలో నక్షత్రాలెన్ని?".

'లాభంలేదు. ఈ ఉద్యోగం తనకి రాదు. ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రుడైన తనని ఆస్ట్రానమీలో ప్రశ్నలడుగుతున్నారంటే- ఈ ఉద్యోగం యింతకు ముందే యెవరికో అంకితం అయిపోయిందన్నమాట!'

అయినా చెప్పడం మొదలు పెట్టేడు.

"మన కంటికి కనబడేవి దాదాపు ఆరువేల నక్షత్రాలు. కానీ లక్ష మిలియన్ల నక్షత్రాలు మన మిల్కీవేలో వున్నాయని అంచనా. అలాంటి మిల్కీవే గలాక్సీలు విశ్వంలో దాదాపు పదిలక్షల మిలియన్‌లున్నాయి. అంటే విశ్వంలో పదికోట్ల కోట్ల నక్షత్రాలున్నా యన్న మాట. పది తర్వాత ఇరవయినాలుగు సున్నాలు".

అవతలివాళ్ళ తల దిమ్మెక్కినట్లయింది. కొంచెంసేపెవరూ మాట్లాడలేదు. తరవాత ఒకాయన అడిగేడు.

"లావా అంటే ఏమిటి?".

"భూమి అంతర్భాగాన మహోజ్వలమైన వేడికి కరిగిన ఘనపదార్థం. సప్తలోహాల మిశ్రమం".

"మీరు తెలుగు బాగా ఆధ్యయనం చేసినట్టున్నారే" నవ్వులు, రమణ మొహం ఎర్రగా మారింది.

"లావా మరి భూమి పైకి యెందుకు రాదు?".

"కవచంలాగా పైపొర కప్పుకుంది కాబట్టి".

"లావాలో ఇనుము వుంటుంది కదా?".

"ఉంటుంది".

"మీ తమ్ముడు ఓ బావిలోకి అయస్కాంతం పట్టుకెళ్ళాడనుకోండి. మరి లావా బయటికొచ్చెయ్యాలి కదా- ఐమీన్ భూమిని చీల్చుకుని".

రమణ తలెత్తి చూసేడు. అందరి మొహాల్లోనూ ముసి ముసిగా నవ్వులు.

"భూమి పొర చాలా మందం. అలా రాదు".

"భూమిపై డెన్సిటీ యెంత?".

"క్యూబిక్ సెంటీమీటరుకి అయిదు పాయింట్ల అయిదు గ్రాములు".

"భూమి లోపల డెన్సిటీ ఎంత?".

"దాదాపు రెండు రెట్లు".

"అంత డెన్సిటీవున్న లావాని యీ పొర ఆపగలదా?" అడిగేడొకాయన. "పకోడీలు దట్టంగా కూరి కాగితంలో కడ్తే లోపలి డెన్సిటీ ఎక్కువైతే ఏమవుతుంది?".

ఇంకో ఇంటర్వ్యూ కమిటీ మెంబరు తనే సమాధానం చెప్పాడు, "కాగితం పగిలి

మనకందరికీ పకోడీలు దొరుకుతాయి".

గొల్లున నవ్వులు.

"మిస్టర్ రమణా! భూమి మాస్ ఎంత?".

"అయిదూ పాయింట్ తొంభై ఏడు ఇంటూ పదివందల ఇరవైయేడు గ్రాములు".

"ఇంత పదార్థాన్ని పై పొర ఆపలేకపోతే యేమవుతుంది?".

రమణ లేచాడు. సర్టిఫికెట్లు సర్దుకున్నాడు. "ఇలాంటి ఇంటర్వ్యూలుండవు. మనిషి తిండికోసం ఏడవటం వుండదు. చదువుకున్న చదువుకి యింత ఉద్యోగం దొరకలేదే అన్న బాధ వుండదు. ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లుండవు. ప్రశ్నలుండవు సమాధానాలుండవు. అసలేమీ వుండదు".

* * * * * *

"ఏమైంది ఇంటర్వ్యూ?" అడిగింది మాలతి.

"ఏమవుతుంది?".

"అంటే?".

అతనికి అనునయంగా చూస్తూ "పోన్లే-అదృష్టం బావుంటే ఇంకోసారి వస్తుంది" అన్నది.

"రాదు ఇంకోసారికూడా రాదు" అన్నాడు. అతను అడ్డంగా తలూపుతూ, "ఆ దేముడికి కూడా తెలుసు మనం తనకేమీ లంచం యివ్వలేమని."

"నేనీకొకటి చెప్పనా?".

అతడు ఏమిటన్నట్టు చూసేడు.

"తిట్టగూడదు సుమా!".

"ఏమిటి?".

"నీకీ సారి ఉద్యోగంవస్తే మనిద్దరం తిరుపతి వస్తానని మొక్కుతున్నాను" అందామె.

"నేనూ మొక్కుకున్నాడు".

"ఏమని?" అందామె ఆశ్చర్యంగా. ఆమెకి అతడు "మొక్కుతున్నా"డంటే ఆశ్చర్యంగా వుంది. "ఏమనీ?" రెట్టించింది, అతడు మౌనంగా వుండటం చూసి.

"ఈసారి ఉద్యోగం రాకపోతే తిరుపతివచ్చి, విగ్రహాన్ని బాంబుల్తో బ్రద్దలుకొట్టేస్తానని."

ఆమె సన్నగా వణికి, చప్పున అతడి చెయ్యి పట్టుకొని, "అలా అనకు ప్లీజ్! నీకు తప్పకుండా ఉద్యోగం వస్తుంది" అంది.

అతడు పేలవంగా నవ్వి "రాదు" అన్నాడు "వచ్చినా, ఆ ఉద్యోగపు జీతం, మీ నాన్నగారు నీకు ప్రతినెలా ఇచ్చే పాకెట్‌మనీ అంతకూడా వుండదు"

"అఖ్కర్లేదు" అన్నదామె. "నువ్వు నా ప్రక్కనుంటే నాకు డబ్బు అఖ్కర్లేదు, ఏమీ అఖ్కర్లేదు."

అతడీసారీ నిజంగా నవ్వాడు "షేక్స్పియర్ నుంచీ అదే వ్రాస్తూ వచ్చారు ఈ కాలం రచయితల వరకూ."

ఆమె రోషంగా- "నేను నీకు మరీ కలల్లో బ్రతికే ఆడపిల్లలాగా కనిపిస్తున్నానా" అన్నది. అతడు ఆమె వైపు ఆరాధనగా చూసేడు.

"చాలా సమస్యలు- కట్నం, ఉద్యోగం, అత్తల కష్టాలు, ప్రేమ, కోరుకున్నవాడు దొరక్కపోవటం, ఇన్ని కష్టాల్లో బ్రతకటం కంటే ఆడపిల్ల కల్లలో బ్రతకటమే మంచిది."

"మిగతా ఆడపిల్లల సంగతి నాకు తెలీదు. నేను మాత్రం నిన్నే వివాహం చేసుకొంటాను. ఆరు మూడైనా మూడు ఆరైనా సరే అందుగ్గానూ నా ఆస్థి సర్వస్వం వదిలి వచ్చేస్తా. ఇంకొక్క మాట కూడా వినను. అలా వచ్చేసి నందుకు నేను ఆ తర్వాత యెప్పుడూ భవిష్యత్తులో చింతించను."

అతడు తిరిగి నవ్వబోయాడుగానీ, ఆమె మొహంలో కనబడ్తూన్న అదోవిధమైన దీప్తిని చూసి కదలిపోయి, "మాలతీ" అన్నాడు. ఆమెకూడా తన ఉద్వేగానికి సిగ్గుపడి "సారీ" అన్నది.

"ఎందుకు" అన్నాడతను "మనిషిలో ఆ మాత్రం సెన్సిటివ్‌నెస్ ఫీలింగ్ లేకపోతే బ్రతకడం అనవసరం. నీకు తెలుసా మాలతీ- నేను ఈ వ్యధాభరిత జీవితం, చచ్చిపోకుండా అలా అనుభవిస్తున్నానంటే దాని వెనకున్న ఒకే ఒక కారణం నువ్వే. ఫస్ట్రేషన్ ఫస్ట్రేషన్. యువకులలోనూ, యువతులలోనూ, ముసలివాళ్ళలోనూ అందర్లోనూ నిరాశే. అంతా బ్రతకటానికి మాత్రం ఒక కారణం ఏదో ఒక కారణం- అంతే అలా.... నేను బ్రతకటానికి కారణం నువ్వు."

ఆమె మాట్లాడలేదు.

ఇద్దరూ మౌనంగా నడవసాగేరు. నిశ్శబ్దమే మాట్లాడుతూంది ఆర్ద్రంగా.

"బాగా చీకటిపడింది. ఇక వెనుదిరుగుదామా" అన్నాడతడు. పైర్ల మీద నుంచి వచ్చే గాలి ఆహ్లాదంగా వుంది. దూరంగా ఓ రెండెడ్లబండి చప్పుడు చేసుకొంటూ వెళ్తూంది. "ఊరికి చాలా దూరం వచ్చేశాం...."

ఇద్దరూ వెనుదిరిగారు, వెనుదిరుగుతూంటే ఆమే ఆగి. "రమణా!" అంది.

"ఊ....." అన్నాడు.

"నేను.... నేను వకసారి నీ చేతిని నా చేతుల్లోకి తీసుకోనా- ఒకేసారి...."

అతడు ఆమె వేపు నెమ్మదిగా తల తిప్పేడు. నెమ్మదిగా కానీ దృఢంగా అన్నాడు- "వద్దు"

ఆమె హర్టు అయి "ఏం?" అంది.

"దీనికి ఇక అంతం వుండదు మాలతీ. హృదయంలో ఉప్పెనలో పొంగే ఆత్మీయతని ప్రదర్శించటానికి చెయ్యి స్పృశించటమే అవుట్-లెట్ అయితే, అది కూడా కొంత కాలానికి సరిపోదు. అది అక్కడితో ఆగదు కూడా. మనిషి నైతిక విలువలకర్థం కొద్ది కొద్దిగా మారిపోతుంది. ఆత్మవంచన ప్రారంభమవుతుంది. కొంతకాలం ఆగుదాం. నాకు ఉద్యోగం దొరికితే...." అని నవ్వేడు.

ఆమె నవ్వలేదు. ఆలోచిస్తూంది. ఈ దౌర్భాగ్యపు ప్రపంచంలో స్వచ్ఛమైన ప్రేమ కూడా వ్యవస్థ నిర్మించిన అసమానతల్లోపడి కాలుష్యమయిపోతుంది. తన తండ్రి ఇల్లూ, కారూ, ఫ్రిజ్ అన్నీ అమ్మి ప్రేమికులకి పంచిస్తే.... అప్పుడొచ్చింది ఆమెకి నవ్వు. తల అబ్సర్డు ఆలోచన్లని తల్చుకొని- అయినా ఇందులో అబ్సర్డిటీ యేముంది? ప్రేమకన్నా ఆకలి దారుణమైంది.

తమ వందెకరాల్నీ పంచి వందమంది కిచ్చేస్తే? నిర్భాగ్యులకీ- మాలలకీ.... మాదిగలకీ....

*     *     *     *     *     *

"మాదిగోడికి పొలమేమిట్రా? మన ఇట్టరీలో ఏడన్నా చూసి నావా అది?" మున్సబు చుట్టపీకి, "థూ" అని ఉమ్మితూ అన్నాడు.

రాజయ్య మాట్లాడలేదు. భూషణం చెయ్యి మీసం మీదికి పోయింది. కడుపులోంచి క్రితం రాత్రే మున్సబుతో కలిసి కొట్టిన మందు త్రేన్పుగా వస్తూంది.

"ఎల్లెల్లు ఏదో ఆయనిచ్చింది తీసుకుకొని- పన్చేసుకో పో-" మళ్ళీ అన్నాడు మున్సబు.

"ఇంకో రెండు గింజలు ఎక్కువ కావాలంటే భూషణాన్ని అడిగి తీసుకోరాదట్రా. పొలం నాదనడం దేనికీ....?" కరణం అన్నాడు.

రాజయ్య వాళ్ళ వైపు చూసేడు. మునసబు, భూషణం, కరణం. వెనక్కి తిరిగి తనవాళ్ళ వైపు చూసేడు. ఎల్లమంద, ఈరిగాడు, యూసపు. అవతలి వాళ్ళందరూ మాట్లాడుతున్నారు. ఇవతలి వాళ్ళు వినటం తప్ప ఇంకేమీ చేతకానివాళ్ళు, వింటున్నారు. మధ్యలో తను- అన్యాయం జరిగినవాడు.

భూషణం కళ్ళు ఎర్రగా వున్నాయి తాగీ తాగీ. తన కళ్ళూ ఎర్రగానే వుండొచ్చు, రాత్రంతా ఏడ్చీ, ఏడ్చీ.

కోపమొచ్చినా ఎర్రబడతాయట కళ్ళు, తెలీదు. జీవితం మొత్తం మీద కోపం వచ్చిందెప్పుడు? ఎప్పుడైనా తెచ్చుకొందామన్నా- దానికి వీలుకలిగించగలిగే పెళ్ళాం- పెళ్ళయిన రెండేళ్ళకే వెళ్ళిపోయింది.

"ఏమంటావురా!" మున్సబు అడిగేడు.

"ఆ పొలం మా తాతల్నాటిది దొరా?".

"నిజమేరా, మీ తాత నాకు తెల్సు గదా! భూషణం తాత దగ్గర పన్జేసేవాడు. ఆడికా బంజరు రాసిచ్చింది ఆయనేరా!".

"రాసిచ్చింది తీసుకుంటే ఎట్టనయ్యా?".

"రాసివ్వటం అంటే ఏకంగా రాసిచ్చి నా రేందిరా! మూడు సంవత్సరాలకి కౌలు కిచ్చనారు".

"బంజరుభూమి అది. దాన్ని మా తాత వదిలేసిండు. మా నాయన వదిలేసిండు. నేను దున్నిన మూడేళ్ళనుంచి అది పండుతోంది. ఇప్పుడు తీసుకుంటానంటే యెట్టనయ్యా?".

"మూడేళ్ళయిపోయింది కద. ఇదిగో ఈ కాగితం చూడు!" మాసిన కాగితం మీద మరకల ఇంకు.

ముప్ఫై సంవత్సరాల క్రితం వ్రాసిందా? మూడు నెలల్లో సృష్టించిందా?.

"న్యాయమంటే న్యాయమే. కాగితాన్నీ, కాగితం మీద వ్రాసిందాన్నీ నువ్వు కాదనలేవు గదా. ఇది నీ సంతకమే. అంటే అదే.....ఏలు ముద్ర అనుకో.... దాన్నీ కాదనలేవు కదా!! చూడు రాజయ్యా, ఈ చెట్టు క్రింద కూర్చొని నేనెన్నో తీర్మానాలు చేసినా, న్యాయాలు చెప్పినా, నువ్వు యినుకో. ఆ పొలం భూషణం స్వాధీనం చెయ్యి. కావాలంటే ఆడికిందే పన్జెయ్యి. ఆ పొలం

నువ్వే దున్ను. పండించు, నీ కూలి తీస్కో. ఆయన మంచాయన. మేం అందరం చెప్పినాం కాబట్టి వొప్పుకుంటుండు".

'పన్జెయ్యి, దున్ను, పండించు, కూలి తీస్కో. పండించింది ఆయన కియ్యి. ఆయన మంచాయన. కూలి యివ్వటానికి ఒప్పుకుంటాడు'.

రాజయ్యకి నవ్వూ యేడుపూ రాలేదు. చచ్చినోడు తగలపడ్తూంటే బతికున్నోడు శ్మశానంలో కూచుంటే కలిగే స్థితి. చేతులు కట్టుకొని అన్నాడు-

"ఏదయినా సెబ్దామన్నా నాకు ఎక్కువ బాసరా ద్దొరా! అయినా సెప్పాలికదా సెప్తే నాయం జరుగుద్ధనికాదు. సెప్పకుండా సెడిపోయానన్న బాధ, ముందు ముందు నాకు లేకుండా వుండేందుకన్నా అది సెప్పాలి. ముప్పై యేళ్ళక్రితం మూడేళ్ళకి భూమి రాసిచ్చినాయన మరింత కాలమూ దాన్నెందుకు అడగలేదంట....? అడుగుతున్నానని నారాజవకయ్యా! ఇదిగో యీ సేతుల్చూడు- ఈటిల్తో దున్నినా, ఈ పొలము తడిసింది నీళ్ళతో కాదయ్యా, సెమటతో. ఇప్పుడిప్పుడే అది కాసింత కనికరించి గింజల్ని రాలుత్తాంది.....మీ రీ కాగితము సూపించినారు. అది మా తాత రాసిందట ఆల్ల తాతకి! సచ్చినోడు ఎట్టానూ రాడు. సావలేక బతకలేక శవాల్లా బతుకుతున్న మాలాటి వోల్లకి సాచ్చం చెప్పటానికి దేవుడు కూడా దాక్కుంటాడు".

కరణం కదిలేడు, అసలింతసేపు వీడ్ని మాట్లాడించటం ఏమిటీ అన్నట్టు మనసబు వేపు చూసేడు.

"ఈ సంతకం నీదే కదయ్యా!" దీనికేం చెప్తావన్నట్టు మున్సబు అడిగేడు. రాజయ్య నవ్వేడు.

"సిన్నప్పుడు బడిపంతులు మనూల్లో యిల్లిల్లూ తిరిగి పిల్లగాళ్ళందర్నీ సదువుకు రమ్మని పిల్చేవోడు, గుర్తున్నదా దొరా? మా నాయన అప్పుడప్పుడు- 'నా కొడుకుని పంపితే ఏమున్నది పంతులూ, పన్నెండేళ్ళు నీ యిస్కూల్లో వుంచుకుని యెనిమిదో కలాసుదాకా జెప్పిస్తావు. ఆ తరువాత జెప్పేందుక్క మీ దగ్గరేమి వుండదు. జెప్పించుకొనేటందుక్క మా దగ్గరా పైసలుండవ్. అక్కడితో ఆగిపోతాడు. అంత చదువు చదివినాడు కాబట్టి ఆడితో మెరక దున్నించలేను. అంత కొద్దిగా సదివినాడు కాబట్టి సర్కారోళ్ళు ఉద్దోగం కూడా యియ్యరు. రొటికి సెడిపోతాడు'- అన్నాడు మా నాయన. 'చదువే ముఖ్యం' అన్నాడు పంతులు. పెపంచాన్ని సూసేటందుక్క సదువుకోవాల్నంట. అప్పుడే దేశం బాగుపడుద్దన్నాడు. నాకు బాగా గురుతు. దేశము బాగుపడేదంటే ఏదో తెలియకున్నా పంతులు సెప్పిన మాటలు మాత్రం బాగా యాదున్నాయ్. పోరగాళ్ళతో కలిసి యిస్కూలు కెళ్ళాలంటే గదో సర్దా. మా నాయన 'గద్సరే పంతులూ, మావోడు కూలికెల్తే రెండు రూపాయల కూలి దొరుకుద్ది కదా, మరి నీతో పంపిస్తే ఏం దొరుకుద్ది?' అని అడిగిండు. నాటకాల్లో ఏసాలేసే పంతులు నాటకంలోలాగే 'ఇజ్ఞానము

దొరుకుద్ది. జ్ఞానము వద్దు బాబూ, ఇంత తిండి దొరికితే సాల'న్నాడు మా నాయన. 'స్కూల్లో యింత మంది సదువుతున్నట్టు సర్కారోడికి సూపించాలి ఎట్లా?' గన్నడు పంతులు. 'మావోడు యిస్కోలు కొస్తున్నట్టు రాసుకో, ఆడ్ని కూలి కొదిలి పెట్టు' అన్నాడు నాయన. మీయందరిని యిట్ట నిలబెట్టి మాట్లాడుతున్నానని కోపము దెప్పించుకోకండయ్యా! ఇంతకి నే సెప్పేది నాకు సదువు అంటలేదని. 'అ'కి 'ఈ' కి తేడా తెల్వనోడి కాద కాగితము బెట్టి నీకు సర్కారోడు ఎరువులు మంజూరు చేసిండు అంటే ఒకసోటా ఏంది దొరా.... ఎయ్యమన్న సోటల్లా ఏలముద్ర లేస్తము నేనూ, ఈసోపూ, ఈరిగాడు. ఇప్పుడా కాగితము సూపించి 'ఇదే నాయం?' అంటే ఏం జేస్తం? నాయం గదేనేమో అనుకుంటము. అంతకన్నా ఏం జేస్తం? చెట్టుకింద కూర్చొని నివ్వెన్ని నాయాలు సెప్పినవ్. ఈ రోజు మళ్ళీ గచే సెబ్తున్నవ్, దాన్ని యినుకొని నేన్నా ఇస్లు వదిలిపెత్త. ఉండేటందుక్కు ఏ సెట్టో సూస్కుంట. ఈ సెట్టుకింద కూర్చొని నువ్వు సెప్పింది యినుకొని.... నేనూ ఇంకో సెట్టుకిందికి సేరిపోత...." అంటూ వెనక్కి తిరిగేడు.

భూషణం మన్సబును చూసి నవ్వేడు. మున్సబు కరణాన్ని చూసి నవ్వలేదు ప్రిస్టేజికి భంగమని.

రచ్చబండమీద నుంచి అందరూ లేచేరు. అప్పటికే అన్యాయం జరిగినోళ్ళు నాలుగొందల గజాలు వెళ్ళిపోయారు.

న్యాయం చెప్పిన వాళ్ళు ఇళ్ళవైపు సాగిపోతున్నారు.

అప్పుడో శబ్దం వినిపించింది. ఫెళా ఫెళా విరిగిన శబ్దం. అటువాళ్ళూ, ఇటువాళ్ళూ వెనుదిరిగి చూసేరు. అప్పటివరకూ పచ్చగా కళకళలాడిన ఆ చెట్టు యెవరో తోసినట్టు పైకిలేచి పెద్ద శబ్దంతో పక్కకి ఒరిగిపోయింది.

## ఆకాశానికి నమస్కారం

లాస్ ఏంజిల్స్, డిశంబర్ 14: మన సౌర కుటుంబమూ, నక్షత్ర సముదాయమూ పాలపుంతలోని నక్షత్ర సముదాయాలూ గంటకు 16 లక్షల కిలోమీటర్ల వేగంతో కన్యారాశి వైపుగా దూసుకుపోతున్నాయని, ఆ దిశలోవున్న బృహత్తర నక్షత్ర మండలి పెను బలంతో మన పాలపుంతను ఆకర్షిస్తుండటమే దీనికి కారణం అనీ జార్జిస్మూట్ అనే శాస్త్రవేత్త భావిస్తున్నారు. మన భూమితో సహా మన నక్షత్ర సముదాయమంతా సెకనుకు అయిదువందల కిలోమీటర్ల వేగంతో రోదసీలో పయనిస్తోందని కాలిఫోర్నియా యూనివర్శిటీకి చెందిన ఆ శాస్త్రవేత్త చెబుతున్నారు. మన సమస్త నక్షత్రాలూ ప్రళయ వేగంతో ఎందుకు ప్రయాణం చేస్తున్నాయో

అన్నది కలవరపరిచే ప్రశ్న అనీ, బహుశా ఏ రాకాశి గ్రహంలో తిరుగులేనంత బలంతో మనని ఆకర్షిస్తున్నాయన్నది మాత్రం నిశ్చయం అని స్మూట్ చెప్పారు.

అటువంటి మహా నక్షత్ర సముదాయం ఒకటి ఉన్నట్లయితే అటు వంటివి ఇంకా అనేకం వుండవచ్చునని ఊహకందని బ్రహ్మాండ పరిమాణంలో పదార్థ సముదాయాలు ఆ ప్రదేశంలో వుండవచ్చునని ఆయన అన్నాడు.

15-12-79 నాటి 'ఈనాడు' వార్త

*   *   *   *   *   *

ఇరాని హోటల్లో కూర్చుని వున్నాడు రమణ. జేబులో అర్థరూపాయుంది. 'టీ'కి ఆర్డరిచ్చాడు. హోటల్లో ఎవరూ లేరు. ఎవరో పొట్లంలో భోటనం చేస్తున్నారు.

భరించలేనంత నిస్సహాయత!! ఈ ఉద్యోగమూ రాలేదన్న భావం మనసుని పరపరా కోస్తూంది....చదివిన చదువు వ్యర్థం అయిపోతూంది....ఇంట్లో తండ్రికి బాగాలేదు.... అన్నయ్య జీతం ఇంట్లో రెండు పూటలా తిండికే సరిపోవటం లేదు. ఎలా? అవునెలా?

ప్రశ్న చాలా చిన్నది.

సమాధానం విశ్వమంత పెద్దది.

చెంపమీద ఏదో జారినట్టు అనిపిస్తే తడిమేడు. కన్నీటి చుక్క, అంత బాధలోనూ నవ్వొచ్చింది.

"ఏమిటి-? ఏడుస్తూ నవ్వుకొంటున్నావ్?".

హఠాత్తుగా వినిపించిన ప్రశ్నకి తలెత్తి చూసేడు. ఒక ముసలివాడు.... యాభై అయిదేళ్ళవాడు......చిరుగడ్డం.... తెల్లబడిన బట్టతల.....ఒక లాంగ్‌కోటు....పైజమాలాటి లూజు ప్యాంటూ....తైల సంస్కారం లేని జుట్టు...కొద్దిగా మాసిన గడ్డం....పీక్కుపోయిన దవడలు....

"వాతావరణంలో ఆక్సిజనుంది వంట్లో హైడ్రోజనుంది. ఆ రెండూ కలిస్తే కంట్లో నీరుంది. బై ది బై ఒక టీ కొట్టించు" అని చొరవగా ఒక కుర్చీలో కూర్చున్నాడు.

రమణకి నవ్వొచ్చింది. తన దగ్గరున్నదే అర్థరూపాయి వదిన్ని అడుక్కొన్నది. అడుక్కొన్న వాడి దగ్గిర అడుక్కొనేవాడు. "కూర్చో" అన్నాడు రమణ.

"కూర్చునే వున్నాను" అన్నాడు "బై ది బై నీ వయసెంత? ఇరవై అయిదు ఉండవూ? నాకు డెభ్బై అయిదు. ఆఫ్‌కోర్స్..... అంతలా కనబడవనుకో. కానీ నీకన్నా మూడు రెట్లు ఎక్కువ. అందుకని మూడక్షరాలతో పిలువు. 'కూర్చోండి' అను. వెధవ సెల్ఫ్ రెస్పెక్టొకటి ఏడిచింది కదా?".

"సారీ!" అన్నాడు రమణ నొచ్చుకుంటూ "ఏదో పరధ్యానంలో ఉన్నాను".

"ఏదైనా లవ్వెఫైరా- లేక ఉద్యోగమా! నీ సమస్య? యూత్‌ని బాధిస్తున్నవి అవి రెండే".

"ఉద్యోగం" అన్నాడు రమణ "ఇప్పుడే ఇంటర్వ్యూ నుంచి వస్తున్నాను".

"ఏమడిగేరు?".

అడిగిన ప్రశ్నలూ.... తను చెప్పిన సమాధానాలూ వివరించేడు. ఒక్కొక్కటీ చెబ్తూంటే అతడు ఆసక్తిగా ముందుకు వంగి విన్నాడు. ఇంకా విని, "నువ్వు ఆస్ట్రానమీ స్టూడెంటువా?" అని అడిగేడు.

కాదన్నాడు రమణ.

"మరింత కరెక్టుగా సమాధానం చెప్పేవ్?".

"ఈ కాలంలో ఇంటర్వ్యూ కెళ్ళాలంటే ఎన్ సైక్లోపీడియా అంతా కంఠతా వచ్చి వుండాలి" నిర్లిప్తంగా అన్నాడు రమణ.

ఇంతలో టీ వచ్చింది. ఇద్దరూ టీ తాగి బయటికొచ్చారు.

"నువ్వు నా దగ్గరెందుకు ఉద్యోగం చెయ్యకూడదూ? బై ది బై ఒక చార్మినార్ సిగరెట్టుకి డబ్బులుంటే చూడు. టీ తాగిం తర్వాత వెధవది సిగరెట్ ఉండకపోతే ప్రాణం నిలబడదు. అన్నట్టు .... ఏం చెబ్తున్నానూ.... ఉద్యోగం గురించి. ఎస్. నువ్వు నా దగ్గర ఉద్యోగం ఎందుకు చెయ్యకూడదూ?".

అకస్మాత్తుగా అతడి మెదడు గురించి అనుమానం వచ్చింది రమణకి, దాన్ని ప్రదర్శించకుండా "మీరేం చేస్తూ వుంటారు!" అని అడిగేడు.

"ఆకాశంకేసి చూస్తూ వుంటా".

"నేనేం చెయ్యాలి?" నవ్వాపుకొంటూ అడిగేడు.

"జీతం?".

"ఎంత కావాలి గ్రాడ్యుయేటూ?".

"వెయ్యి రూపాయలు" ఎంత ఆపుకుందామన్నా నవ్వాగటం లేదు.

"అంత ఇచ్చుకోలేను. నాలుగొందలు యిస్తాను. ఒక చోటనుంచి రావల్సిన డబ్బు వుంది. అది రాగానే వెయ్యి చేస్తాను".

"ఎక్కడ్నుంచి రావాలి?".

"స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్ నుంచి. ఆల్ ఫ్రెడ్ బి నోబుల్ అనే ఆయన పంపాలి".

"ఎంత?".

"లక్ష పౌండ్లు. సుమారుగా ఇరవై లక్షల రూపాయలు".

"నోబుల్ ప్రైజా?".

"అంతే...".

తెరలు తెరలుగా నవ్వొచ్చింది రమణకి. ఇక ఆపుకొనే ప్రయత్నం ఏదీ చెయ్యలేదు.

నవ్వుతూనే కాంపౌండులోకి ప్రవేశించేడు చాలా పురాతన మైన ఇల్లు అది.

బయట బాగా పిచ్చి మొక్కలు పెరిగి వున్నాయి. ప్రహారీ గేట్లు పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంట్లోంచి బయటకీ, బయట్నుంచి ఇంట్లోకి గబ్బిలం ఒకటి ఎగురుతూ వుంది. పై కప్పు ఇరవై అడుగుల ఎత్తుంది. సాలెగూళ్ళు వేలాడుతున్నాయి.

"ఎవరిదీ ఇల్లు?" చుట్టూ చూస్తూ అడిగేడు.

"నాదే" అన్నాడతను "మా అమ్మమ్మ నాన్నకి ఆ కాలపు నవాబు రాసిచ్చేడు. అది నాకు వచ్చింది".

వీధికి చాలా లోపలగా, మూలగా వున్నదా భవనం. నవాబుల ఒకప్పటి రమ్యహర్మ్యాలు యిప్పుడు ఆ స్థితిలో వుండటం అతడికి తెల్సిందే. అందుకే అతడికి ఆశ్చర్యం కలగలేదు. అలాంటి పాడుబడిన ఇళ్ళు ప్రస్తుతం భిక్షగాళ్ళకి నివాస కేంద్రాలు. దూరంగా గ్రౌండులో పిల్లలు ఆడుకొంటున్నారు.

అతడు నడుస్తూ వుంటే కాలికింద దుమ్ము పైకి లేస్తోంది. చాలా పెద్ద ఇల్లు అది. నగరపు నడిబొడ్డులో వుంది. అద్దెకిస్తే నాలుగు వేలకి తక్కువ రాదు. అతను ఆలోచనల్లో వుండగానే కాలికేదో తగిలింది తీసి చూస్తే మున్సిపల్ కార్పొరేషన్ వాళ్ళ కాగితం. పన్ను కట్టమని నోటీసు.

"అలాంటి పన్లన్నీ నువ్వు చెయ్యాలి" అన్నాడు.

"నేను మర్చిపోతూ వుంటాను. టీ కొచ్చి డబ్బులు మర్చిపోయినట్టు...." మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు "అన్నట్టూ నీకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ టైపుచేసి కావాలా, ఓరల్‌గా సరిపోతుందా? టైప్‌ది కావాలంటే వెళ్ళి టైపు చేయించి తెచ్చుకో.... ఏది కావాలి?"

"నాకు అడ్వాన్స్ కావాలి...." అన్నాడు రమణ.

'ఇంటి కెళ్ళి చేసే పనేమిలేదు ఇక్కడ బాగానే ఉబుసు పోతోంది' అనుకున్నాడు.

"అడ్వాన్సు నోబుల్ ప్రైజు వచ్చాక. ప్రస్తుతం డబ్బంతా ఇన్వెస్టుమెంటుతో వుంది"

"మీ పేరు".

"ప్రొఫెసర్ ఆరోగ్య మరపు ఆనంద మార్గం" అన్నాడు ఎడమవైపు గదిలోకి నడుస్తూ, "అందరూ ఎ.ఎమ్.ఎ.ఎమ్, అంటారు. చివరందే 'అయోమయం' అయింది."

రమణ నవ్వుతూ "ప్రొఫెసర్ అయోమయంగారూ...." అంటూ ఏదో అనబోయి చప్పున ఆగిపోయేడు.

అప్పటికే వాళ్ళు ఎడమవైపు గదిలో ప్రవేశించారు. దానికి పైకప్పులేదు. పెద్ద అద్దం బిగించి వుంది. పెద్ద రివాల్వింగ్ డోమ్ మీద అజిమొటాల్ యాబ్లైమీటర్లు పొడవూ, నలభై అయిదు మీటర్ల డయామీటరూ వున్న టెలిస్కోపు హుందాగా నిలిబడి వుంది.

ప్రపంచలోకెల్లా పెద్ద టెలిస్కోపు రష్యాలో వుందని విన్నాడు. కానీ యిప్పుడు

చూస్తున్నాడు. అతడు ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే వెనకనుంచి ప్రొఫెసర్ కంఠం వినిపించింది.

"మీ జనరల్ నాలెడ్జి పుస్తకంలో యిది కనపడదు. జెలింస్కియా, నార్త్ కేకాసస్‌లో వున్న స్కోప్ కంటే ఇది పెద్దది. నేనే తయారు చేశాను దేన్ని. బై ది బై ఇంకో సిగరెట్టూంటే యివ్వు. దీన్ని.... ఐ మీన్ యీ స్కోప్‌ని తయారు చెయ్యడానికి పన్నెండు సంవత్సరాలు పట్టింది. మా అమ్మమ్మ నాన్నకి ఆ నవాబు ఇచ్చిందంతా ఖర్చయింది. దీని బరువు తొంభయి అయిదు టన్నులు, లెనిన్‌గ్రాడ్ ఆప్టికల్ ఇంజనీరింగ్ అమాల్గమేషన్ వాళ్ళు దీన్ని చూస్తే మూర్ఛబోతారు. దాన్ని అమ్మితే యెంతొస్తుందో తెలుసా?- నీ జీతం అడ్వాన్స్ ఇవ్వలేదని అనుమానపడకు. దీనికి ఉపయోగించిన ఇనుముతో పదకొండు పెట్టెలున్న పాసింజర్ ట్రైను తయారు చెయ్యొచ్చు. జీడీల వాడికి అమ్ముకుంటే రెండువేల మంది జీవితాంతం తినటానికి సరిపోయేటన్ని జీడీలు వస్తాయి. దీని పేరేమిటో తెలుసా? లిప్పర్ షే. టెలిస్కోపు కనుక్కొన్నది గెలీలియో అని మీరందరూ అంటారు. కాదు. లిప్పర్ షే. అసలు మీకు జనరల్ నాలెడ్జి ఏం తెలుసని? ఊరు మధ్యలో వున్న టెలిస్కోప్ సంగతి యెవరికి తెలియదు. కాలిఫోర్నియా-మౌంట్ విల్సర్ అబ్సర్వేటరీలో వున్న ప్రొఫెసర్ ఆడమ్స్.... ఇప్పుడు లేడులే. పోయేడు. అతని కొక్కడికే తెలుసు. బై ది బై యీ టెలిస్కోప్‌లో యెంతదూరం చూడొచ్చని నువ్వు అనుకుంటున్నావు?"

నోట్లో తడారిపోతుండగా తెలీదన్నట్లు తల అడ్డంగా వూపేడు.

"పదివేల మిలియన్‌ల కాంతి సంవత్సరాలు. కాంతి సంవత్సరం అంటే?" ఆగాడు. "సెకనుకి లక్షా యెనభయి ఆరువేల మైళ్ళ వేగంతో కాంతి ప్రయాణం చేస్తుంది. లెక్క కట్టు సెకన్‌లు అరవై ఇంటూ నిముషాలు అరవై ఇంటూ గంటలు ఇరవై నాలుగు ఇంటూ మూడు వందల అరవై ఐదు రోజులు అయితే ఒక సంవత్సరం. దాన్ని లక్షా యెనభై ఆరు వేల మైళ్ళతో హెచ్చిస్తే ఒక కాంతి సంవత్సరం. ఈ టెలిస్కోపు అంత దూరం చూస్తుంది. లెక్క కట్టేవా గ్రాడ్యుయేటూ? 54132960000000000000 మైళ్ళు. అన్ని మైళ్ళ విశ్వాన్ని రోజూ చూస్తాన్నేను. అజిమెటల్ మౌంటింగ్, అంటే ఆకాశంలో ఏ మూలకైనా తిరుగుతుంది ఇది. నాకింకో కోర్కె వుంది. విశ్వం నలుమూలలనుంచి వచ్చే రేడియేషన్‌ని పెద్ద 'ఆంటెనా' పెట్టి చూడాలని. తెలుసుగా ఆంటెనా అంటే...."

రమణకి తెలీదు. అయినా తెలుసన్నట్లు తలూపేడు. అతను, తను చూస్తున్నది కల కాదని నమ్మకం కలిగించుకోవడానికే బ్రహ్మ ప్రయత్నం చెయ్యవలసి వస్తోంది.

"చెప్పు గ్రాడ్యుయేటూ.... చేస్తావా నా దగ్గర పని?"

చప్పున వాస్తవంలోకి వస్తే.... ఇంటిదగ్గర బీదరికం. మాలతి కళ్ళలో తనపట్ల ప్రేమ. ఆమె

తండ్రికి తనపట్ల నిర్లక్ష్యం. నాన్న దగ్గు.... అన్నయ్య చాలీచాలని జీతం చాక్లెట్లకోసం నోరు తడిచేసుకొనే గోపి. బాధల్ని చిరునవ్వుతో నొక్కిపట్టే వదిన.

"నా దగ్గర ప్రస్తుతం తక్కువుంది గ్రాడ్యుయేటూ. ఉన్నదంతా.... చూసేవుగా. ఖర్చు పెట్టేసేను."

అతడి మొహంలో కనబడిన విషాదఛాయకి విచలితుడై "నేనేం చెయ్యాలి?" రమణ అడిగేడు.

"నాతో పాటూ ఆకాశంలోకి చూడాలి. కొత్త 'ప్లానెట్' దొరకవచ్చు. కొత్త 'గలాక్సీ' కనపడొచ్చు. నోబుల్ ప్రైజు రావడానికి చాలదా? అదుగో, కదలకుండా చూపు ఎడమవైపు తిప్పి చూడు. ఎలుక ఒకటి మనల్ని వెక్కిరిస్తున్నట్లు మీసాల్ని ఎలా తిప్పుతూందో! కనీసం దాని గర్వాన్ని అణచటానికైనా మనం ఒక గొప్ప విషయాన్ని కనుక్కోవాలి. ఏమంటావ్!"

రమణ తలూపేడు చేస్తానన్నట్టు.

## *జూన్ ఇరవై తొమ్మిది*
## *తెల్లవారుఝాము నాలుగున్నర!*

శాన్ ఫ్రాన్సిస్కో, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఎయిర్ కండీషన్డ్ వాతావరణం. పసిఫిక్ సముద్రం పక్కగా, కాలిఫోర్నియా దక్షిణప్రాంతపు కొండల్లో వుండటంవల్ల దానికా సౌలభ్యం చేకూరింది. మూడువైపులా సముద్రం, ఒకవైపు కొండలూ ఉండడంవల్ల ప్రపంచపు గొప్ప రేవు పట్టాణాల్లో ఒకటిగా పేరు పొందింది. పట్టణంలోకి ప్రవేశించటానికి ముఖ్య ద్వారం గోల్డెన్ గేట్.

రకరకాల వాతావరణం, రకరకాల మనుష్యులూ ఉన్న పట్టణం అవటంచేత దాని పెరుగుదల గమ్మత్తుగా జరిగింది. ఉత్తర ప్రాంతాల్లో రష్యన్లూ.... నాబ్‌హిల్ దాటేక ఇటాలియన్ క్వార్టర్లూ.... గోల్డెన్ గేట్, ప్రెసీడియోల మధ్యనున్న రిచ్‌మాండ్ సెక్షన్‌లో ఓల్డుటౌనూ కనిపిస్తాయి.

సముద్రతీరానికీ, మిషన్‌స్ట్రీట్‌కీ మధ్య దక్షిణ దిశగా పారిశ్రామిక వాడలు పెరిగినయి.

బేషార్న్ హైవేమీద మెక్ కారు దూసుకుపోతున్నది. అక్కస్మాత్తుగా ఉపద్రవం సంభవిస్తే తప్ప తనకి అంత అర్జెంటుగా పిలుపురాదని అతడికి తెలుసు. దాదాపు ప్రపంచం మొత్తాన్ని ఆజ్ఞాపించగల ఒక దేశపు అత్యున్నత పదవిలో వున్న మనిషికి ఫస్టు సెక్రటరీ అతడు. ఎటువంటి ఉపద్రవం....? ఏదయినా కావచ్చు.

ప్రపంచంలో నిముషానికి యాభయి లక్షల ఖర్చు.... ఆయుధం ఉత్పత్తి గురించి జరుగుతూంది. ఎంత గొప్ప చేదునిజం! ప్రొఫెసరు కాంట్రోఎట్జ్ చెప్పింది నిజమైతే- ఇంకో

అయిదు సంవత్సరాల్లో 'లాసర్ బీమ్' ఆయుదాన్ని రష్యా తయారు చేస్తుంది. కాంతి వేగంతో అవతలి గమ్యాన్ని నాశనంచేసే సాధనం అది.

నిజానికి యుద్ధం ఒకటే కాదు ప్రమాదం-

రోజురోజుకీ పెరుగుతున్న జనసాంద్రత.

.... పూర్వం లేనన్ని వాతావరణ విపరీతాలు, భూకంపాలు, తుఫానులు.... హింసాప్రవృత్తి... డ్రగ్స్. శాడిజం, పాకిపోతున్న సుఖవ్యాధులూ, వాతావరణ కాలుష్యం.

మానవజాతి మరణించకుండా ఏ శక్తి ఆపగలదు?

కారు ఎల్‌కామినోరియల్ నుంచి స్కై లైన్ బౌల్‌వార్డ్ వైపు సాగిపోతూ వుండగా అతను అనుకొన్నాడు.

ఇంకా తెల్లవారటానికి వ్యవధి వుంది. కొద్దిగా మంచు కురుస్తూంది.

థర్డ్ స్ట్రీట్‌లో వున్న పెద్ద భవంతి ముందు కాంటెస్సా ఆగింది. విశాలమైన మెట్లు, కొద్దిగా తెరచి ఉన్న తలుపు. లోపలి యూనిఫారంలో ఉన్న గార్డులు. ఓవర్‌కోటు సవరించుకొంటూ మెక్ లోపలికి ప్రవేశించాడు. కారిడర్‌లో లైట్లు వెలుగుతున్నాయి. అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వుంది.

అక్కడక్కడా అసిస్టెంట్లు మౌనంగా తిరుగుతున్నారు. పెద్ద తుఫాను రావడానికి ముందున్న వాతావరణం అక్కడ నెలకొనివుంది. పది అడుగులు ఎత్తున్న చెక్క తలుపులు దగ్గరగావేసి ఉన్నాయి. నాబ్ తిప్పి, నెమ్మదిగా తెరిచేడు.... లోపల లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. మధ్యలో ఓవల్ షేప్‌లో పెద్ద బల్లవుంది. చుట్టూ కూర్చొని వున్న వాళ్ళని వరుసగా చూసేడు.

అండర్ సెక్రటరీ టు డిఫెన్సు మినిష్టర్ చార్లెస్ మెక్డోనాల్డ్, ప్రెసిడెంట్ ఆఫ్ ది పార్లమెంటరీ కమిటి జాన్ నికల్సన్, సెక్రటరీ ఆఫ్  స్టేట్- రాబర్ట్ ఫిన్చ్, ప్రెసిడెంట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ రోగర్స్.... మెక్ చూపు పక్కకి కదిలి ఆగిపోయింది. అంత చలిలోనూ నుదుటిమీద చమట పట్టింది. చేతులు రెండూ వళ్ళో పెట్టుకుని ముందుకు వంగి కాగితాల్ని పరిశీలిస్తూ ఒక వృద్ధుడు అక్కడ కూర్చుని ఉన్నాడు.

అతడు ఫస్ట్ సెక్రటరీ ఆఫ్ సెంట్రల్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ సోవియట్ రష్యా- బోరిస్. ఎఫ్ కాస్టినోవా.

* * * * * *

రెండు చేతులూ చెంపల కాన్చుకొని ఆలోచిస్తోంది శైలజ. ఆమె ముందు ఇంటర్వ్యూ తాలూకు ఫైలూ, అభ్యర్థుల మార్కుల లిస్టూ వుంది.

ఆ రోజు రమణికి ఇంటర్వ్యూ జరుగుతున్నప్పుడు ఆమె ఏదో పని ఉండి, ఆ రూమ్‌లోకి

వెళ్ళింది. రమణని చూసి 'ఎక్కడో చూసినట్టు ఉందే' అనుకొంది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది రాణి ఫోటో చూపించిన సంగతి.

ఆమె బయటకొస్తూంటే అతనన్న మాటలు వినిపించినయ్.

"ఇలాంటి ఇంటర్వ్యూ లుండవు, ఎయిర్ కండీషన్డ్ రూములుండవు.... ప్రశ్నలుండవు.... సమాధానా లుండవు."

ఆమెకి నవ్వొచ్చింది.  నిజానికి అతడు అంతకు ముందు సమాధానాలన్నీ చక్కగా చెప్పేడు. అతడి సబ్జెక్టు కాకపోయినా.

కానీ మేనేజిమెంట్ అభ్యర్థి ఇంకొకతను ఉన్నాడు, రికమెండేషను కేండేటు- అతడి నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది. ఈ ఇంటర్వ్యూ కేవలం బయటవాళ్ళని సంతృప్తి పరచటానికే.

ఆమె లిస్టు చూసింది.          ఉద్యోగం ఇవ్వాలనుకున్న అభ్యర్థికి నూటికి తొంభై మార్కులిచ్చేరు కమిటీ సభ్యులు. రెండోవాడెవడో రామన్ అట, అతడికి యాభై మార్కులు వచ్చినయ్.

ఆమె రమణ పేరు కెదురుగా చూసింది.

సున్నా వుంది.  ఆమె పేలవంగా నవ్వుకొంది. నిజానికి అతను చెప్పిన సమాధానాలకి నూటికి నూరు రావాలి. కేవలం అతడికి ఉద్యోగం ఇవ్వటం ఇష్టంలేక అతణ్ణి రెచ్చగొట్టి, ఆ నెపం మీద సున్నా మార్కులిచ్చేరు.

రికమెండెడ్ కాండేట్ క్వాలిఫికేషను వైపు చూసింది.

ఇంటర్మీడియేడ్- ఫస్ట్‌క్లాస్.

ఆమెకి రమణ మీద జాలివేసింది సర్టిఫికెట్లు సర్దుకొంటూ అతడు నిస్సహాయంగా చూసిన చూపు ఆమెకింకా జ్ఞాపకం ఉంది.

కానీ ఏం చేయగలదు-

-ఫైలు సర్ది లోపల పెట్టి, ఆ రోజు పోస్ట్ తీసింది. ఒక్కో ఉత్తరమే చదవసాగింది.

నాలుగో ఉత్తరం చదువుతూ ఆమె ఉలిక్కిపడింది. ఉద్యోగం వచ్చిన అభ్యర్థి దగ్గర్నుంచి అది. 'ఇంతకన్నా మంచి ఉద్యోగం వచ్చినందు వల్ల దీంట్లో చేరలేనందుకు విచారిస్తున్నాను' అని. రికమెండేషను వున్న వాడికి ఇంతకన్నా మంచి ఉద్యోగం రావడంలో ఆశ్చర్యం లేదు.

అయితే ఈ ఉద్యోగం ఇప్పుడెవరికి వస్తుంది?

రామన్ అనే మద్రాసీకి.

అంటే కమిటీ మెంబర్లలో ఎవరికీ రెండో కేండెట్ మీద ఇంట్రెస్టు లేదన్నమాట.

ఆమె మనసులో తెరలాగా ఒక ఆలోచన వచ్చి సన్నగా వణికింది.

అలా చేస్తే-

ఎవరికైనా తెలిస్తే-

ఎలా తెలుస్తుంది?.

అయినా ఎందుకు చెయ్యాలి?.

అన్యాయం జరిగిన ఒక యువకుడికి న్యాయం చేకూర్చటం కోసం.

అయినా రిస్కు.....

...........

పరస్పర విరుద్ధ భావాల్తో ఆమె కొంచెం సేపు కొట్టుమిట్టు లాడింది. చివరకు ఓ నిర్ణయానికి వచ్చినట్టు కలం చేతిలోకి తీసుకొంది.

రామన్ అన్న ఇంగ్లీషు పేరుకి చివర 'ఏ' అన్న అక్షరం కలిపింది.

*　　*　　*　　*　　*　　*

ఒక పెద్దపులి రెండు కాళ్ళతో నడుస్తూ మీద మీదకి వస్తున్నది. మిగిలిన రెండు చేతులూ భయంకరంగా సాచి, గోళ్ళతో చీల్చి చెండాడటానికి ముందుకొస్తున్నది. కేక వేయబోయాడు. నోటి వెంబడి మాటరాలేదు. పరుగెత్తసాగేడు. వెనుకే పులి, ఆగి వెనక్కి చూసి మళ్ళీ పరుగెత్తసాగాడు. అంత పరుగెత్తినా అడవి తరగటం లేదు అడవి. అంతా అడవే. పులి వెనుకే వస్తున్నది.

చప్పున ఆగిపోయేరు. ఎదురుగా పెద్ద వాగు పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది. వెనక పులి గాండ్రిపులు వినిపిస్తున్నాయి. చుట్టూ చూసేడు. చుట్టూ ఫైళ్ళు. పెద్ద పెద్ద చెట్లలా బీరువాలు, చెట్లకి ఆకులు లేవు. ఫైళ్ళు వేలాడుతున్నాయి ఆర్డినరీ..... అర్జెంట్.... ఇమీడియేట్..... కాగితాలు లేస్తున్నాయి. దుమ్ము, పేపర్ బాస్కెట్ లోంచి సుడిగాలిలా లేస్తున్న కాగితాలు.

ఇంత చుట్టూ చేరింది.

వెనుకనుంచి పులి మీదకి దూకింది.

కెవ్వున అరిచేడు.

"ఏవండీ.... ఏవండీ...." అని తట్టి లేపింది జానకి.

ప్రకాశరావు కళ్ళు తెరిచేడు. వళ్ళంతా చెమట పట్టింది. మనిషి వణికిపోతున్నాడు.

"ఏమైందండీ?" అడుగుతూంది.

అతడు కొంచెంసేపు మాట్లాడలేదు. తరువాత బలహీనమైన కంఠంతో "మంచినీళ్ళు" అన్నాడు.

ఆమె లేచివెళ్ళి మంచి నీళ్ళు తెచ్చి యిచ్చింది. వణుకుతూన్న చేతుల్తో అందుకొని గబగబా తాగేడు.

జానకికి భర్త సంగతి తెలుసు.

"ఏమైందండీ?" అని అడిగింది.

"కల, భయంకరమైన కల" అన్నాడు.

"ఏమిటి?".

కలని వర్ణించి చెప్పేడు.

"పులి రెండు కాళ్ళ మీద నిలబడి వుందా?".

"ఆ....! రెండు కాళ్ళ మీద మనిషిలాగే వుంది".

"మొహం పులిలాగే వుందా?".

"ఆ, పులిలాగే...వూహు....కొద్దిగా పులీ-కొద్దిగా మనిషీ- అలా వుంది".

"మనిషి ఎలా వున్నాడు?".

"మా హెడ్ క్లర్క్‌లా వున్నాడు".

ఆమెకి అతడి మీద జాలేసింది.

"ఆఫీసులో యేదైనా గొడవ జరిగిందా.....!".

అతనో క్షణం ఆగి అన్నాడు. "ప్రతిరోజూ వుండేదే. నాకు డ్రాఫ్టు వ్రాయటం కూడా సరిగ్గా రాదట. అందరి ముందు పట్టుకొని....నాకన్నా ప్యూన్ దస్తగిరి నయమట".

"లాగి పెట్టి కొట్టలేకపోయారా?".

"అంత ధైర్యమే వుంటే ఇంతవరకు ఎందుకొచ్చేది?".

ఆమెకి విసుగేసింది. "మరేం చేసేరు? చేతులు కట్టుకొని విన్నారా?".

"అతడు మా హెడ్ క్లర్క్!".

"అయితే నేమండి! వాడు మెట్రిక్యులేషన్ అయినా పాసవలేదని మీరే అన్నారు. మీరు యల్లెల్బీ. నిజంగా మీరు డ్రాఫ్టు చాలా బాగా వ్రాస్తారు. ఎస్సెస్సీ చదివిన నాకే అది ఎంతో ముచ్చటగా వుంటుంది. అటువంటిది మీ క్లర్క్‌కి నచ్చలేదంటే అది వాడి ఓర్వలేనితనాన్ని సూచిస్తుందే తప్ప మిమ్మల్నే మీ కించపరచటంలేదు. మీరు చెయ్యాల్సిందల్లా వాడ్ని ఎదుర్కోవడమే. ఒక్కసారిగా తిరగబడండీ....! అప్పుడు చూడండి ఏమవుతుందో.... ఆఫీసరు కూడా మీ మాటే అవునంటాడు. మీలో మీరిలా కుంచించుపోవడం మొదలు పెడ్తే చివరికి మీ ప్యూన్ కూడా మీకు పని చెప్తాడు. కొంచెం బలం తెచ్చుకోండి! మనసు దిటవు పర్చుకోండి. పులితాలుకు భయం ఎక్కడో లేదండి! మీ మనసులో వుంది. అసలే మీ ఆరోగ్యం మంచిదికాదు. దానికితోడు ఈ పాడు ఆలోచనలు ఒకటి. అన్నీ మర్చిపోండి. ఇలా నా దగ్గరికి రండి. నా వళ్ళో తల పెట్టుకొని పడుకోండి! ఎందుకండీ భయపడ్తారు? మనం బ్రతుకుతున్నది భయపడటానికీ కాదండీ. ఒక మాట చెప్పనా....."

చీకటి నెమ్మదిగా విచ్చుకుంటోంది. దూరంగా ఎక్కడో సూర్యుణ్ని ఆహ్వానించటానికి ఆయత్తమవుతూంది.

"మనిషి ఒక్కసారే చచ్చిపోతే పర్లేదండి. కానీ క్షణం క్షణం మానసికంగా చావకూడదు. మనిషి మానసికంగా చావకూడదండి".

* * * * * *

"మనిషి సాంఘికంగా చావకూడదయ్యా! అట్లా సాంఘికంగా చచ్చిపోనీకుండా వుండటానికే ఈ న్యాయస్థానాలూ. ఈ చట్టాలు, ఎట్లా దీస్కుంటడంట నీ పొలం? చూద్దాం ఎట్లా దీస్కుంటాడో" అన్నాడు రంగారావు. అతడి అసలు పేరు రంగయ్య. కొద్ది కొద్దిగా రాజకీయాల్లో చేరేక పేరు రంగారావుగా మార్చుకున్నాడు. అతనికి మున్సబుకి పడదు అందువల్ల రాజయ్యకి దగ్గరయ్యేడు.

"కోర్టులో చిన్న దావా పడేద్దాం. వాళ్ళందర్నీ మూడు చెరువులు నీళ్ళు తాగించే బాధ్యత నాది".

"డబ్బునోడూ డబ్బునోడూ కొట్టుకునేటందుకైతే కోర్టు కావాలా బాబూ! డబ్బునోడు డబ్బు లేనోడ్ని కొట్టేటంద్కు ఈడి కడుపు సాలు" అన్నాడు చేతులు కట్టుకొని రాజయ్య.

అతడు ఇల్లు కాలిన ఆసామీలా వున్నాడు "అట్ల వదిలి పెడ్తామంటయ్యా?" అన్నాడు చుట్ట వెలిగించుకుంటూ రంగారావు "యాభయ్ మందిని పోగెయ్యి, పొలంకాడ నిలబెడ్దాం. పంట యెలా తోల్కెల్తడో చూద్దాం".

"పోలీసోళ్ళని తీసుకొస్తడు బాబూ".

"న్యాయమనేది వుంది కదయ్యా".

"పోలీసోళ్ళు ఆయనే వుంటారు బాబూ!"

* * * * * *

ప్రొఫెసర్ అయోమయం దగ్గర రమణ చేరి అప్పటికి నెలయింది. అతడి దగ్గర చెయ్యవలసిన పనేమీలేదు. అతడెప్పుడూ ఏవో లెక్కలు కట్టుకొంటూ కూర్చుంటాడు. ఒక ఫ్లాస్కు నిండా టీ వుంటే చాలు. యింకేమీ అక్కరలేదు. ఆ నెలరోజుల్లోనూ ఒక్కసారి కూడా అతడు బయటికి రాలేదు. కేవలం రమణని కలవటం కోసమే అతడి మనసులో ఈ రోజు బయటి కెళ్ళాలన్న కోర్కె పుట్టినట్టుంది.

గదినిండా కాగితాలే. అంకెలు వేసిన కాగితాలు, స్క్వేర్లూ, రూట్లూ, అన్నీ వేల వేల సున్నాలమీదా, టు ది 'పవర్ ఆఫ్' ల మీద ఆధారపడిన అంకెలు అన్నీ సబ్జెక్టుల కన్నా ఆస్ట్రానమీ యెంత యింటరెస్టింగు సబ్జెక్టో అంత బోరింగు సబ్జెక్టు.

రమణకి అక్కడ నచ్చేది ఒక్కటే, ఎలుకలు అవి చాలా సురక్షితంగా పెరుగుతున్నాయి

అక్కడ, అప్పుడే రమణతో స్నేహం కట్టేసేయి కూడా! ఎలుక దూరంగా పరామర్శిస్తోంది. ఇంకొకటి మీసాలు వూపుతూ వెక్కిరిస్తోంది. వాటికి అక్కడ మనుష్యులున్నా భయం యే మాత్రమూ లేదు. ఒకడు ప్రపంచాన్ని పరిత్యజించిన యోగి, మరొకడు ప్రపంచం మీద విరక్తి పెంచుకుంటూన్న యువకుడు. అందుకే అవి ఆ పెద్ద భవంతిలో- రాజ భవనంతో పరిచారికల్లా తిరుగుతూ వుంటాయి.

ఈ ప్రొఫెసర్ ఒక్కోసారి యెంత తెలివిగా లెక్కలు కడ్తూ వుంటాడో, ఒక్కోసారి అంత తెలివి తక్కువగా ప్రవర్తిస్తూ వుంటాడు. అతడ్ని చూసిన వాళ్ళెవరూ అతడు అస్ట్రానమీలో 'ఒకాయమా ఆస్ట్రో ఫిజికల్ అబ్జర్వేటరీ' నుంచి సర్టిఫికేట్ పొందాడనీ, హార్ట్‌లాండు మాగ్నెట్ ఫీల్డులో రాయల్ అస్ట్రానమర్‌గా నాలుగువేల పౌండ్ల జీతాన్ని వదులుకొని వచ్చి, ఆస్థి సర్వస్వం తగలేసుకొని యిలా మారుమూల ఉండిపోయేడని అనుకోరు. అయితే యింత తెలివైనవాడూ- యెంత తెలివి తక్కువగా ప్రవర్తిస్తూ వుంటాడో తెలియచెప్పటానికి, రమణకి పాత ఫైళ్ళలో దొరికిన యీ ఉత్తరాలు చాలు.

"ప్రియమైన భారతదేశపు ప్రధాని జగదీష్‌చంద్రకి-

మీరు ఆరోగ్యంగా వున్నారని తలుస్తాను. మీ పాలనలో దేశం సుభిక్షంగా వుందని కూడా భావిస్తున్నాను. ఈ మధ్య యింటి నుంచి బయటకు కూడా కదలకపోవటం వల్ల దాని సంగతి అసలు తెలియటం లేదు.

పోతే ముఖ్యమైన సంగతేమిటంటే నేను ఎల్లుండి ఢిల్లీ వస్తున్నాను. రెండ్రోజులు వుంటాను. వీలు చూచుకుని ఏదో ఒక సమయంలో మిమ్మల్ని కలుసుకొంటాను.

మిగతా విషయాలు సమక్షంలో.

విన్రమతతో,

పొ. ఆనంద మార్గం.

పి.యస్:- నేను అరగంటకంటే ఎక్కువకాలం మీతో గడపలేను క్షమించగలరు".

-ఈ ఉత్తరం చూసిన రమణ అరగంటవరకూ నవ్వు ఆగలేదు. దీనికి జవాబు రానట్టుంది. మళ్ళీ ఈయన దగ్గర్నుంచే ఇంకో ఉత్తరం కాపీ.

"ప్రియమైన జగదీష్‌చంద్ర.....

నేను ఇంతకుముందో ఉత్తరం వ్రాసేను. అయితే కవర్ మీద అడ్రసు వ్రాసేనా అన్న అనుమానం వస్తూంది యిప్పుడు. ఏది ఏమైన మీ ఆఫీసు ముందున్న సెక్యూరిటీ గార్డులు నన్ను లోపలికి రానివ్వలేదు. ఇక ఆ విషయం అలా పోనివ్వండి. మీరు వూరు వచ్చినప్పుడు నన్ను కలుసుకోండి. తప్పక కలుసుకోండి. అడ్రసు యీ ఉత్తరం కుడివైపు పైనుంది.

అభినందనలతో,

ప్రొ. ఆ. మార్గం.

పి.యస్:- మా యింటి ముందు సెక్యూరిటీ గార్డులు లేరు. అయినా మీ రొచ్చే ముందు ఉత్తరం వ్రాయండి. ఎందుకన్నా మంచిది కదా అది".

ప్రధాన మంత్రి కార్యాలయంతో ఇలాంటి ఉత్తరాలకి జవాబు యివ్వటం సెకండ్ అసిస్టెంటు- ఏ భాషలో వచ్చిన ఉత్తరమైన అక్కడ తర్జమా చెయ్యబడుతుంది. దాదాపు ముప్పాతిక వంతులు అక్కణ్నుంచే క్లియర్ చెయ్యబడతాయి. మిగతావి ఫస్టు సెక్రటరీకి వెళ్తాయి. ప్రధానమంత్రి సంతకాన్ని డూప్లికేట్ చేసే స్పెషల్ సిగ్నేచర్ మెషిన్ మిగతా ఉత్తరాలకి జవాబు యివ్వబడుతుంది. ఈ సంతకం అచ్చు ప్రధానమంత్రి స్వయంగా చేసినట్టూ వుంటుంది. అయితే ప్రొఫెసర్‌గారి ఉత్తరం మొదట్లోనే ఆగిపోయింది.

ప్రధానమంత్రి సచివాలయం
న్యూఢిల్లీ

"ప్రియమైన అయ్యా,

మీ ఉత్తరం అందింది. ప్రధానమంత్రి మిగతా ముఖ్య విషయాల్లో నిమగ్నులై వుండటం వల్ల మిమ్మల్ని కలుసుకోలేకపోయేరు.

అభినందనల్తో-

ఇట్లు,
గోపాలకృష్ణ ఎగ్బోటే,
ఇన్ఫర్మేషన్ ఎడ్వైజర్"

* * * * * *

ఈ విధంగా వుంటుంది ప్రొఫెసర్ అయోమయంగారి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీ.

రమణ చేరిన మొదటి నాలుగు రోజులూ యీ ఉత్తరాలు, మిగతా పేపర్లూ చదువుతూ కాలం గడిపేడు.

ఈ ఉత్తరం కొంచెం అర్థమై నవ్వు తెప్పించేవీ కానీ, మిగతా రాతలు అర్థంలేనట్టు పిచ్చిగా వుండేవి.

అతడికి అన్నిటికన్నా నచ్చింది ఈ వృద్ధుడి అమాయకత్వం, అతడెంత తెలివైనవాడో అతడి మాటలు అంత అమాయకంగా ఉండేవి. అంత అమాయకుడు కాబట్టే లక్షల ఆస్థిని ఇనుపసామానుగా మార్చుకొని తన భావనా లోకపు ప్రపంచంలో పెట్టుకున్నాడు.

అతడి చేతుల్లో చురుకూ, కళ్ళల్లో తేజస్సూ, మాటల్లో మంచితనం రమణని కట్టిపడేసేవి.

అయినా యీ ప్రొఫెసర్ గొడవలోపడి రమణ తన ఉద్యోగం సంగతి మర్చిపోలేదు. కనబడినచోటల్లా అప్లయ్ చేస్తూనే వస్తున్నాడు. అతడు ప్రొఫెసర్ దగ్గర చేరిన యిరవై రోజులకి ఓ

సాయంత్రం పత్రికా ఆఫీసునుంచి, వచ్చి ఉద్యోగంలో చేరమని పోస్టులో ఆహ్వానం వచ్చింది.

ఇల్లంతా ఆనందం వెల్లివిరిసింది ముసలాయన దగ్గుతూనే, ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పి, పైన ఏమయినా దొరుకుతుందో లేదో అని ఎంక్వయిరీ చేసేడు. అన్నిటికీ ముక్తసరిగా సమాధానం ఇచ్చేడు రమణ. తండ్రితో ఎక్కువగా మాట్లాడడు రమణ.

తండ్రి చరిత్ర అంతా అతనికి తెలుసు. ఎన్నాళ్ళ క్రితం అయితే సిఫిలిస్ అతన్ని పట్టుకుందో తెలియదు. ఈ దగ్గుకి కారణం కూడా అదేనేమో! అతడు గవర్నమెంటు హాస్పిటల్‌కి వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యలేదు. అతడి దృష్టిలో అతడి తండ్రి నైతికంగా ఎప్పుడో చచ్చిపోయేడు.

ఆ మరుసటి రోజు అతడు తన ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళి పత్రికాఫీసులో ఉద్యోగం వచ్చిన సంగతి చెప్పేడు.

ఆ తర్వాత మాలతి ఇంటికి వెళ్ళాడు.

"అయితే ఉద్యోగం వచ్చిందన్నమాట" అన్నాడు మాలతి తండ్రి వైపు చివర నుసిన చిటికెన వేలితో దులుపుతూ.

రమణ మాట్లాడలేదు.

"....ఎంత....జీతం.....".

దీనికి సమాధానం చెప్పలేదు అతడు. అదంత పెద్ద సంఖ్య కాదు.

మాలతి తండ్రే కుర్చీలోంచి లేస్తూ అన్నాడు-

"రెండొందలు- మూడొందలు. కాకపోతే ఐదొందలు. అంతేగా అది మా వంటవాడి జీతం". రమణ మొహం ఎర్రబడింది.

"ఇంకెప్పుడూ యిటువైపు రాకు" అన్నాడాయన "మాలతికి సంబంధాలు చూస్తున్నాం. నీ వల్ల దానికేదయినా అపకారం జరిగిందంటే నీ రక్తం కళ్ళ చూడాల్సి వస్తుంది" చాలా మామూలుగా సామాన్యంగా అన్నాడు.

అంత వ్యధలోనూ రమణకి నవ్వొచ్చింది. వెళ్ళబోతూ అన్నాడు "అపకారం చెయ్యాలన్న ఆలోచన నాకెప్పుడూ లేదండీ. అదేవుంటే మళ్ళీ యిలా మీ ముందు నిలబడే అవసరమే వచ్చేదికాదు. మాలతికి మైనారిటీ తీరిపోయిందని నాకు తెలుసు. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకుంటే మీ డబ్బు గానీ, మీ వెనుకున్న గూండాలుగాని దాన్ని ఆపుచేయలేరు. అయితే ఈ వివాహం జరగకుండా అపుతున్నది-మనిషి నైతిక విలువలకి నేనిస్తున్న గౌరవం. అంతే..."

అతడు కదిలి బయటకొచ్చేడు.

పోర్టికోలో మాలతి నిలబడి అతడి గురించే ఆతృతగా చూస్తుంది. ఆమె కళ్ళలో ఏదో చెప్పాలన్న తపన. అతడు ఆగేడు. ఆమె అతడి వైపు చూసింది. ఇద్దరి కళ్ళు క్షణం సేపు కలుసుకున్నాయి.

జీవితం క్షణికం అయితే కావొచ్చు గానీ, క్షణం అస్తిత్వం లేనిది కాదు.

అతడు తలవంచుకొని ముందుకు నడిచేడు.

మనసంతా వికలమైంది.

చేతులు రెండూ ప్యాంటు జేబుల్లో పెట్టుకొని నడవటం సాగించాడు.

ప్రొఫెసర్‌తో కొంచెంసేపు గడపటమే అతడికి ఈ మధ్య సంతోషాన్నిస్తూంది.

ఇంటి ఆవరణలోకి ప్రవేశించాడు.

## *గ్రీన్‌విచ్- ఉదయం 6-30*

గడియారం పన్నెండు కొట్టింది. కాళ్ళు చాపి, వెనక్కి వాలి కూర్చున్నాడు ప్రొఫెసర్. అతడి మొహం వాడిపోయి వుంది.

"అయితే వెళ్ళిపోక తప్పదా గ్రాడ్యుయేటూ?" అన్నాడు.

రమణ మాట్లాడలేదు.

"అవున్లే- అక్కడ జీతం వస్తుందిగా. అయితే ఇంతకీ ఎప్పుడు వెళుతున్నావు?".

"ఎల్లుండి చేరదామనుకుంటున్నాను".

"నా దగ్గిర పని చేసినట్టు సర్టిఫికెట్టు ఇవ్వమంటావా?".

రమణ నవ్వావుకొని "వద్దు" అన్నాడు.

ప్రొఫెసర్ లోపల్నుంచి ఓ చెక్కు పట్టుకొచ్చేడు. "ఇంతకన్నా ఏమీ ఇవ్వలేను. ఉంచుకో" అన్నాడు. రమణ ఆ చెక్కుని చూశాడు "సైన్స్ టు డే"వాళ్ళు పంపిన చెక్కు అది. ఈ మతి లేని ప్రొఫెసర్ కుదురుగా కూర్చొని ఒక రాత్రంతా వ్రాసి సంపాదించిన డబ్బు. తన కోసం....

అతడి కళ్ళ వెంట నీరొచ్చింది. ఆ క్షణం అన్నీ వదిలేసుకుని ఇక్కడే వుండిపోదామా అనుకున్నాడు. కానీ జీవితం సెంటిమెంట్ల కథ కాదు. ఇంట్లో పరిస్థితి వెన్నుతట్టి లేపుతోంది. మౌనంగా చెక్కు అందుకున్నాడు.

అతడి మనస్సు శూన్యమైంది.

* * * * * *

శూన్యమైన విశ్వంలో ఇన్ని కోట్ల కోట్ల కోట్ల గ్రహాలూ, నక్షత్రాలూ ఎలా ఏర్పడ్డాయి? అన్న ప్రశ్నకి చాలామంది శాస్త్రవేత్తలు రకరకాల థియరీలు చెప్పారు. ఏదీ సంతృప్తికరంగా లేదు. ప్రకృతి శోధించటానికి మనిషి మేధస్సు సరిపోవటం లేదు. మనం చూసేది ఒక సూర్యుడ్ని. విశ్వంలో మనకి కనబడని సూర్యుళ్ళు కోట్లు.

మనం 'ఆకాశగంగ' అని పిలిచే నక్షత్రాల సమదాయం కొన్ని లక్షల నక్షత్రాల గుంపు, అందులో దాదాపు రెండు వందల మిలియన్‌ల నక్షత్రాలున్నాయని అంచనా.

ఇన్ని కోట్ల నక్ష త్రాలూ ఒక బిందువు చుట్టూ పరిభ్రమిస్తున్నయ్. భూమి తన చుట్టూ తిరగటానికి ఒక రోజు పట్టినట్టే, ఇవి ఒకసారి తిరగటానికి రెండు మిలియన్ల సంవత్సరాలు పడుతుంది.

*　　*　　*　　*　　*　　*

రమణకి ఆ ఆవరణలో నచ్చేది అన్నిటికన్నా ఒకటుంది. అది టెలిస్కోప్. చిన్న పిల్లవాడు ఆట వస్తువుతో ఆడుకొన్నట్టూ అతడు తరచు దాన్లోకి చూస్తూ వుండటం అలవాటు చేసుకున్నాడు. ముఖ్య మైన నక్ష త్రాలనీ, చంద్రుడిలో లెయాబ్‌నిట్జ్ కొండనీ గుర్తించటం నేర్చుకున్నాడు.

ఆ రోజు మంగళవారం. ప్రొఫెసర్ తన మామూలు ధోరణిలో లెక్కలు వేసుకుంటూ కూర్చొన్నాడు. రమణ స్కోప్‌లో చూస్తూ వుంటే ఒక బంతి లాంటి ఆకారం దక్షిణ దిశలో కనబడింది. నారింజపండు ప్రమాణంలో వుందది. చాలా వేగంగా ఉత్తర దిశగా సాగిపోతోంది. మామూలు కంటికి కనిపించటం లేదు.

కనిపించిన ప్రతి దాని గురించి మొదట్లో అతడు ప్రొఫెసర్‌ని అడిగి తెలుసుకొనేవాడు. ప్రొఫెసర్‌కి ఈ విషయాల్లో జ్ఞాపకశక్తి ఎక్కువ, ప్రతి నక్ష త్రపు పేరునీ, గ్రహాల పేర్లనీ చెప్పేవాడు. కానీ తన ఈ కుతూహలం ప్రొఫెసర్ పనిని మాటిమాటికి చెడగొడుతూందని గ్రహించి అడగటం మానుకున్నాడు. ఆ భావంతోనే నారింజపండు ఆకారపు బంతి గురించి అతడు అడగలేదు.

కానీ మళ్ళీ మరుసటిరోజు అదే సమయానికి అది కనబడింది. ఈసారి అది ఫుట్‌బాల్ సైజులో వుంది. కానీ టెలిస్కోప్ నుంచి కాకుండా మామూలుగా కనపడటం లేదు. మరింత వేగంతో అది ఉత్తరదిశగా సాగిపోతోంది. ఈసారి ఇక అతడు కుతూహలం ఆపుకోలేక ప్రొఫెసర్‌ని పిల్చి చూపించేడు.

ప్రొఫెసర్ చాలాసేపు దాన్ని గమనిస్తూ వుండిపోయేడు. అరగంటలో అది ఉత్తర దిశలో అదృశ్య మైపోయింది.

"ఎన్నాళ్ళనుంచి దీన్ని చూస్తున్నావు?" టెలిస్కోప్ ఆవరణలో నుంచి బయటకు వస్తూ అడిగేడు ప్రొఫెసర్. అతడి మొహంలో ఏ భావమూ లేదూ.

"నిన్నట్నుంచి. కానీ నిన్న ఇది ఇంకొంచెం ఎక్కువ సేపు కనబడింది. కొంచెం చిన్న సైజులో" అన్నాడు రమణ "ఏమిటది?"

క్షణం మాట్లాడలేదు ప్రొఫెసర్. తరువాత సాలోచనగా అన్నాడు "ప్రాక్సిమా సెంట్యారీ.."

రమణకీ దాని గురించి తెలుసు. భూమికి దగ్గరగా వున్న నక్ష త్రం అది. దగ్గరగా అంటే.... సూర్యుడికీ, భూమికీ దూరంగా అంగుళం అనుకొంటే, భూమికీ నక్ష త్రానికీ మధ్య నున్న దూరం నాలుగు మైళ్ళు. అంత దగ్గర.

“ఇంతకు ముందు టెలిస్కోప్‌లో అంత పెద్దదిగా కనిపించేది కాదు. ఇప్పుడెందుకు కనిపిస్తూంది?” అడిగేడు.

“ఇంకో రెండు రోజులు పోతే గానీ ఏమీ చెప్పలేను.”

ఆ రెండ్రోజులూ రమణ తన ఆఫీసులో చేరే సన్నాహాల్లో ఉన్నాడు. హెల్తు సర్టిఫికెట్ల ఒరిజనల్స్ చూసుకోవటంలో కాలం గడిచిపోయింది. ఆ రోజు రమణ అక్కడ పని చెయ్యడానికి ఆఖరి రోజు.

పదకొండు గంటలవేళ, వ్రాస్తున్న కాగితాలలోంచి తలెత్తి “అర్థమయింది” అని అరిచేడు ప్రొఫెసర్.

రమణ అతడివైపు చూసేడు.

“ప్రాక్సిమా సెంట్యావరీ గురించి” అన్నాడు ప్రొఫెసర్ “భూమికి కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో వున్న ఆ నక్షత్రం, నాలుగు రోజుల క్రితం ముప్పై అయిదు నిమిషాలపాటు కనబడింది. అది కనబడీ సమయం రోజుకి నిముషం పాటు తగ్గుతూ వస్తూంది. భూమి డయామీటరు దాదాపు ఎనభై లక్షల మైళ్ళు....” అంటూ తన పేపర్ల వైపు చూస్తూ ఆగేడు.

“.... దాదాపు ఎనిమిది గంటల కాలం కనబడాల్సిన ఆ నక్షత్రం ఇంత తొందరగావచ్చి వెళ్ళిపోవటానికి కారణం ఏమిటో? చాలా సింపిల్ థియరీ. ట్రెయిన్‌లో వెళుతున్నప్పుడు దూరంగావున్న చెట్టుదగ్గరగా వున్న చెట్టుకన్నా ఎక్కువసేపు కనబడుతుంది అంతేకదా-”

రమణ నవ్వేడు “ఆ నక్షత్రం పూర్వం కన్నా దగ్గరగా వచ్చిందంటారా?” అన్నాడు.

“రావటం కాదు. వస్తూ వుంది. ఇంకా వస్తూ వుంది. రోజుకి నిముషంపాటు అది కనపడటంలో తేడా వస్తుంది కదా! ఎనిమిది గంటలు కనపడేదల్లా అరగంటే కనపడుతూందిప్పుడు. అంటే చాలాకాలం క్రిందటే అది తన ప్రయాణం ప్రారంభించి ఉండాలన్నమాట. దాదాపు నెల రోజుల క్రితం ప్రస్తుతం భూమి చుట్టూ అది ఇరవై అయిదు నిమిషాల్లో ప్రదక్షిణం చేస్తూంది. అంటే పదివేల మిలియన్ల మైళ్ళ దూరానికి వచ్చిందన్నమాట.”

“ఇంత పెద్దమార్పుని ఇంతవరకూ ఎవరూ గమనించలేదంటారా?” అడిగేడు రమణ.

“ఆ అనుమానం నాకు నిన్ననే వచ్చింది. కొన్ని పాత సామానులుంటే అమ్మేసి, గ్రీన్‌విచ్ అబ్జర్వేటరీకి, మాంచస్టర్ యూనివర్సిటీలో మౌంట్‌కి ఫోన్ చేసేను.”

“ఏమన్నారు వాళ్ళు-?”

ప్రొఫెసర్ పై కప్పుకేసి క్షణంపాటు చూసి కళ్ళుదించుతూ “దాదాపు నెల రోజుల క్రితం అబ్జర్వేటరీస్ అన్నీ మూసెయ్యమని ఆర్డరొచ్చిందంట!” అన్నాడు.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడలేదు.

గది అస్తవ్యస్తంగా వుంది. ప్రొఫెసర్ వర్క్ చేసిన కాగితాలు చెల్లాచెదురుగా పడి

వున్నాయి. ఎలుక ఒకటి కాళ్ళ సందులోంచి పరుగెత్తుకు వెళ్ళిపోయింది.

నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ప్రొఫెసర్ లేచి "పద, టీ తాగుదాం" అన్నాడు.

ఇద్దరూ బయటికొచ్చేరు. తలుపు దగ్గరికి లాగగానే ఆటోమేటిక్ లాక్ పడిపోయింది. బయట చిన్న నాబ్ తిప్పి, తలుపు దగ్గరగా వేస్తే లాక్ పడిపోయే ఏర్పాటున్న తలుపు అది.

రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. బాగా ఎండగా వుంది.

"ఈమధ్య నాకు మాటిమాటికీ బయటికి రావాలనిపిస్తోంది" అన్నాడు ప్రొఫెసర్. "ఇంతకు ముందు ఆర్నెల్ల కొకసారి ఇంట్లోంచి బయటకి అడుగు పెట్టేవాణ్ని ఇప్పుడు చూడు.... క్రిందటి నెల వచ్చాను. మళ్ళీ ఇప్పుడు రావాలనిపించింది."

"నేను మీకు కలవాలని వ్రాసి పెట్టివుంది ఆ రోజు ,అందుకే వచ్చారు..." అన్నాడు రమణ.

"మళ్ళీ ఈరోజు నిన్ను సాగనంపటానికి వస్తున్నాను."

రమణ మాట్లాడలేదు.

ఇద్దరూ ఇరానీ హోటల్లో కూర్చున్నారు. రెండు ఛాయ్‌లకు ఆర్డరిచ్చేరు. హోటల్ రష్‌గాలేదు. నాలుగురోడ్లు కలిసే చోటులో వున్నా, పక్కనే యింకో పెద్ద హోటల్ ఉండటంవల్ల దీనికెవరూ రారు.

గల్లాపెట్టె వద్ద కూర్చొన్నవాడు కునికిపాట్లు పడుతున్నాడు. రమణ చుట్టూ చూసి, తల తిప్పేసరికి ప్రొఫెసర్ నీటిచుక్కతో చూపుడు వేలు ముంచి టేబిల్‌మీద బొమ్మ వేస్తున్నాడు. ఇంతలో టీ వచ్చింది. దాంట్లో యింకో వేలు ముంచి యింకో చుక్క పెట్టేడు. "యిది భూమి" అన్నాడు.

ప్రొఫెసరు సంగతి తెలిసిన రమణ మౌనంగా టీ తాగసాగేడు.

"బ్రెస్సెల్ థియరీ సంగతి తెలుసునా?" అడిగేడు ప్రొఫెసరు. తెలీదన్నట్టూ తల అడ్డంగా ఊపేడు రమణ.

"ఒక నక్షత్రం మనకి యెంత దూరంలో వున్నదీ తెలుసుకోవడానికి అతడు లెక్క చెప్పేడు ఇదుగో ఈ పచ్చటి చుక్క భూమి అనుకో. ఈ నీటి చుక్క నక్షత్రం. ఈ రోజు అది ఇరవై యెనిమిది నిమిషాలు కనబడింది. నిన్న ఇరవై తొమ్మిది నిముషాలు దీని స్థానభ్రంశం, సూర్యుడు భూమికి దూరంగా వున్న రోజు జరిగి వుంటుంది. అంటే ఏ రోజు?"

"జూన్ ఇరవై ఒకటో తారీఖు?"

"కరెక్ట్. ఈ నక్షత్రం దాదాపు ముప్పై అయిదు రోజుల్లో కొన్ని కోట్ల మైళ్ళు ప్రయాణం చేసి ఉత్తరం నుంచి దక్షిణ దిశగా వెళ్తుంది. అయితే ఓ అనుమానం వుంది. మనం మామూలు టెలిస్కోప్‌లో కనుక్కొన్న ఈ విషయాన్ని అంతకన్నా అధునాతనమైన పరికరాలు అంటే అల్ట్రావాయిలెట్, ఎక్స్‌రే, రేడియో, టెలిస్కోప్‌లలో మిగతా వాళ్ళు యెందుకు

కనుక్కోలేదు....? కొంచెం షుగర్ పట్రా వెయిటర్ బాబూ.... ఇదిగో ఈ నక్షత్రం యీ యాంగిల్‌లో వస్తూంది. భూమి యిటువెళ్తూంది...."

వెయిటర్ పంచదార కప్పు తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. నస్యం పట్టినట్టు దాన్ని కొంచెం తీసి బల్లమీద పోసేడు. "ఇది సూర్యుడు...." అన్నాడు.

ఈ పిచ్చి చేష్టల్ని ఎవరన్నా చూస్తున్నారేమోన్ని కనుకొలుకుల్లోంచి చుట్టూ చూశాడు రమణ.

"ఈ నక్షత్రం యిలా వెళ్ళే సమయానికి...." అంటూ ప్రొఫెసర్ గీత గీశాడు "సూర్యుడికి ఈ పక్కగా భూమి వస్తుంది. ఇంకోలా చెప్పాలంటే భూమికి దాదాపు యాభైలక్షల మైళ్ళ దూరం నుంచి ఈ నక్షత్రం ప్రక్కగా దూసుకుపోయి అనంతమైన విశ్వంలో కలిసిపోతుంది. నెలరోజులు ప్రయాణం చేసిన ఆ నక్షత్రం దాదాపు నాలుగు కోట్ల కోట్ల కోట్ల మైళ్ళు పయనించింది. ఆ వేగం అలాగే కొనసాగితే, అది భూమికి అత్యంత సమీపంలోకి రావటానికి యింకా ఇరవైరోజులు, అంటే ఆగష్టు పదిహేడో తారీఖు అవుతుందన్నమాట. నా లెక్క సరి అయితే.... ఈ టీ చల్లారిపోయింది. ఇంకో టీ తెప్పించు.... నా లెక్క కరెక్టయితే సరిగ్గా ఆ రోజు పదకొండుగంటల పది నిముషాలకి ఈ దూసుకుపోవడం జరుగుతుంది."

వెయిటరు వచ్చాడు "ఇంకో టీ" అన్నాడు రమణ వెయిటర్ వెళ్ళిపోయాడు.

"ఆగష్టు పదిహేడు. పగలు.... పదకొండు గంటల పది నిముషాల మూడు సెకండ్ల వరకూ ఆ నక్షత్రపు అయస్కాంత ప్రభావం భూమి మీద పడుతుంది."

వెయిటర్ టీ తీసుకొచ్చేడు.

"పడితే ఏమవుతుంది....!" అడిగాడు రమణ.

"ఏమవుతుంది, భూమి ఫెటేలున పేలిపోతుంది.... ఇదిగో వెయిటర్! అందులోనూ షుగర్ తక్కువగాను వుంది."

రమణకి ఓ క్షణం ఏమీ అర్థంకాలేదు. ప్రొఫెసర్ స్పూనులో టీ కలుపుతున్నాడు. సాయంత్రం సరదాగా వచ్చిన వాడిలా తపీగా వున్నాడు. రమణకి నవ్వొచ్చింది. బలవంతంమీద ఆపుకుంటూ "అయితే మనందరం చచ్చిపోతామా ప్రొఫెసర్ గారూ!" అని అడిగాడు.

"ఇంకా నిర్ధారణగా చెప్పలేను" అన్నాడు.

ఇద్దరూ లేచి బయటకు వచ్చారు.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తావు గ్రాడ్యుయేటూ?"

ప్రొఫెసర్ కంఠంలో కనపడిన ఆర్తి అతడ్ని విచలితుడ్ని చేసింది. ఏ ప్రాపంచిక విషయమూపట్టని ఈ వృద్ధుడు, తన మీద అభిమానాన్ని పెంచుకున్నాడంటే అది తన అదృష్టం. ఈ నెలరోజుల సాంగత్యంలో తనకి తెలియని యెన్నో విషయాలు తెలుసుకున్నాడు. భూమి

గురించి, నక్షత్రాల గురించీ....

"తొందర్లోనే మీ యింటికి వస్తాను."

"రావాలనే ఆశిస్తాను. వెళ్ళొస్తాను గ్రాడ్యుయేటూ. నీ భావి జీవితం శుభప్రదమగుగాక!" అని తిరిగి వెళ్ళిపోయాడు చాలా నెమ్మదిగా, బలహీనంగా నడుస్తూ వెళ్ళిపోతున్నాడు ఆ వృద్ధుడు.

అతడు కనుమరుగయ్యే వరకూ అలా చూస్తూ నిలబడ్డాడు. తరువాత ఇంటి వైపు కదిలాడు. అతడు ఇల్లు చేరుకొనేసరికి రాత్రి ఏడయింది. మనసులో ఏదో అసంతృప్తి.

కాళ్ళు కడుక్కొని భోజనానికి కూర్చొన్నాడు.

"రేపు జాయినవుతున్నావా?" వడ్డిస్తూ అడిగింది జానకి. తలూపేడు.

"ఏమన్నాడు మీ అయోమయంగారు?"

"చాలా బాధపడ్డాడు. మళ్ళీ తొందర్లో వచ్చెయ్యమన్నాడు."

జానకి నవ్వి, "జీతం మాత్రం ఏమీ ఇవ్వడటానా?" అంది. రమణ మాట్లాడలేదు. భోజనంచేసి పుస్తకం చదువుతూ కూర్చొన్నాడు.

దూరంగా తొమ్మిది కొట్టింది.

ప్రకాశరావు ఇంకా రాలేదు. అతడికి బ్రాకెట్ల పిచ్చివుంది. క్లోజింగ్ వచ్చేవరకూ రాడు. వేసవికాలం అయిపోయినా ఇంకా వర్షాలు కురవటంలేదు. పగలు బాగా ఎండగా వుంటోంది. రమణ పక్క బయటవరండాలో వేసుకున్నాడు.

రేపట్నుంచీ తనో ఉద్యోగి. నెలతిరిగేసరికి జీతం అంటే వేలు వేలు కాదు. కానీ ఇంత హీనంగా బతకక్కర్లేదు. వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడు. మరి మాలతి సంగతి యేమిటి? ఒక పరిష్కారం ఆలోచించాలి.

తలక్రిమద చేతులు పెట్టుకొని వెల్లకిలా పడుకొన్నాడు. చల్లటి గాలి అలలు అలలుగా వచ్చి వచ్చి మనస్సు సేద తీరుస్తోంది. ఆకాశం నిర్మలంగా వుంది, నక్షత్రాలు తళతళా మెరుస్తున్నాయి. కొన్ని మినుకుమినుకు మంటూ, కొన్ని ప్రకాశవంతంగా.

నక్షత్రాలు.

కోట్ల కోట్ల నక్షత్రాలు.

అలాగే పడుకొని, తల కొద్దిగా పక్కకి తిప్పి చూసేడు.

ఉత్తర దిక్కుగా మిగిలిన వాటికంటే ప్రకాశవంతంగా ఒక నక్షత్రం.

ప్రాక్సిమా సెంట్యూరీ....!!

* * * * * *

# ఆగష్టు ఒకటి

రమణ ఉద్యోగంలో చేరి అప్పటికి నాలుగు రోజులైంది. ఆ రోజు అతనికి నాలుగు రోజుల జీతమూ వచ్చింది. నలభై రూపాయలు. చాలా తక్కువ. అయినా అందులో యెంత ఆనందం వుందో ఆ మొదటి జీతం అందుకున్న వాళ్ళకే తెలుస్తుంది.

నలభైలో పదిహేను పెట్టి గోపికి చొక్కా కొన్నాడు. వదినకి ఏం కోనాలో తోచలేదు. స్వీట్లు కొన్నాడు. అతడి మొహం ఆనందంతో వెలిగి పోతోంది. ఎవరెస్టు అధిరోహించినంత ఆనందంతో వున్నాడు.

ఇంటికొచ్చి చొక్కా గుడ్డ, స్వీట్లూ ఇచ్చేడు. మిగతా డబ్బులో ఓ అయిదు వుంచుకొని, మిగతావి వదిన కిచ్చాడు.

"నీ దగ్గరే వుంచవయ్యా" అంది జానకి.

"ఎలాగూ బస్సు ఖర్చులకనీ, లంచ్ కనీ తీసుకుంటానుగా వదినా!" అన్నాడు. ఆమె నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

రమణ బట్టలు మార్చుకొని బయటకొచ్చేడు. జేబులో అయిదు రూపాయలున్నాయ్. హోటల్ కొచ్చేడు. ప్రొఫెసర్‌ని మొదటిసారి కలుసుకున్న హోటల్.

రెండు కేకులు కొన్నాడు. అవి తీసుకుని ప్రొఫెసర్ పురాతన భవనంవైపు నడిచేడు. అతడు అక్కడికి చేరుకోనేసరికి ఆరుంబావయింది.

తలుపు తీసేవుంది. లోపలికి నడిచి, తలుపు బలంగా వేసేడు. తరువాత జ్ఞాపకం వచ్చింది- తలుపు బలంగా వేస్తే బయట లాక్ పడుతుందని. మళ్ళీ తీసి చూసేడు. అదృష్టవశాత్తూ లాక్ పడలేదు.

అతడు లోపలికి వెళ్ళేసరికి ప్రొఫెసర్ యధాప్రకారం కాగితాలు ముందేసుకొని కూర్చొని వున్నాడు. రమణని చూసి "రా! గ్రాడ్యుయేటూ.... రా!" అని అహ్వానించేడు. "ఆ నక్షత్రం గురించి ఇంకా కొన్ని విషయాలు సేకరించేను".

"నక్షత్రాల సంగతి తర్వాత. ముందీ స్వీటు తినండి. నా మొదటి జీతంతో కొన్నది" అని కేకు అందించేడు.

"రెండూ నేనే తింటే నీ కేమన్నా అభ్యంతరమా? భోజనం తిని మూడ్రోజులైంది...."

రమణ చప్పున తల తిప్పుకొని కళ్ళ నీళ్ళు కనబడనివ్వకుండా "తినండి" అన్నాడు రుద్దమైన కంఠంతో.

అతడు ఆత్రంగా తినటం పూర్తి చేసి "ఊ- చెప్పు ఏమిటి విశేషాలు?" అని అడిగేడు.

"మీరే చెప్పాలి."

ప్రొఫెసర్ తన కాగితాల వైపు క్షణం తదేకంగా చూశాడు. "నేను చెప్పేది ఏదైనా వుంటే అది ఆ నక్షత్రం గురించే...." అన్నాడు "దాంట్లో వేడి అంతగా లేదన్నది తేలిపోయింది. ఎందుకంటే- ఏ మాత్రం వేడి వున్నా మనం ఈ పాటికి మసి అయిపోయి వుండేవాళ్ళం. పోతే అయస్కాంత శక్తి సంగతి తేల్చాలి."

రమణ మాట్లాడలేదు. అతనికిదంతా అర్థరహితంగా కనబడింది. ముందు సంగతి వేరు. అప్పటికి అతడికి ఉద్యోగం లేదు. కానీ ఇప్పుడు ఇంకా చాలా పనులున్నాయి.

అతడా ఆలోచనల్లో ఉండగానే ప్రొఫెసర్ ఓ కాగితం తీసిచ్చేడు. "నేను వ్రాసిన ఉత్తరానికి ఓ కాపీ వేసి ఉంచాను" అన్నాడు. రమణ దాన్ని అందుకొని చదవసాగేడు.

"ప్రియమయిన ప్రధానమంత్రి జగదీష్‌చంద్రగారికి,

నేను క్షేమమే. మీరూ క్షేమమే అని తలుస్తాను. లోగడ నేను మీకో ఉత్తరం వ్రాసి వుంటిని. మీరు ఈ మధ్య ఇటువైపు రాలేదా? పోనీలెండి. మీకో ముఖ్యమైన విషయం చెబుదామని ఈ ఉత్తరం రాస్తున్నాను. ప్రాక్సిమా సెంక్చువరీ భూమివైపు వస్తున్నది. ఆ విషయం మీకు చెబ్దామని .... మరి వుంటాను.

అభినందనల్తో-

ప్రొఫెసర్ అయోమయం

పి. యస్. ఈనక్షత్రానికి గానీ ఆకర్షణ శక్తి వున్నట్లయితే భూమ్మీది వస్తువులు వెళ్ళి దానికి అతుక్కుంటాయి."

రమణ ఉత్తరం మడిచి ఇచ్చేశాడు. లాభం లేదు. ఈ మతిలేని ప్రొఫెసర్ మెదడుని సరిచెయ్యలేరు. పదిహేనేళ్ళ అమ్మాయిలు అభిమాన నటులకి వ్రాసినట్టు ఈయన ప్రైమ్మినిష్టర్ ఆఫ్ ఇండియాకి వ్రాస్తున్నాడు. పెర్వర్షన్ అంటే ఇదే కాబోలు.

* * * * * *

గోపాలకృష్ణ ఎక్కొటే చేతిలో ఆ ఉత్తరం వుంది. దాన్ని చూసి అతడు చాలాసేపు నవ్వుకొన్నాడు. ప్రధానమంత్రికి చాలా రకాలయిన ఉత్తరాలు వస్తుంటాయి. కొన్ని తిడుతూ, కొన్ని దేశ సమస్యల గురించీ, కొన్ని పర్సనల్ ప్రాబ్లమ్సూ, అభ్యర్థనలూ- ఇలా అప్పుడప్పుడు ప్రేమలేఖలు కూడా.

కానీ ఇలాంటి ఉత్తరాలు రావటం మాత్రం చాలా తక్కువ.

అతడి ముందు 'రాక్'లు వున్నాయి. ఒకటి ఫస్టు సెక్రటరీకి వెళ్ళాల్సిన ఉత్తరాలు. వాటిలో కొన్ని ఏరి,ఫస్టు సెక్రటరీ ప్రధానమంత్రికి పంపుతాడు. రెండో రాక్లో తను జవాబు వ్రాయాల్సిన ఉత్తరాలు పడేస్తాడు. మూడో రాక్లో ఉత్తరాల మీద ఏ చర్యా తీసుకోవాల్సిన పని లేదు.

ప్రొఫెసర్ ఉత్తరం మూడో రాక్ చేరుకొంది.

మూడు 'రాక్స్'లోకి ఉత్తరాలు విడదీసిన తర్వాత మొత్తం మూడు ఫైళ్ళూ ప్రధానమంత్రికి వెళతాయి. ఫైలు మాత్రం ఆయన చూడదలుచుకుంటే పరిశీలించటానికే.

ఈ ఉత్తరాలు చూడటానికే ఆయన దినచర్యలో టైము ప్రొద్దున్న తొమ్మిది నుంచీ తొమ్మిదిన్నర వరకూ.

ఆగష్టు ఒకటో తారీఖు తొమ్మిదిన్నరకు ఆయనకి పార్టీ చీఫ్ అవినాష్తో అప్పాయింట్మెంటు వుంది. అంటే ఉత్తరాలు చూడటం పూర్తి అయ్యేక.

తొమ్మిదిన్నరవరకూ మామూలుగానే ఆయనే మొదటి ఫైలు నెట్టేసేడు.

అవినాష్ ఇంకా రాలేదు.

సాధారణంగా ప్రైమ్ మినిష్టర్ ప్రోగ్రాంలో రావాల్సిన వాళ్ళ ఆలస్యం ఉండదు. ఒకవేళ అలాంటిదేదయినా వుంటే, ఇంకో విజిటర్ని పంపటం జరుగుతుంది. ఈ చిన్న చిన్న విజిటర్లు రెండు మూడు నిమిషాల వ్యవధిలో తమ సంభాషణ ముగించాల్సి ఉంటుంది.

అయితే అవినాష్తో యీ చర్చ దాదాపు గంటసేపు జరగాల్సివుంది. ప్రతిపక్షం చాలా బలంగా వుంది. పార్టీ ఏ క్షణమైనా మెజారిటీ పోగొట్టుకొనేలా వుంది. అందుకే ఆ రోజు చాలా కీలకమైన చర్చ జరగబోతూ వుంది.

పార్టీ చీఫ్ ఇంకా రాలేదు.

తొమ్మిదీ ముప్పై అయిదు.

సాధారణంగా యిలాంటి పరిస్థితులు యేర్పడినప్పుడు, ప్రజల ఆసక్తిని పక్కకి మళ్ళించే

సంఘటనల్ని ప్రభుత్వం చేపట్టాలి. దాని గురించి చర్చించటానికే చీఫ్ వస్తున్నది.

తొమ్మిదీ నలభై.

ప్రధానమంత్రి విసుగ్గా రెండో ఫైలు ముందుకు లాక్కున్నాడు. సెకండ్ అసిస్టెంట్ ఆన్సర్ చెయ్యవలసిన ఉత్తరాలు, సావనీరుకి అభినందనలు పంపమనీ- ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రమ్మనీ- ఇలాంటివి.

ఫైలు పడేసి వెనక్కి వాలబోతూ, మూడో ఫైలు చూసేడు. ఓ కాగితం క్రిందికి జారి, చివర్లో పి.ఎస్. కనబడుతూంది. ప్రధానమంత్రికి పి.ఎస్.వ్రాసేదెవరా అని కుతూహలంతో ఉత్తరాన్ని బయటకి లాగేడు. ......."ఆ నక్ష త్రానికి ఆకర్షణ శక్తి ఉన్నట్లయితే  భూమ్మీది వస్తువులు దానికి వెళ్ళి అతుక్కుంటాయి-".

చాలాసేపు దానివైపే తదేకంగా చూస్తూ ఉండిపోయేడు ఆయన.

ప్రతి ఉత్తరానికీ చివర్లో పి.ఎస్.లు వ్రాసే మతిలేని ప్రొఫెసర్ అలవాటు, ఈ కథని ఇంకో మలుపు తిప్పటానికి ఉపయోగపడింది. చాలా విచారకరమైన మలుపు.

"ఇండియన్ టైమ్స్" అన్న దినపత్రిక ఆంధ్రదేశం నుంచి వెలుపడుతుంది. చాలా తక్కువకాలంలో ఇది ఎక్కవ అమ్మకాన్ని సాధించ గలిగింది. దానికి కారణం అది ప్రచురించే అతిశయోక్తులు. మామూలు విషయాన్ని కూడా అందంగా, చదివేవారికి కుతూహలం కలిగించేలా ప్రకటిస్తూ ఉంటుంది. నలుగురు చాకుల్లాంటి సబ్ ఎడిటర్లున్నారు. మిగతా దిన పత్రికలకి అందని విషయాల్ని కూడా సేకరించి వీళ్ళు ప్రచురిస్తూ ఉంటారు. వాళ్ళలో ఒకామె శైలజ.

రమణ ఆ రోజు మామూలుగా లంచ్ అవర్లో టీ తాగి వచ్చి, తన సీట్లో కూర్చొని పని చేసుకొంటున్నాడు.

అంతలో ప్యూన్ వచ్చి టైమ్స్ ఆఫీసులో ఎవరో అతడి గురించి వేచి ఉన్నారని చెప్పాడు.

సాధారణంగా పత్రికాఫీసుల్లో బయటవాళ్ళని లోపలికి రానివ్వరు. సెక్యూరిటీ దగ్గిరే ఆపుచేసి, ఫోన్‌లో కావాల్సిన వాళ్ళని కనుక్కొని, అప్పుడు పంపిస్తారు పాస్ ఇచ్చి.

'వచ్చిందెవరూ' అని కనుక్కుంటే ప్రొఫెసర్.

"వెల్‌కమ్ టు మై ఆఫీస్" ఆనందంగా ఆహ్వానించేడు రమణ.

ప్రొఫెసర్ వచ్చి ఎదుటిసీట్లో కూర్చొని చుట్టూ చూసేడు. పెద్ద హాలు. ఎవరి పని వాళ్ళు తలవంచుకొని చేసుకుపోతున్నారు.

"టీ త్రాగుతారా?" అడిగేడు రమణ.

"టీ కాదు ముఖ్యం. నీతో ఓ విషయం చెప్పటానికి వచ్చేను".

"ఏమిటి?".

"మనం సాయంత్రం ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళుతున్నాం".

*    *    *    *    *    *

శైలజకి జ్ఞాపకశక్తి ఎక్కువ. చాలా సంవత్సరాల తర్వాత చూసిన విషయాల్ని కూడా జ్ఞాపకం పెట్టుకోగలదు. అందుకే ప్రొఫెసర్‌ని గుర్తు పట్టింది.

అతడీ ఆఫీసుకు ఎందుకొచ్చినట్లు?.

రమణ ముందు కుర్చీలో కూర్చోవటం చూసి ఆమె అక్కడికి వచ్చింది. అక్కడికి ఆమె చేరుకొనే సమయానికి రమణా, ఆయనా ఘర్షణ పడుతున్నారు. శెలవు దొరకదంటున్నాడు రమణ. ఎలాగయినా వీలు చూసుకొమ్మనీ, తనకి అక్కడ అసలేమీ తెలియదనీ ప్రొఫెసరంటున్నాడు.

"హల్లో!" అంటూ చేరుకున్నది ఆమె అక్కడికి. "మీరు ఆనంద మార్గం కదూ?" కుర్చీలో కూర్చొంటూ అడిగింది.

"కాదు, అయోమయం" అన్నాడు ప్రొఫెసర్.

ఆమె నవ్వి "సరే, మీ మతిమరుపు చూస్తూంటేనే తెలుస్తూంది. మీరు ప్రొఫెసర్ ఎ.యమ్.ఎ.యమ్. అని" అంది.

"మీకు తెలుసా?" రమణ అడిగేడు.

"చాలాకాలం క్రితం పేపర్లో ఫోటో చూసేను".

"నీ జ్ఞాపకశక్తి మెచ్చుకోదగిందమ్మాయ్" అన్నాడు ప్రొఫెసర్.

"ఇలా వచ్చారేమిటి?".

వచ్చిన పని చెప్పేడు ప్రొఫెసర్.

"నాకు శెలవు దొరకదు. చేరి నాలుగు రోజులు కాలేదు, అప్పుడే శలవంటే ఇంటికి పంపిస్తారు" అన్నాడు రమణ.

"ఎందుకు ఢిల్లీ?" అడిగింది శైలజ.

"ప్రధానమంత్రి స్వయంగా రమ్మన్నారు....".

అప్పటి వరకూ కుర్చీలో వెనక్కిరాలి, కబుర్లు చెబుతూన్నదల్లా ఈ మాటతో నిటారుగా అయి "ప్రధాన మంత్రా?" అంది.

ప్రొఫెసర్ ఉత్తరం చూపించేడు.

దాంతో ఆమెకు కుతూహలం పెరిగింది. "అసలు విషయం ఏమిటి? మొత్తం అంతా వివరంగా చెప్పండి" అంది.

నక్షత్రం గురించీ- అది భూమి పై రావటం గురించీ అంతా చెప్పేను. ఒక క్షణం ఆమె మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది.

తరువాత, "ఒక షరతు మీద రమణకి లీవు ఇస్తాం" అంది.

"ఏమిటి?".

"ఈ విషయాన్ని ఢిల్లీలో ఏ పత్రిక్కీ మీరు ముందు వెల్లడి చెయ్యకూడదు".

"సరే దానికేముంది" అన్నాడు ప్రొఫెసర్.

"ఒకవేళ వెల్లడి చేసినా ఎవరూ నమ్మరు. అసలు నేను వ్రాసిన ఓ పిచ్చి ఉత్తరానికి అంత ప్రాముఖ్యత రావటమే నాకు ఆశ్చర్యంగా ఉంది. నావన్నీ కాకుల లెక్కలు" అన్నాడు. ఆమె నవ్వి "మాకు కావలసినవి అలాటి వార్తలే. లోకులు కాకులు" అంది.

ఆ సాయంత్రం బోయింగ్‌లో ప్రొఫెసర్, రమణ ఢిల్లీ వెళ్ళారు.

*　　*　　*　　*　　*　　*

ఆ మరుసటిరోజు ఇండియన్ టైమ్స్ పత్రికలో ఒక మూల బాక్సు కట్టి ఒక వార్త పడింది ఇలా.

ఆగష్టు నాలుగు, అంతరిక్షం.

భూమిమీద సకల చరాచరాలు నాశనం కాబోతున్నాయా? ప్రొఫెసర్ ఆనందమార్గం అంచనా నిజమయ్యే పక్షంలో ఆ రోజు ఎంతో దూరంలో లేదు. ప్రాక్సిమా సెంక్చువరీ అనే నక్షత్రం భూమికి దగ్గరగా దూసుకువస్తోంది. కొన్ని వేలకోట్ల మైళ్ళ వేగంతో వస్తూన్న యీ నక్షత్రం భూమి యొక్క పరిధిలోకి ఆగష్టు పదిహేడు ప్రొద్దున్న పదకొండు గంటల పది నిమిషాలకి ప్రవేశించి, మూడు సెకన్ల కాలం పాటు వుండి అనంతవిశ్వంలోకి వెళ్ళిపోతుంది. అయితే భూమిలో వుండే పదార్థాలన్నీ పోటీ పడి ఆ నక్షత్రాన్ని చేరుకోవటానికి తొందరపడడంలో భూమి పేలిపోతుంది. కాగితంలో పకోడీలు దట్టంగా కూరినొక్కితే పేలినట్టు భూమి పేలిపోతుందా? పదిహేడో తారీఖు వరకూ వేచి చూద్దాం. ప్రొఫెసర్ మాటలేగానీ యదార్థమైతే ఆ తర్వాత చూడటానికి మనం ఎలానూ వుండముగా.

- మా విలేఖరి.

ఇండియన్ టైమ్స్ పత్రిక అతితొందర్లోనే పైకి రావటం చూసి ఓర్వలేని మరో దినపత్రిక మధ్యాహ్నం ఎడిషన్ ఇలా ప్రకటించింది.

"ఒక ప్రముఖ దినపత్రిక ప్రకటించిన అసత్యవార్త వల్ల నగరంలో అలజడి. 'ప్రళయం వస్తుంది' అని పత్రిక ప్రకటించడం వల్ల ప్రజలు భయకంపితులవుతున్నారు. గుండె జబ్బు వున్న వాళ్ళ పరిస్థితి మరింత ప్రమాదకరమయింది. ఈ వార్త మూలన తన ఆరోగ్యం దెబ్బతిన్నదనీ, దానికి నష్టపరిహారంగా యాభై వేల రూపాయలకి దావా వెయ్యబోతున్నాననీ హైకోర్టు న్యాయవాది ఒకరు ప్రకటించారు".

ఈ వార్త చూసి, ఇండియన్ టైమ్స్ ఎడిటర్ కంగారు పడ్డాడు. అవసరమైన చిక్కుల్లో

యిరుక్కోవటం యిష్టంలేదు. శైలజని చీవాట్లు పెట్టేడు.

మనిషి మనుగడమీద జూదం మొదలయింది.

*           *           *           *           *           *

## ఆగష్టు నాలుగు- ఢిల్లీ

పదకొండు గంటలకి అప్పాయింట్‌మెంట్.

తొమ్మిది గంటలకి సెక్రటేరియట్‌కి చేరుకున్నారు యిద్దరూ. రమణ గుండె వేగంగా కొట్టూకొంటోంది. ప్రధాన మంత్రితో తను స్వయంగా మాట్లాడబోతున్నాడు. కలలో కూడా వూహించలేని విషయం అది.

పావుతక్కువ పదింటికి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ వెరిఫికేషన్ జరిగింది. ప్రోగ్రామ్ షీట్‌లో పేరు వ్రాయబడింది.

పావు తక్కువ పదకొండుకి విజిటర్స్ ఛాంబర్‌లోకి ప్రవేశం లభించింది. ఆ ఛాంబర్‌లోకి వెళ్ళాలంటే కారిడార్‌లోంచి నడవాలి- అక్కడే విజిటర్లు యేమయినా ఆయుధాలు ధరించిందీ లేనిదీ పరీక్ష జరుగుతుంది.

పదకొండు కొడ్తూ వుండగా డ్రాయింగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. జగదీష్‌చంద్ర వీళ్ళని చూసి విష్ చేసి కూర్చోమన్నాడు. రమణ ఎగ్‌జైట్‌మెంట్‌తో వూపిరి బిగపట్టేడు. వాళ్ళకి యివ్వబడిన సమయం అయిదు నిముషాలు.

"మీరేనా ప్రొఫెసర్?".

తలూపేడు. నిమిషంపాటు మామూలు సంభాషణ.

"నక్షత్రం ఒకటి భూమివైపు వస్తుందని ఎందుకు భావిస్తారు మీరు?" విషయం కదుపుతూ అన్నాడు.

"చూసేను కాబట్టి".

"ఎక్కడా?".

"నా టెలిస్కోప్‌లో".

"మీ దగ్గర టెలిస్కోప్ వుందా?".

"ఉంది".

"మనదేశంలో వున్న మిగతా అబ్జర్వేటరీస్ కనుక్కోలేని విషయాన్ని మీరు ఎలా కనుక్కొన్నారు?"

"మనదేశంలో ఎక్కడా నా దగ్గరున్నంత పెద్ద టెలిస్కోప్ లేదు. మనదేశంలోనే కాదు, ప్రపంచంలోనే లేదు".

జగదీష్‌చంద్ర, అవినాష్ అతడివైపు చిత్రంగా చూసేరు. కొంచెం సేపు ఎవరూ మాట్లాడలేదు.

"ఆ నక్షత్రం భూమివైపే వస్తుందని ఎందుకనుకొంటున్నారు? ఒకవేళ వచ్చినా అది పదిహేడో తేదీనాడే వస్తుందని నమ్మకం ఏమిటి?.

"లెక్కలు కట్టేను".

"మీ దగ్గర కంప్యూటరుందా?".

"నా మెదడే కంప్యూటరు".

"ఎనభై ఎనిమిది తొంభై మూళ్ళెంత?" అవినాష్ నవ్వుతూ అడిగేడు.

"ఎనిమిదివేల నూట యెనభై నాలుగు".

మళ్ళీ కొంచెం నిశ్శబ్దం.

"ప్రపంచంలో ఏ ఆస్ట్రానమిస్టు కనుక్కోలేనిదాన్ని మీరు ఏ పరికరమూ లేకుండా కనుక్కున్నానంటారా?".

"నేను కనుక్కున్నది నిజమవనూ వచ్చు, కాకపోనూవచ్చు, ప్రపంచం సంగతి నాకు తెలీదు. ఏ అబ్జర్వేటరీ పని చెయ్యటం లేదు".

జగదీష్ భృకుటి ముడిపడింది "పని చెయ్యటం లేదా?" సాలోచనగా అన్నాడు.

అయిదు నిమిషాలైయినట్టు సంకేతం. మరికొంత పొడిగింపబడింది.

జగదీష్అన్నాడు "ఆ నక్షత్రానికి మీరన్నట్టు ఆకర్షణ శక్తిగాని వుంటే, వస్తువులే కాదు, అన్ని పదార్థాలూ దాన్ని చేరుకుంటాయి కదా".

"అది ఆ నక్షత్రపు ఆకర్షణ శక్తిని బట్టి వుంటుంది".

"అంటే....".

"ఒక అయస్కాంతం ఇనుప ముక్కని ఆకర్షిస్తుంది. ఆ నక్షత్రంలో వుండే అయస్కాంతం బంగారం మీద ఎక్కువ ప్రభావాన్ని చూపించగల్గితే.... అన్నిటికన్నా ముందు బంగారం భూమి నుంచి వెలుపలికి వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తుంది".

"ఏ గ్రహపు ప్రభావం ఏ యే లోహాల మీద ఎక్కువగా వుంటుందని మీరనుకుంటున్నారు?".

"క్షమించండి, నేను ఆస్ట్రానమిస్ట్ని, జియాలజిస్ట్ని కాను" అన్నాడు ప్రొఫెసర్ "ఏది ఏమైనా, పదిహేడో తారీఖు పదకొండింటికి అది అత్యంత సమీపంగా వస్తుంది కదా, అప్పుడు అన్ని వస్తువులూ దానివైపు ఆకర్షితమవుతాయి".

"నా ప్రశ్నని మీరు సరిగ్గా అర్థం చేసుకోలేదు" అన్నాడు జగదీష్ "ఆ నక్షత్రం దేన్ని బాగా ఆకర్షించగలదో అది భూమిని వీడి తొందరగా అటువైపు వెళ్ళిపోతుంది. ఉదాహరణకి అది ఇనుముని బాగా ఆకర్షిస్తుందనుకోండి. పదకొండు గంటలా పదినిమిషాలకి ముందే భూమి యొక్క లితోస్ఫియర్లో వుండే 19 శాతం ఇనుము అటు వెళ్ళిపోతుంది. అంటే భూమి బ్రద్ధలవటం ప్రారంభిస్తుందన్న మాట. అవునా?".

ప్రొఫెసర్ ఒక క్షణం ఆలోచించాడు "అలా అవటం సాధ్యమై వుంటే ఆ కదలిక యేదో ఒక పదార్థంలో తొందర్లో మొదలవుతుంది" అన్నాడు.

"తొందర్లో అవటం కాదు, అయింది" నెమ్మదిగా స్ఫుటంగా అన్నాడు జగదీష్. శ్రోతలు ఉలిక్కిపడ్డారు. గదిలో సూది పడ్తే వినపడేంత నిశ్శబ్దం.

"....నేను స్వయంగా చూసేను. నెలరోజుల క్రితం ఒక పెద్ద రాయి గాలిలో ఎవరో లేపినట్టు పైకి లేచి క్రిందికి పడిపోయింది. నా ఉద్దేశం ఆ రాతిలో వున్న పదార్థం ఆ రోజు ముందుగా ఆకర్షణ శక్తికి లోనవుతుందన్నమాట" అంటూ లేచాడు "ఆ పదార్థం ఏమిటో కనుక్కోండి. దానివల్ల మీ థియరీకి ఏదయినా లాభం కలుగుతుందేమో చూడండి. మీ రిపోర్టు పంపండి-".

ఇద్దరూ షేక్ హ్యాండిచ్చి బైటకొచ్చారు.

"ఏమిటిదంతా?" అవినాష్ అడిగేడు వాళ్ళు వెళ్ళేక.

"మానవుడి జీవితానికి ఆఖరి రోజు వచ్చిందని యీ ప్రొఫెసర్ అంటున్నాడు. అది ఎంత

వరకు నిజమో తెలీదు, అదే నిజమై యీ మానవ జాతి అంతరించిపోతే.... అప్పుడు యీ రాజకీయాలుండవు- మనిషి మనిషి డబ్బు కోసం, కీర్తి కోసం, పదవి కోసం కొట్టుకొని చావటం వుండదు. ఒకవేళ అది నిజం కాకపోతే- అదీ మనకి లాభమే. ప్రజల దృష్టి అటు మళ్ళుతుంది. మనషికి ప్రాణం కన్నా తీపి యింకొకటిలేదు. నెల రోజుల పాటూ దేశంలో యే నోట విన్నా అదే సమస్య వినిపిస్తుంది. ప్రతీ పేపరు యెక్కువ స్థలాన్ని ఆ విషయం రాయడానికే కేటాయిస్తాము. ఈ లోపులో మనం బలం పుంజుకోవచ్చు. మన స్థానాన్ని సుస్థిర పర్చుకోవటాని ఈ పదిహేను రోజులూ చాలు. ప్రజలు దృష్టి డైవర్ట్ చెయ్యటానికి ఇంతకన్నా మంచి విషయం ఇప్పట్లో ఇంకొకటి వుంటుందని నేను అనుకోను".

పార్టీ ఛీఫ్ నవ్వేడు. మనిషి మనుగడమీద రాజకీయ చదరంగం ప్రారంభమైంది.

*　　*　　*　　*　　*　　*

ఢిల్లీ, ఆగష్టు నాలుగు రాత్రి.

చేతులు రెండూ తలక్రింద పెట్టుకొని వెల్లకిలా పడుకొని ఆకాశం కేసి చూస్తున్నాడు ప్రొఫెసర్. పక్కనే ఇంకో పక్కమీద రమణ. టైమ్ తొమ్మిదయింది. ప్రధానిని కలుసుకొని అప్పటికి పది గంటలు కావొస్తూంది.

"రాయి గాలిలో లేవటం చిత్రంగా వుంది?" అన్నాడు రమణ.

"అందులో చిత్రం యేముంది? అందులోని ఒక పదార్థం ఏదో ఆకర్షణకి లోనై వుంటుంది".

"ఆ విషయం ప్రధాని యెందుకు ఆ రోజే వెల్లడి చేయలేదు?".

"ఏమని వెల్లడిచేస్తారు? అర్థరాత్రి తాను ఓ రాయి గాలిలోకి లేవటం చూశాననా? అలా చెప్తే ప్రతిపక్షం వాళ్ళు బ్రతకనిస్తారా? ప్రధానికి మతిపోయిందని ప్రచారం చెయ్యరూ-".

నిజమేనన్నట్టు రమణ మాట్లాడలేదు.

"ఏ లెవల్‌లో వుండే కష్టాలు ఆ లెవల్లో వుంటాయి. బై ది బై నీకు పెళ్ళయిందా?".

రమణ నవ్వేడు. "కాలేదు".

"మరి ప్రపంచం ఆఖరయిపోతే యేం చేస్తావ్".

"బ్యాచెలర్‌గానే చచ్చిపోతాను".

"లేదు లేదు. విషయం అంత వరకూ వస్తే యీ పది రోజులు బాగా ఎంజాయ్ చెయ్యి. రేపే పెళ్ళి చేసుకో!".

రమణ మాట్లాడలేదు.

"పది రోజుల కోసం ఎలాంటి అమ్మాయి అయితేనేం? అమ్మాయి అయితే చాలు".

"అలా అనకు. కళ్ళు తామరపూవుల్లా వుండాలి".

"మెడ శంఖంలా వుండాలి" నవ్వాడు. అతడికి మాలతి జ్ఞాపకం వచ్చింది.

"పెదవులు తమలపాకుల్లా వుండాలి".

"మీకు కవిత్వం వచ్చే-".

"చెక్కిళ్ళు దానిమ్మపళ్ళల్లా వుండాలి".

"పలువరస బియ్యపు గింజల్లా వుండాలి".

"ముక్కు సంపెంగ-".

"జడ మిన్నాగు-".

"బొట్టు, దోసగింజంత సింగారం".

"కట్టు, పాత పోసిన బంగారం".

"అన్నీ కలిసిన మొహం చంద్రబింబం".

"మామూలు చంద్రబింబం కాదు, పౌర్ణమి నాటి చంద్రబింబం....".

"ఆహా....నిండు ఆకాశంలో.... అలా....".

"ఈ రోజు అమావాస్య" అన్నాడు రమణ.

"ఆస్ట్రానమిస్ట్‌కి అమావాస్య యేదో పౌర్ణమేదో చెపుతున్నావా.....ఆగష్టు నాలుగు ఈ రోజు పౌర్ణమి".

"మరి చంద్రుడేడి?".

ప్రొఫెసర్ ఆకాశం వైపు చూసేడు.

నక్షత్రాలు మిల మిల మెరుస్తున్నాయి. ఎక్కడా చిన్న మబ్బు తునక కూడా లేదు. ఆకాశం నిర్మలంగావుంది. చంద్రుడు మాత్రం లేడు.

ఇద్దరు మొహాలు చూసుకొన్నారు.

"ఆరింటికి రావలసిన శశాంకుడు ఏ తారలో సరసమాడటానికి వెళ్ళేడు?" ప్రొఫెసర్ నవ్వుతూ అన్నాడు.

రమణ నవ్వలేదు.

ఇప్పటివరకూ అంతా నవ్వులాటగా- ఏదో కలలాగా జరిగిపోయింది. కానీ ఒక్కొక్క విపరీతమే చూస్తూ వుంటే జరుగుతున్న దంతా నిజమేనన్న నమ్మకం కలుగుతోంది. ఒక్కసారి ఆ భావన వచ్చేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది. సన్నగా వణికేడు.

"చం....చంద్రుడేమయ్యాడు?".

"చూద్దాం" అంటూ కళ్ళు మూసుకున్నాడు. అతడి పెదవులు అస్పష్టంగా కదలసాగాయి. రెండు నిమిషాల తర్వాత కళ్ళు తెరచి "పదిన్నర......" అన్నాడు. "....నా లెక్క కరెక్టయితే ఈ రాత్రి పదిన్నర వరకూ చంద్రుడు రాడు-"

ఇంతలో క్రింద చప్పుడయింది.

ఫోను...

భూగర్భ శాస్త్రజ్ఞుడు భట్ ఫోన్ చేసేడు.

"యస్ భట్!".

"మీరు అర్జంటుగా రాగలరా?".

"ఆ రాయి పరీక్ష చేసేరా?".

"ఆ విషయమే మాట్లాడాలి. వస్తారా?".

"ఇప్పుడే వస్తున్నాను".

రమణా, ప్రొఫెసర్ లాబ్‌కు వెళ్ళేసరికి పది అయింది. భట్ వాళ్ళకోసమే యెదురు చూస్తున్నాడు. వాళ్ళని లోపలికి తీసుకేళ్ళాడు.

"ఏ ఏ యెలిమెంట్సు వున్నాయి ఆ రాతిలో?".

"చాలా చిత్రం-".

"చెప్పండి".

"భూమ్మీద వున్న ఎలిమెంట్సు- ఇనుము, రాగి, ఇత్తడి....ఇలాంటి వేమీ అందులోలేవు. ఏ లోహమూ లేదు. అందులో వున్న పదార్థం.....".

"ఊ...పదార్థం-".

"క్షమించండి. నా ముప్పై సంవత్సరాల అనుభవంలో ఆ పదార్థం ఏమిటో నేను కనుక్కోలేకపోయాను. భూమ్మీద దొరికే అన్ని రకాల ఎలిమెంట్సుతోనూ, లోహాలతోనూ పరిశీలించి చూసేను. నాకు అంతుబట్టలేదు."

ఎవరూ మాట్లాడలేదు చాలాసేపు.

ప్రొఫెసర్ బలంగా శ్వాస వదిలి "టిటానియమ్ యేమో చూశారా?" అన్నాడు.

"సారీ ప్రొఫెసర్, కాదు" అన్నాడు భట్.

"పరిశీలించండి నేనూ ఆలోచిస్తాను" బయటికి వస్తూ అన్నాడు.

మెట్లెక్కి పైకి వస్తూంటే, "టైమెంతయింది?" అడిగేడు ప్రొఫెసర్.

"పదిన్నర."

"వచ్చేడా చంద్రుడు?"

చప్పున తలెత్తి చూసేడు రమణ.

.... ఆకాశం నిర్మలంగా వుంది. నక్షత్రాలు మిల మిల మెర్తుస్తున్నాయి. ఒక మూలనుంచి నెమ్మదిగా వస్తున్నాడు చంద్రుడు.

ఏదో ఆలోచన స్ఫురించి ప్రొఫెసర్ సన్నగా వణికేడు.

*　　*　　*　　*　　*　　*

ఆ మరుసటి రోజు తెల్లవారుఝామున అయిదింటికి మెలకువ వచ్చింది రమణకి. కళ్ళు విప్పగానే పచార్లు చేస్తున్న ప్రొఫెసరు కనిపించాడు. పక్కనిండా గాలికి చెల్లాచెదురైన కాగితాలు, కాగితాల్నిండా లెక్కలు.

రమణ లేవటం చూసి, అతడు ఆగి, "ఈరోజు మనమో దొంగతనం చెయ్యాలి!" అన్నాడు.

"ప్రొద్దున్నే మాట్లాడటానికి ఇంతకంటే మంచి కబుర్లు దొరకలేదా?" అన్నాడు అతడ్ని తేరిపార చూస్తూ.

"జోకు కాదు నిజమే!"

"ఏం దొంగతనం చెయ్యాలి?"

"చంద్రశిల...."

రమణ తల విదిలించేడు.

ప్రొఫెసర్ అన్నాడు. "నీకు జ్ఞాపకం వుందా? చాలా రోజుల క్రితం- ఐ మీన్ కొన్ని సంవత్సరాల క్రితం ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అతను చాంద్రుడి రాళ్ళను తెచ్చేడు. ఆ తెచ్చిన రాళ్ళలో ఒక్కో దేశానికి ఒక్కో పౌండు బరువున్న శిలని అమెరికా బహుమతిగా ఇచ్చింది...."

తెలుసన్నట్టు తలూపాడు రమణ.

"చంద్రుని నుంచి తెచ్చిన ఆ శిలల్లో భూమికి వినాశకరమైనదేమన్నా వుందేమోనని చాలా భద్రంగా వుంచింది ప్రతి దేశమూ. దాన్ని మనం దాన్ని సంపాదించాలి."

"ఎందుకు?"

"ప్రశ్నలెయ్యకు. నిజానికి ఎందుకో తెలీదు."

............

ఆ రోజు పదింటికి ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియాలజీ మ్యూజియంలో వున్నారు. ప్రధాని తాలూకు అతిధులుగా వాళ్ళకి ప్రత్యేక స్వాగతం లభించింది. తిరిగొచ్చేటప్పుడు ప్రొఫెసర్ పొడవాటి తన కోటు వెనుకనుంచి చంద్రశిల తాలూకు ఓ చిన్న ముక్క తీసుకువచ్చాడు.

పదకొండింటికి ఇద్దరూ జియాలజిస్ట్ భట్ లేబరేటరీలో వున్నారు.

"ఇదిగో ఇది చూడండి" అంటూ శిలని అందించేడు ప్రొఫెసర్.

"ఎక్కడిదీ రాయి?" అందుకొంటూ అడిగాడు భట్.

"మా యింటి పెరట్లోది. దీన్ని పరీక్షించి ఇదీ, ఆ రాయిలో వున్నదీ ఒకే లోహం అవునో కాదో చెప్పండి-" అన్నాడు ప్రొఫెసర్.

భట్ లోపలికి వెళ్ళాడు.

"ఏమిటిదంతా?" అడిగేడు రమణ.

"చంద్రుడు శిల నుండి తెచ్చిన శిలల్లో ఒక కొత్త రకం పదార్థం వుంది. ఆ పదార్థం భూమీ్మద లేదు. మన సైంటిస్టులు దానికి 'అర్మాల్‌కొలైట్' అని పేరు పెట్టారు. అంటే ఏమిటో తెలుసా?"

"ఉహూ...."

"చంద్రుడి నుంచి శిలల్ని తెచ్చిన వాళ్ళెవరు?"

"నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఆల్‌డ్రిన్, కొలెన్స్ అనే ముగ్గురు."

"వాళ్ళ పేర్లు కలిసొచ్చేలా ఆ కొత్త పదార్థానికి ఆ పేరు పేట్టారు. ఈ రాయిలో రానీ ఆ కొత్త పదార్థం వుంటే...."

"ఉంటే...." అర్థంకాక అడిగేడు.

ప్రొఫెసర్ మొహం వాడిపోయింది "రేపు రాత్రే చంద్రుడికి ఆఖరి రోజు. ఎల్లుండి రాత్రి పన్నెండు గంటలకి ఆ నక్షత్రం వైపు వెళ్ళి 'స్మాష్' అయిపోతాడు."

"ఎలా!"

"ఎంతో దూరం నుంచే ఆ నక్షత్రం భూమ్మీద వున్న ఈ రాయిని ఆకర్షించింది. అయితే అర్మాకొలైటు ఆ రాతిలో తప్ప ఇంకెక్కడా లేదు. కాబట్టి ఫర్వాలేదు. కానీ ఆ పదార్థం- ఐ మీన్- అర్మాకొలైటు చంద్రుడిలో వుంది కాబట్టీ...." ప్రొఫెసర్ ఆగాడు.

".... ఎల్లుండి చంద్రుడికి ఆఖరిరోజు. మనం తేల్చుకోవల్సిందల్లా ఆ రాతిలోను, చంద్రుడిలోనూ వున్నది ఒకే పదార్థమా అని. అలాగానీ అయితే ఎల్లుండి చంద్రుడికి చివరి రోజు. అదే ప్రళయానికి నాంది."

అంతలో లోపల చప్పుడయింది. భట్ బయటికొచ్చేడు. అతడి మొహం అనందంతో వెలిగిపోతోంది.

"రెండు శిలల్లోని లోహం ఒకటే ప్రొఫెసర్" అన్నాడు ఉత్సాహంగా.

* * * * * *

ఇండియన్ టైమ్స్ పత్రికలో పడిన ఆ చిన్న వార్త చాలా సంచలనాన్ని కలిగించింది. భూమి ఆఖరవుతుందా? అన్న ఉత్తరాలూ, "చివరి రోజు" మీద వ్యాసాలూ, మరుసటి రోజుకే పత్రికా కార్యాలయానికి వచ్చి చేరుకున్నాయి.

ప్రాణం మీద మనిషి కెంత తీపో తెలిపేటందుకు నిదర్శనంగా ఆ వార్త నిజానిజాలడుగుతూ ఫోన్ కాల్స్.

ఈ వార్తని వెల్లడించిన ప్రొఫెసర్ క్వాలిఫికేషన్లు సామాన్యమైనవి కావు. ఈ విషయం ఎంక్వయిరీ చేసిన ఎడిటరు, శైలజని వెంటనే ఢిల్లీ పంపేడు. ఇలాంటి వార్తలే పత్రిక సర్కులేషన్ పెంచేవి. అందులోనూ ఏ పత్రికా వెయ్యని వార్త అది.

తను కనుక్కొన్న దాని మీద ఎడిటర్ ఉత్సాహం చూపించటంతో శైలజ సంతోషం పట్టశక్యం కాలేదు. ఆ రోజు ఆమె ఢిల్లీ వచ్చేసింది.

ఆమె ప్రొఫెసర్‌ని కలుసుకొనే సమయానికి భూమియొక్క ఆఖరి క్షణం ఎప్పుడూ అన్నది కరెక్టుగా లెక్క కట్టాడు. అలాగే చంద్రుడు తన పరిధి నుంచి తప్పుకొని ఎప్పుడు స్మాష్ అయిపోతాడూ అన్న విషయం కూడా.

మొదటిది ఆగస్టు పదిహేడు, రాత్రి పదకొండు గంటలా మూడు నిముషాల అయిదు సెకన్లకి.

ప్రధానమంత్రికి అందించటంకోసం రిపోర్టు తయారు చేస్తూండగా శైలజ ఆ గదిలోకి అడుగు పెట్టింది.

రమణ సంభ్రమాశ్చర్యాల్తో "ఇదేమిటి, మీరిక్కడికి వచ్చేరు?"

ఆమె నవ్వి వూరుకొంది.

ప్రొఫెసర్ కళ్ళు యెర్రగా వున్నాయి. రాత్రంతా నిద్రలేదతనికి. ఆ రాతిలోవున్న లోహమూ, చంద్రశిలలో వున్న లోహమూ ఒకటేనని తెలిసిన దగ్గర్నుంచీ అతడి మొహంలో నవ్వు మాయమైంది. అయితే అది ప్రాణభయం కాదు. అతడికి తెలుసు, భూమి నాశనం కాబోతోందనీ, దేవుడనేవాడే వుంటే, వాడు కూడా దాన్ని రక్షించలేడనీ.

కొత్త విషయాన్ని కనుక్కొనే ఉత్సాహంతో యింత వరకూ ముందుకు సాగేడు. కానీ చివరికి అంతా కనుక్కొని వెనుదిరిగి చూసుకొంటే.... తను సాధించిందేమిటి?

డిస్ట్రక్షన్- సర్వనాశనం!!

అతడకి నవ్వూ, ఏడుపూ ఒకేసారి వచ్చినయ్. అన్ని ఫీలింగులకూ అతీతుడైన ఆ వృద్ధుడి మనసులో కలవరం మొదలయింది.

"ఏం కనుక్కొన్నారు?" శైలజ అడిగింది.

"చాలా గొప్ప విషయాన్ని కనుక్కొన్నాం!" అన్నాడు రమణ ఉరకలేస్తున్న ఉత్సాహంతో. "రేపు రాత్రితో...."

"ఆగు....!" అరిచేడు ప్రొఫెసర్.

రమణ చెబుతున్నది ఆపి, చిత్రంగా అతడివైపు చూసేడు "ఈ విషయం వెల్లడి కావటానికి వీల్లేదు" అన్నాడు. అతడి ముడతలు పడ్డ చెక్కిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి. కళ్ళు తీక్షణంగా వెలుగుతున్నాయి. మనిషి ఆవేశంతో వూగిపోతున్నాడు.

పిడికిళ్ళు బిగించి "ఈ విషయం వెల్లడికావటానికి వీలులేదు. ముఖ్యంగా పత్రికల వాళ్ళకి-" అన్నాడు.

ఇన్నాళ్ళూ మిగతా అబ్జర్వేటరీస్ అన్నీ యీ విషయాన్ని యెందుకు వెల్లడి చెయలేదు? అమెరికా, రష్యాలు ఎందుకు చెప్పలేదు? ప్రొఫెసర్‌కి యిప్పుడు అర్థమయింది.... ఈ విషయం వెల్లడి చేయటంవల్ల వచ్చే లాభం ఏమిటి? కెవలం ప్రజల్లో భయోత్పాతం తప్ప. చావు ఎలానూ తప్పనప్పుడు అది తెలియకుండా చావటమే మంచిది అంతా నిశ్శబ్దంగా జరిగిపోవాలి. తమ పరిశోధన తమతోనే అంతం అయిపోవాలి..... ఈ ఆలోచనలతోనే అతడు చెప్పొద్దన్నాడు.

రమణ అతనివైపు నిదానంగా చూసేడు. రమణ ఆలోచన్లు వేరు. ఇంకోలా అర్థంచేసుకోన్నాడు.

ప్రపంచం ఇక పన్నెండు రోజుల్లో అఖరవబోతుంది. ఆ విషయం అందరికీ తెలిస్తే.... దీన్ని యీ విపత్కర పరిస్థితినుంచి రక్షించటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు ప్రతి సైంటిస్టూ ప్రాణాలు ధారపోసి దాన్ని ఆపటానికి పరిశోధనలు మొదలు పెడ్తాడు. ఈ వృద్ధుడు ఎందుకు తనని చెప్పొద్దంటున్నాడు-?

అతడికి చప్పున ఓ విషయం అర్థమయింది.

నోబుల్ ప్రైజ్!

అవును. నోబుల్ ప్రైజ్!

ఈ పదిరోజులు ఏదయినా కృషిచేసి, దీన్ని తనే సాధించాలని యీ ప్రొఫెసర్ ప్రయత్నం. ఒకవేళ తను సాధించలేకపోతే ఈ ప్రపంచం నాశనమైనా దానికి సిద్ధపడ్తాడు కానీ, యీ అవకాశం మరోకరికి దక్కనివ్వడు.

'మనిషెంత స్వార్థపరుడు' అనుకున్నాడు రమణ.

ఒకవైపు కొంపలంటుకుపోతూ వుంటే, ఇంకోవైపు అందులో తనకేం దొరుకుతుందా అని వెతుకుతున్నాడు ప్రొఫెసర్.

అతడో నిర్ణయానికి వచ్చాడు. ప్రొఫెసర్ వైపు సూటిగాచూసి "నేను చెప్పాలి. చెప్పకుండా నన్నేవరూ ఆపుచెయ్యలేరు" అన్నాడు. అని, ఆమెవైపు తిరిగి, "రేపు రాత్రి పన్నెండు గంటలకి...." అంటూ ఏదో అనబోయాడు.

ప్రొఫెసర్ కదిలేడు. నరనరాల్లో వున్న బలం అంతా చేతుల్లోకి తెచ్చుకొని, రమణ నోరు ముయ్యటానికి ప్రయత్నించేడు. కానీ అతడి బలం చాల్లేదు. ఒక్క విసురుతో పడిపోయాడు. రమణ ఆమె వైపు తిరిగి, "మన పత్రికకి ఒక న్యూస్! ఎవరూ నమ్మలేనిది. గానీ పచ్చినిజం. ఎవరూ నమ్మకపోయినా అది నిజం! ఈ ప్రొఫెసర్ ఎంత గొప్పవాడో నాకు తెలుసు. కేవల స్వార్థంవల్ల ఇలా అయ్యేడు కానీ నిజంగా గొప్పవాడు. అతడి లెక్క తప్పటానికి వీల్లేదు. శైలజగారూ వినండి! రేపు చంద్రుడికి ఆఖరు రాత్రి, స్మాష్... చంద్రుడు స్మాష్ అవబోతున్నాడు. ప్రకటించండి. మన పత్రికలో పెద్ద అక్షరాలతో ప్రకటించండి. ప్రపంచపు భవితవ్యం రేపు రాత్రి పన్నెండు గంటలకి తేలిపోతుంది. అందర్నీ చూడమనండి. ప్రపంచాన్ని రక్షించటానికి అందర్నీ నడుం కట్టమనండి...."

శైలజ వడివడిగా బయటకు వెళ్ళిపోయింది. సంభాషణ వింటున్న ఒక స్వీపరు అక్కడ్నుంచి తప్పుకొన్నాడు.

గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

ఒక మూలగా పడిపోయిన వృద్ధుడు మోచేతులమీద బలంగా లేవటానికి ప్రయత్నం చేస్తూ, "ఎంతపని చేశావురా మూర్ఖుడా!" అన్నాడు.

"ఈ విషయం అందరికీ తెలిస్తే ఎంత కల్లోలం! ఇది మిగతా సైంటిస్టులకి తెలియకనా వాళ్ళు ఊరుకొన్నది! ఈ పదకొండు రోజులూ ప్రపంచం అల్లకల్లోలం అయిపోతుంది. భగవంతుడా ఎలా ఇప్పుడు....?"

## పదిహేను రోజులు వెనక్కి.

## శాన్‌ఫ్రాన్సిస్కో:

"ఈ విషయం అందరికీ తెలిస్తే..." అన్నాడు విలియమ్ రోగర్స్ యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెంట్.

ఎవరూ మాట్లాడలేదు.

మెక్ లోపలికి వచ్చి కూర్చున్నాడు. జాన్ కళ్ళతోనే విష్ చేశాడు. అతడే అందర్లోకి యువకుడు.

తెల తెల వారుతోంది.

"ఏమిటీ సంగతి....?" కంఠం తగ్గించి అడిగేడు మెక్.

అందరి మొహాలూ సీరియస్‌గా ఉన్నాయి. జాన్ మౌనంగా ఓ కాగితాల కట్ట అందించేడు. దాదాపు పది పేజీలున్న రిపోర్ట్ అది. ఒక మూలగా 'మౌంట్ పలామోర్ అబ్జర్వేటరీ, కాలిఫోర్నియా' అని వుంది. తొందరగా కళ్ళతో చదవసాగేడు.

పూర్తి చెయ్యటానికి అయిదు నిమిషాలు పట్టింది.

ప్రాక్సిమా సెంక్చువరీ అనే నక్షత్రం భూమివైపుకి వస్తున్నది అన్న విషయాన్ని ముందు కనుక్కొన్నది రాయల్ అబ్జర్వేటరీ. వెంటనే గ్రీన్‌విచ్‌ని కాంటాక్ట్ చేసేరు వాళ్ళు. రేడియో ఆస్ట్రోలాజికల్ పరికరాల ద్వారా అది ఎంత వేగంతో వస్తున్నదీ, ఏ దిశగా వస్తున్నది కనుక్కోబడింది.

ఈ విధంగా ప్రొఫెసర్ అనందమార్గం కనుక్కొన్న విషయం అంతకు పదిహేను రోజుల ముందే సరి అయిన తేదీ, సమయంతో సహా గ్రహించబడింది.

ఆగష్టు పదిహేడు పదకొండు గంటలా పది సెకన్లకి ఆ గ్రహం భూమి ఆకర్షణ పరిధిగుండా మూడు సెకన్లకాలం పయనిస్తుంది. భూమి అడుగుపొరల్లో వుండే ఇనుము, లావా దాని ఆకర్షణ శక్తికి లోనై పెల్లుబుకుతాయి!

మిలియను సంవత్సరాల వయసున్న యీ భూమ్మీద చరాలన్నీ గుర్తుకూడా మిగలకుండా నాశనమైపోతాయి. విశ్వంలో వున్న కోట్ల కోట్ల గ్రహాల మాదిరిగానే భూమి కూడా నిస్తేజమైపోతుంది.

సముద్రాలు ఇంకిపోయి వాటిమీద లావా గట్టిపడుతుంది.

రెండు పరమాణులున్న ఆక్సిజన్ మూడో దాన్ని చేర్చుకొని ఓ జోనుగా మారుతుంది. భూమ్యాకర్షణ పరిధిలో ఆ నక్షత్రం రాగానే ఆ కుదుపుకి భూకంపం కలుగుతుంది. అగ్నిపర్వతాలు బ్రద్దలవుతాయి....

ఇక చదవలేదు అతడికి పరిస్థితి అర్థమయింది.

అయితే అది నిజమని నమ్మటానికే కొద్దిగా సమయం పట్టింది. ఎక్కడో లాస్ ఏంజిల్స్‌లో వెచ్చటి రగ్గుకింద పడుకున్న వాణ్ని లేపి ఇంకో రెండు నెలల్లో ప్రపంచం నాశనమైపోబోతుంది అని చెప్తే- అంత తొందరగా నమ్మబుద్ధికాదు. కల అయితే ఎంత బావుణ్ను అన్న భావన.

"ఇదంతా నిజమా- నిజంగా ఇలాగే జరుగుతుందా? ఆ నక్షత్రం తనదారి మార్చుకొనే వీలే లేదా-? ఈ ప్రశ్నలన్నీ రిపోర్టు చదవగానే నాకొచ్చినయ్" అన్నాడు రోగర్స్. "దీనికి సమాధానం ఆగష్టు ఆరో తారీఖున తెలుస్తుంది. ఎలా అని ప్రశ్నించకండి. ఈ ఒక్క విషయమూ రహస్యంగా ఉంచబడింది. అయితే అంతకన్నా ముఖ్య సమస్య ప్రెస్. ఈ విషయం బయటకు పొక్కగానే పత్రికలు దీన్ని తమ సర్క్యులేషన్ పెంచటానికి సాధారణంగా ఉపయోగించుకుంటాయి."

"అందరికీ తేలిస్తే ఏమవుతుంది?" ఫిన్చ్ అడిగాడు.

అప్పటివరకూ మౌనంగా కాగితాలు పరిశీలిస్తున్న కాస్టనోవా తలెత్తి నెమ్మదిగా అన్నాడు. "ఏమవుతుంది అని అడుగుతున్నావా మిష్టర్ ఫిన్చ్? ఈ నలభయి రోజుల్లోనూ ఘాతకాలు జరుగుతాయి. ప్రాణం ఎలాగూ పోతున్నదని తెలిసినప్పుడు మనిషి పనిచెయ్యటం మానేస్తాడు. ప్రాణమే పోతున్నప్పుడు నైతిక విలువ లెందుకని మనిషి వాటిని వదిలేస్తాడు. పోలిస్ ఉండదు.

గత పదకొండు సంవత్సరాలుగా వాషింగ్టన్‌లో అయిదు వందల శాతం నేరాల సంఖ్య పెరిగింది. ఈ నలభై రోజుల్లో అవి పదిహేను వందల శాతం అవుతాయి. రోజుకి ఎనభై రాబరీలవుతున్నాయి. అవి ఎనిమిది వందలవుతాయి. రేప్‌లు మనం అంచనా కట్టలేనంతగా పెరిగిపోతాయి. ఏం అవుతుందని అడక్కండి. ఏం అవదని అడగండి. మనుషులు బలహీనతలు మనకు తెలుసు. వచ్చేప్రళయం ఎలానూ తప్పనప్పుడు. దాన్ని ముందుగా వెల్లడించి కల్లోలం సృష్టించటం అవివేకం. ఆపటానికి శాయశక్తుల కృషిచేద్దాం కానీ ఆపగలమని అనుకోను. ప్రకృతి ముందు మనిషెంత....? మనం చెయ్యగలిగిందొక్కటే, మన ప్రయత్నాలు మనం చేస్తూ ప్రపంచానికి యీ విషయం తెలియకుండా ఆపుచెయ్యటం. అబ్జర్వేటరీస్ అన్నీ మూసెయ్యాలి. ఏదో మిషమీద అస్ట్రానమిస్ట్‌లనందర్నీ అరెస్టు.... నా ఉద్దేశ్యం జైలు కాదు.... అరెస్టు చెయ్యాలి. రాబోయే చావుని తల్చుకొని మనిషి చచ్చిపోవచ్చు- లేదా మనిషిలో రాక్షసుడు విజృంభించవచ్చు. ఈ రెంటినీ మనం సాధ్యమైనంత కాలం ఆపు చేయాలి.... రాక్షసుడు పుట్టకుండా మనిషి చావకుండా మనం ఆపుచెయ్యాలి."

అందరూ లేచారు.

సమావేశం ముగిసింది.

*          *          *          *          *          *

కొన్ని దినపత్రికలు ముఖ్యమైన ప్రదేశాల్లో రోజువారీ కూలీమీద మనుషుల్ని తమకి సమాచారం అందించే పనిమీద నియమిస్తాయి. వీరందించే సమాచారాన్ని బట్టి పారితోషికం నిర్ణయింపబడుతూ వుంటుంది.

ఉదాహరణకి ఉస్మానియా హాస్పిటల్‌లో 'టీ' అందించే కుర్రవాడు ఒక ముఖ్య దినపత్రికకి ఇన్‌ఫార్మర్. ఎవరెక్కడ కొట్టుకుని చచ్చినా, చావబోతున్నా అక్కడికే రావాలికదా. అప్పటికప్పుడు ఫస్ట్‌హాండ్ ఇన్ఫర్మేషన్- సేకరించి పత్రిక్కి అందిస్తూ వుంటాడు. అలాగే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మూటలెత్తే ఒక కూలి.

దినపత్రికల్లో పడాల్సిన వార్త గంట ఆలస్యం అయితే చచ్చిపోతుంది. మరుసటి రోజుకు ఏ విధంగానూ పనికిరాదు.

ఇండియన్ టైమ్స్ సబెడిటర్ శైలజ తనకు దొరికిన సమాచారాన్ని తన పత్రికకి పంపుతున్న సమయంలోనే నౌకరు రూపంలో గెస్ట్‌హౌస్‌లో వున్న ఇన్‌ఫార్మర్ ద్వారా యీ సమాచారం మిగతా పత్రికలకి తెలిసిపోయింది. ప్రపంచంలో అన్ని అబ్జర్వేటరీలూ మూయబడి వుండటం, ఆస్ట్రానమిస్టులతో ఇంటర్వ్యూలు దొరక్కపోవటంతో సమాచారం నిజం అన్న నిర్ధారణకి వచ్చేయి పత్రికలు.

పత్రికల వాళ్ళకి మోరల్స్ వున్నమాట నిజమే కానీ, మిగతావాళ్ళందరూ ప్రచురించి తాము ప్రచురించకపోతే ఎలా- అన్న ఉద్దేశ్యంతో అందరూ ప్రకటించేరు!

కొన్ని పత్రికలు తాటికాయలంత హెడ్‌లైన్సుతో "చంద్రుడు శాశ్వతంగా అస్తమించ బోతున్నాడా!". "చంద్రుడిక లేడా?" అని వేస్తే మరికొన్ని పత్రికలు- మరొక పదిరోజుల్లో భూమికి రాబోతున్న విపత్తు గమనించి వర్ణించేయి. పగులుతున్న అగ్నిపర్వతాల ఫోటోలూ, హృదయ విదారకంగా యేడుస్తూన్న పిల్లల ఫోటోలూ వేసేయి.

నిజంగా పదిరోజుల్లో యిదంతా జరగబోతుందని అందరికీ పరిపూర్ణంగా నమ్మకం చిక్కటలేదు. ఆ ఆత్మవంచన ఆనందాన్ని యిస్తున్నప్పుడు దాన్ని యెవరూ వదులుకోవటానికి ఇష్టపడడం లేదు.

ఎక్కడ చూసినా ఆ కబుర్లే. దాని గురించి ప్రసక్తే. అవుతుందని కొందరు, కాదని కొందరు వాదనలు. పైకిమాత్రం నవ్వు. నవ్వు వెనుక ఆందోళన. 'అలా కాదులే' అన్న ధైర్యం. మళ్ళీ ఏమవుతుందో అన్న దిగులు.

సమయం గడుస్తూనే వుంది.

సాయంత్రం అయింది.

రాత్రయింది.

ఆఫీసుల్లో ఎవరూ ఆ రోజు పనిచెయ్యలేదు.

అందులో ప్రధాని స్వయంగా చూసిన వింత ముఖ్యాంశము- దానికితోడు కొన్ని కల్పనలు, భూమి బీటవారింది వగైరా.

పదకొండయింది.   ఈ విషయాన్ని నమ్మనివారు హాయిగా నిద్రపోతున్నారు. లోపల నమ్మి, పైకి నమ్మనట్టు నటించేవారు యేదో పనున్నట్టు బయటకొచ్చి ఆకాశం వైపు చూసి వెళుతున్నారు.

వివిధ దేశాల శాస్త్రజ్ఞులు శ్రీలంక చేరుకున్నారు.

పావు తక్కువ పన్నెండు....

అందరి మనసుల్లోనూ టెన్షన్.

టెలిస్కోప్ ప్రక్కన ప్రొఫెసర్ మొహంలో యే భావమూ లేకుండా నిలబడి వున్నాడు.

మోచేతుల్లో మొహం దాచుకుని మౌనంగా కూర్చొని వున్నాడు రమణ. అతడెంత తప్పు చేశాడో అర్థమయిన తర్వాత.... అప్పటివరకూ మాట్లాడలేదు అతడు.

ఐదు నిముషాలు తక్కువ పన్నెండు. పది నుంచి ముప్పై లాంగిట్యూడ్ మీద- పన్నెండు గంటలా మూడు నిమిషాలకి- పన్నెండు కావస్తుండగా జనం. ఎక్కడా చూసినా జనమే. తలలు ఆకాశానికెత్తి.... నిశ్శబ్దంగా ఆత్రంగా.... నమ్మకానికీ, ఆపనమ్మకానికీ మధ్య ఘర్షణతో.

పన్నెండు.

రాజయ్య తలెత్తి చూసేడు.

ముసలాయన కిటికీలోంచి చూస్తున్నాడు.

ప్రకాశరావు పాలిపోయిన మొహంతో నిలబడి వున్నాడు.

పన్నెండు గంటలా రెండు నిమిషాలు, నాలుగు నిమిషాలు, ఐదు నిమిషాలు....

రమణ ఆనందంతో అరిచేడు, "చంద్రుడు కదల్లేదు" అని. "ది మూన్ హాజ్ నాట్ మూవ్డ్...." అతడి గొంతు గాలిలో ప్రతిధ్వనించింది.

ప్రొఫెసర్ మాట్లాడలేదు. దూరం నుంచి జనం నవ్వులు! ఆనందం. రిలాక్సేషన్ కలిసిన నవ్వులు. రమణకే అనుమానం వేసింది. మళ్ళీ ఆకాశం కేసి చూశాడు. చంద్రుడు అలాగే వున్నాడు.

కానీ.... కానీ.... పెద్ద ఫుట్‌బాల్ బంతిలా నిండుగా వుండవలసినవాడు చిన్న టెన్నీస్ బంతిలా అయిపోతున్నాడు. ఇంకా ఇంకా కుదించుకుపోయి.... క్షీణమవుతున్నాడు.

రమణకి విషయం అర్థమైంది.

పక్కకి కాకుండా వెనక్కి, వెనక్కి వెళ్ళిపోతున్నాడు.... నక్షత్రం వైపు.... చంద్రుడు వెళ్ళిపోతున్నాడు.

దాదాపు ఇరవై అయిదు మిలియను సంవత్సరాల నుంచీ, భూమిని అంటిపెట్టుకుని తిరిగి చంద్రుడు.... ఎంతోమంది ప్రపంచ కవులకీ, గాయకుల భావాలకి వూపిరిపోసిన చంద్రుడు.... ఎంతోమంది పాపలకి తల్లులు ఆటబొమ్మగా చూపెట్టిన చంద్రుడు.... నెమ్మది నెమ్మదిగా అనంత విశ్వంలోకి అదృశ్యమైపోతున్నాడు.

హాహాకారాలు-

ఎవరో భయంతో అరుస్తున్నారు.

పోలీస్ వ్యాన్ సైరన్ మోగిస్తూ తిరుగుతూంది.

పత్రికా విలేఖరులు విదేశాలకి వార్తల్ని పంపుతున్నారు.

జనం మొహాల్లో భయం, వేదన.

ఒక స్త్రీ మూర్ఛపడిపోయింది. ఒక కుర్రవాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. చూసిన

దృశ్యాన్ని నమ్మలేక చాలామంది స్థంభించిపోయేరు.

ఆకాశం చీకటిని పులుముకొంది. బొట్టు లేని స్త్రీ మొహంలో కళావిహీనమైంది. కళ కళలాడే చంద్రుడిక లేడు. పదిరోజుల్లో భూమి కూడా వుండదు. ఎవరో బిగ్గరగా రోదిస్తున్నాడు.

ప్రళయం ప్రారంభమైంది.

## ఆగష్టు ఆరు

ఆగష్టు ఆరో తారీఖు రాత్రి పన్నెండు గంటలకి చంద్రుడిని ప్రాక్సిమా సెంక్చువరీ ఆకర్షిస్తున్న సమయాన, భూమ్మీద ఒక ప్రదేశంలో బ్రహ్మాండమైన విస్ఫోటం జరిగింది మిండనోవా డీప్‌లో. అయితే అది మరుసటి రోజు కానీ వెలుగులోకి రాలేదు.

ఒక థియరీ ప్రకారం చంద్రుడు ఒకప్పుడు భూమిలో ఒక భాగమే. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రం వున్న ప్రాంతం నించి విడిపోయాడు. ఆ ప్రదేశాన్నే మిండనోవా డీప్ అంటారు. చంద్రుడిలో వున్న ఆర్మాల్ కొలైట్ అన్న పదార్థం పసిఫిక్ సముద్రాంతర్భాగములో ఇంక కొద్దిగా వుంది కాబోలు అదే సమయానికి చంద్రుడితోపాటు అదీ ఆకర్షితమై పైకి లేచింది. ఫలితంగా ఆ సముద్ర గర్భములో కనీ వినీ ఎరుగనంత పెద్ద ప్రేలుడు సంభవించింది.

'మౌంట్ విసాలిస్' అన్న అగ్నిపర్వతం ప్రేలినప్పటి ప్రమాదం కన్నా ఇది రెండు రెట్లు పెద్దది. ఎర్రమంటలు సముద్రం మధ్య లేచినయ్. ఆ ధ్వని కొన్ని వందల మైళ్ళ దూరం వరకూ వినిపించింది. ఆ రాత్రంతా పొంగే లావాకీ, సముద్ర జలాలకీ మధ్య ఘర్షణ జరుగుతూనే వుంది.

ప్రేలుడు సంభవించగానే నీరు ఆవిరై నీరు మేఘంలా మైళ్ళ దూరం వ్యాపించింది. జలచరాలు చచ్చి తెప్పలా పైకి తేలాయి. ఆవిరై నీరు మేఘంలా మైళ్ళ దూరం వ్యాపించింది. ఆ ఆవిరి వేడి ఆస్ట్రేలియా వరకూ సోకింది. చచ్చిన జలచరాలు న్యూజిలాండ్ తీరం వరకూ కొట్టుకొచ్చేయి.

అన్నిటికంటే హృదయవిదారకమైన దృశ్యం ఏమిటంటే.....ఆ అగ్నిపర్వత విస్ఫోటనానికి టహుటీ, హనలులూ, హవాయి, సాలమాన్ ద్వీపాల్లో వున్న ప్రజలు కనీసం కెవ్వున కేక వేయడానికి కూడా సమయం చిక్కనంతటి వ్యవధిలో శలభాల్లా మాడిపోయారు.

ఈ వార్తా మరుసటి రోజు కార్చిచ్చులా ప్రపంచం అంతా వ్యాపించింది. ప్రజలు నిర్వీర్యులయ్యేరు. ప్రళయం అనివార్యం.

ప్రాక్సిమా సెంక్చువరి భూమివైపు దూసుకొస్తూనే వుంది.

ఇంక పదిరోజుల.....పది రోజులే....!

మరణం తప్పదని తెలిసిన మనిషి ఏం చేస్తాడు......?

## ఏడు: ఇల్లు:

రేడియోలో వార్తలు రావటం పూర్తయింది. ముఖ్యంగా చంద్రుడి గురించీ పసిఫిక్‌లో జరిగిన ప్రళయం గురించీ విని...."ఇంతకీ దాన్ని ఆపటానికి మనవాళ్ళేం చేస్తున్నారో చెప్పరేం" అన్నాడు ముసలాయన విసుగూ, ఆత్రం నిండిన కంఠంతో.

"మన వాళ్ళేం చేస్తారు? అదేమన్నా రోగం అయితే మందు కనుక్కుంటారు. యుద్ధం అయితే శాంతి సంప్రదింపులు పెడ్తారు. కానీ వస్తూన్న బ్రహ్మాండమైన నక్ష త్రాన్ని ఎలా ఆపగలరు? అసలా నక్ష త్రం భూమికంటే కొన్ని వందల రెట్లు పెద్దదట...." అన్నాడు ప్రకాశరావు. అతడి మొహంలో భయంతో పాలిపోయింది. నిద్ర లేక కళ్ళు పీక్కుపోయాయి.

ఇంతలో లోపల్నుంచి జానకి వచ్చింది.

కట్టెలు మండక ఆమె కళ్ళు పొగకి ఎర్రగా వున్నాయి. మాసిన చీరె, అలసిన మొహం.

"పని మనిషి రాలేదా?" ముసలాయన అడిగేను. లేదని చెబుతూ బయటికి వెళ్ళింది, "అసలు చస్తుంటే ఇదొకటి" ముసలాయన గొణుగుతున్నాడు. ఏదో ఒకటి మాట్లాడకపోతే నిశ్శబ్దం మరింత భయంకరంగా వుంది.

ఎప్పుడూ సైకిళ్ళతోనూ మోటరు శబ్దాలతోనూ నిండివుండే రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

"ఒకసారి అష్టగ్రహ కూటమి అని, నీ చిన్నప్పుడు వచ్చింది" అన్నాడు ముసలాయన. ఇంతలో రమణ వచ్చేడు. చేతిలో సంచినిండా సామానులు-బియ్యం.

"ఎందు కివన్నీ....?".

"ముందు ముందు దొరుకుతాయేమో లేదో" అన్నాడు రమణ.

ఎవరూ మాట్టాడలేదు.

పక్కిళ్ళు ఖాళీ చేస్తున్నారు పుట్టింటికి వెళ్ళడం కోసం. వీధి చివర ఎవరో వస్తున్నట్టు కనబడి, కళ్ళకి చేతులు అడ్డం పెట్టుకొని చూసింది జానకి, పనిమనిషి మంగి. దాటుకొని వెళుతుంటే ఆపింది.

"ఏమే! పనికి రాలేదు?".

"ఇంకా పనేటి అమ్మగారూ, పది రోజుల్లో పెళయం వత్తాంటే......" అంది.

"అందుకని రావా?".

"అప్పుడు చూసుకుందాం లెండి, బతికుంటే.....".

దాని మాటలకి నవ్వొచ్చింది జానకికి. "ఇదిగో యిది చూసేరా" అంటూ లోపలికి

వెళ్ళింది ఇంట్లో వాళ్ళకి చెప్పటానికి.

అది అంత నవ్వుకోవలసిన విషయం కాదనీ....

పనిచేయడానికి పనిమనిషి తిరస్కరించటం మనిషి తన వ్యవస్థ కట్టుబాట్లని ఛేదించే మొదటి ప్రయత్నం అని జానకికి ఆ క్షణం తెలీదు.

## *పల్లె:*

స్వామీ బుద్బుధానందబాబా నవ్వేరు.

"ఈ ప్రపంచాన్ని నేను రక్షిస్తాను" అన్నారు.

".....మొన్న భగవాన్ నా కలలో కనబడి, ప్రపంచం అంతం అవటం గురించి చెప్పేరు. 'అప్పుడే యెందుకు స్వామీ' అన్నాను. 'పాపాలు యెక్కువైపోయాయి. కల్కిపుట్టే సమయం ఆపన్నమయింది' అన్నారు. ఆ కల్కి ఆకాశంలోంచి దిగుతాడట. నీళ్ళని శంఖంగా-చంద్రుడిని చక్రంగా ధరిస్తాడట. అందుకే ఆ రోజు సముద్రం పేలిపోయింది.స్వామివారి చక్రంగా మారడానికి చంద్రుడు వెళ్ళిపోయేడు. ఇక కల్కి రావడమే ఆలస్యం..."

భక్తులు భయంతో వణికిపోయేరు.

"ఎలా స్వామీ?" అన్నది హైమావతి.

"నాకీ సంగతి అంతా సంవత్సరం క్రితమే తెల్సు. అయినా భయపడ్తారని చెప్పలేదు" స్వామివారు నవ్వేరు "నేను మిమ్మల్ని రక్షిస్తాను".

"శ్రీ బుద్బుదానందస్వామి బాబాకి...." అరచింది హైమవతి భక్తి పారవశ్యంతో.

"జై...." అన్నారు భక్తులు ముక్తకంఠంతో.

పల్లె పల్లె అంతా అక్కడుంది. కరణం, మున్సబు, రాజయ్య, రంగారావు, కరణగారి కోడలు హైమవతి, తల్లి భాగీరథి-అందరూ.

బాబాగారు బూడిదని అందరికి పంచుతూ అన్నారు "నేనే భగవంతుడ్ని, భగవత్ స్వరూపాన్ని. నేను మిమ్మల్ని రక్షించటానికే పుట్టేను. నిజంగా నన్ను నమ్మిన వాళ్ళని నేను రక్షిస్తాను. మీ చేతులకి తాయెత్తు కడ్తాను. ఇంకో నాలుగు రోజుల్లో నా నిజమైన భక్తుల చేతులకి తాయెత్తు కట్టబడుతుంది".

"ఇదంతా మోసం" అని బిగ్గరగా అరవాలన్న కోర్కెని బలవంతం మీద ఆపుకున్నాడు డాక్టర్, ఆ వూరికి కొత్తగా వచ్చినవాడు.

అరిస్తే పల్లె మొత్తం ఏకమై తనని హాస్పిటల్‌కి పంపిస్తుంది. అజ్ఞానం రాజమేలుతున్న దేశంలో జ్ఞానం గురించి మాట్లాడటం కన్నా మౌనంగా వుండటమే మంచిది.

లేచి బయటికి వచ్చేడు.

“....స్వామి అయప్ప సన్నిధి.... అదే మాకు పెన్నిధి....” అని సినిమా స్టయిల్లో పాడుతున్నారు భక్తులు.

డాక్టర్ మౌనంగా సాగిపోతున్నాడు.

“ఎల్లిపోతున్నారే స్వామీ?” వెనుకనుంచి రాజయ్య అరిచేడు.

“ఉండి చేసేది యేముంది?” కోనేటి ప్రక్క చీకట్లో కలిసిపోయేడు.

వర్షం పడి పదిరోజులైనట్టుంది.

నాలుగు నీటిచుక్కలు పడగానే లేచిన కుక్కగొడుగులు.

## దేశం

ఆగష్టు ఆరవ తారీఖు రాత్రి హాయిగా నిద్రపోయింది అవినాష్ ఒక్కడే. హాయిగా నిశ్చితంగా నిద్రపోయేడు.

చాలు.....

ఈ చంద్రుడి గొడవతో ప్రజలదృష్టి అటు మళ్ళుతుంది. ప్రళయం పేరిట భయంతో..... రాజకీయాలపట్ల ఆసక్తి తగ్గుతుంది. ప్రళయం వస్తుందా రాదా అన్నది వేరే సంగతి. వచ్చినా రాకపోయినా అంత పెద్ద ప్రమాదమేమీ లేదు. రాజకీయాల్లో ప్రతిక్షణమూ ప్రళయమే. ఎవడు యే క్షణం పార్టీ మార్చేస్తాడో తెలియదు. దక్షిణాదివాడు ప్రధాని కావాలని ఒకవైపు గొడవ. పార్టీ రెండుగా చీలిపోయే ప్రమాదం ఒకవైపు అన్నిటి కన్నా పెద్ద ప్రమాదం...

తమ పార్టీ పదవిలోకి వచ్చేక దేశపు కరెన్సీ విలువ ఇంటర్నేషనల్, మార్కెట్‌లో రోజురోజుకి పడిపోతూంది. ఏదో అద్భుతం జరిగి తేనే తప్ప దేశాన్ని యెవరూ రక్షించలేరు. ఇప్పటి వరకూ దేశం నాశనమైపోతుందని బాధ- ఇప్పుడు మనతోపాటూ అందరూ పోతున్నారన్న తృప్తి.

ఇంతలో ఫోను.

సెక్రటరీ, ప్రధాని వస్తున్నారని వార్త.

మరుసటి నిముషంలో జగదీష్ హడావుడిగా ప్రవేశించాడు. “రండి! మనం అర్జంటుగా ప్రెసిడెంటు దగ్గరకి వెళ్ళాలి”.

“ఎందుకు?”.

“దారిలో మాట్లాడుకుందాం”.

అతడి మొహం చూసి ఏదో ఉపద్రవం జరిగి వుంటుందనుకున్నాడు అవినాష్.

ఇద్దరూ కారులో కూర్చున్నాక కారు కదిలింది. లోపల ట్రాన్సిస్టర్ వినిపిస్తూంది.

-ఒక ముఖ్య ప్రకటన. ఆగష్టు పదిహేడున జరగబోయే ప్రమాదాన్ని ఊహించుకొని ఇప్పటినుంచి భీతి చెందవద్దని ప్రజల్ని ప్రధానమంత్రి కోరేరు. తమ తమ పన్లని విడిచి పెట్టి. ఈ ఆలోచనలతో మరింత కల్లోకాన్ని సృష్టించ వద్దని హెచ్చరిస్తున్నారు బి.బి.సి. రేడియో కేంద్రం-ఇప్పట్నుంచీ ప్రతి మూడు గంటల కొకసారి-

టప్‌మన్న చప్పుడుతో ఆగిపోయింది రేడియో.

ఇద్దరూ మొహమొహాలు చూసుకున్నారు.

"ఏమైంది?".

"ఏమవుతుంది?".

చాలా చిన్న విషయం.

రేడియో స్టేషన్‌లో డ్యూటీ ఆఫీసర్‌కి ఆరుగురు పిల్లలు. అతడు గోవాకి చెందినవాడు. రేడియోలో యీ వార్త వస్తుండగా అతడికి అకస్మాత్తుగా తన పిల్లల్ని చూడాలని బుద్ధి పుట్టింది. క్షణాల్లో ఆ కోర్కె బలియమైంది.

దేని కోసం విధి నిర్వహణని నమ్ముకొని వుండాలి? వెళ్ళిపోతే......!

".....ఉద్యోగం పోతుంది, అంతేగా?".

ప్రాణమే పోయేటప్పుడు యీ ఉద్యోగం పోతే మాత్రమేం? అతడి కళ్ళముందు ఆరేళ్ళ చిన్న కూతురు జాలిగా మొహం పెట్టి 'రావా నాన్నా' అంటున్నట్టు అనిపించింది.

వెంటనే అతడో నిర్ణయానికి వొచ్చినట్టు రిసీవర్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి బయటి కొచ్చేశాడు.

ఆ క్షణం నుంచీ రేడియో ప్రసారాలు ఆగిపోయాయి.

జగదీష్ ఆందోళనగా అవినాష్‌వైపు చూసేడు. అతడు తల పంకించాడు.

ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

జరుగుతున్నది చూస్తూ జరగబోయేది ఊహించుకోగలరు వాళ్ళు.

నిజానికి జగదీష్ భార్యకూడా ఈ చివరి రోజుల్లో తమవాళ్ళతో పల్లెల్లో గడపాలని కోరింది. కానీ 'ఏమీ జరక్కపోతే' ఆ తర్వాత ప్రతి పక్షాల హేళనకు గురికావల్సి వస్తుందని భయపడ్డాడు.

"ప్రాణమే పోతున్నప్పుడు ఎందుకీ పదవి?" అని అడిగిందామె.

నిజమే పేరుకి ప్రధానమంత్రి. కానీ బ్యాంకులో ఐదువేలకన్నా యెక్కువలేదు. నెలరోజుల క్రితం తన భార్య దక్షిణ భారత దేశపు కంచి పట్టుచీర అడిగితే, తను పొదుపు గురించి ఉపన్యాసం ఇవ్వడం జ్ఞాపకం వచ్చింది. ప్రధానమంత్రిగా రిటైరయ్యాక వచ్చే నెలసరి ఆదాయం కూడా పెద్ద ఎక్కువేమీ కాదు.

ఏ బ్యాంక్ అయినా ప్రధానమంత్రికి పెర్సనల్ లోన్ యివ్వటానికి వెనుదీయదు. ఉవ్విళ్ళూరుతుంది కూడా. కానీ తీర్చటం? (కావాలనుకుంటే తీర్చనక్కరలేదు కూడా. అది వేరే సంగతి) చచ్చినా తను అలా చేయలేడు.

ఆలోచన మళ్ళీ చావు దగ్గిరకు వచ్చేసరికి అతడు కొద్దిగ కదిలేడు.

చేతికి ప్రక్కనే వున్న పేపర్లు తగిలినయ్.

కారు వెళ్తూనే వుంది.

అతను చదవసాగేడు.

పేపర్లు రకరకాలుగా వార్తల్ని ప్రచురించినయ్. రేపట్నుంచి ఆ పేపర్లు కూడా రావేమో. ప్రపంచం స్తంభించిపోవటం అంటే అదే.

"ఆయుర్దాయం ఇక ఐదురోజులే" అన్న హెడ్డింగ్‌తో వార్త పెద్ద పెద్ద అక్షరాల్లో పడింది. దానిక్రింద "ఢిల్లీలో అధికారుల సమావేశం" అని వుంది.

అతడికి నవ్వొచ్చింది.

ప్రపంచం ప్రళయాన్ని ఆపటానికి ఢిల్లీలో అధికారులు ఏం చెయ్యగలరు?.

ప్రతీ చిన్న విషయాన్నీ గోరింతలు కొండంతలు చేసి సర్క్యులేషన్ పెంచుకునే ఒక తెలుగు దినపత్రిక ప్రళయం రకరకాల వార్తల్తో పేపరంతా నింపింది. పవిత్రమైన హెడ్డింగులు.... దానికింద చిత్రమైన వార్తలు.

## *భగవంతుడే శరణ్యం*

-రోజులు గడిచేకొద్దీ మృత్యువు ముంచుకొస్తున్నదని ప్రజలు గజగజ వణికిపోతున్నారు. గుండెబలం లేనివాళ్ళు రోజూ చస్తూ బ్రతుకుతున్నారు.

ఇంకోచోట ఇంకోవార్త.

## *రామనామతారకం*

-ఈ రోజునుంచీ అయిదు రోజులపాటూ రామనామాన్ని జపించిన వాళ్ళని ఆ నక్షత్రం ఏమీ చేయదని భగవతార్ చెప్పారు. పూనాకు చెందిన ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త ఎ.ఇ.ఐ.యస్ అన్న అక్షరాలు తమ పేర్లో వుంటే మరణం తప్పదని పేర్కొన్నారు.

ప్రధానికి నవ్వొచ్చింది. పై నాల్గు అక్షరాలలో యేదో ఒకటి లేకుండా యెలా వుంటుంది? అయినా ఆ పత్రికలకి బుద్ధిలేదు. ప్రజలు అసలే భయభ్రాంతుల్తో వుంటే యీ వార్త లేమిటి?.

వీళ్ళ మొరాలిటీ ఏమైంది?.

అసలు తనే తప్పుచేశాడు. పదిరోజుల క్రితమే ఆర్డినెన్స్ ద్వారా యీ పత్రికల్ని కంట్రోలు చెయ్యవలసినది.

ఇప్పుడనుకొని ఏం లాభం?.

జగదీష్ చాలా వర్రీడ్‌గా-ఆందోళనగా కనిపిస్తున్నాడు.

వాళ్ళ ప్రెసిడెంటు నివాస స్థలానికి చేరుకొనేసరికి ఎనిమిదయింది. అప్పటికే అక్కడ మిగతా వాళ్ళున్నారు. అయిదు ఏరియాల లెఫ్టినెంట్ జనరల్స్(ఆర్మీ), చీఫ్ ఆఫ్ ది నావల్ స్టాఫ్, మార్షల్ ఆఫ్ ది ఎయిర్ ఫోర్సెస్-అందరికంటే పైన-సుప్రీమ్ కమేండర్ ఆఫ్ ది ఆర్మ్‌డ్ ఫోర్సెస్-ది ప్రెసిడెంటు ఆఫ్ ది ఇండియా. వీళ్ళు చేరుకోగానే సమావేశం మొదలైంది. సమస్య చాలా చిన్నది, కానీ ఫలితాలు ఊహించలేనటు వంటివి.

సైన్యంలో చాలామంది తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. అదీ సమస్య.

ఈ పది రోజులూ తమ తమ భార్యా పిల్లల్తో గడిపి- చావును సకుటుంబంగా

ఆహ్వానించాలనుకుంటున్నారు.

ఆ హాల్లోవున్న వారందరి మొహాలూ గంభీరంగా వున్నాయి. చాలాసేపు ఎవరి ఆలోచనలో వాళ్ళుండి యెవరూ మాట్లాడలేదు. సైనికులు క్రమశిక్షణకి అలవాటుపడినవారు కాబట్టి- తమ కోర్కెని పై అధికారులకి విన్నవించుకున్నారు. కొన్ని దేశాల్లో అప్పుడే సైన్యంలో అలజడి మొదలవటం- చాలామంది 'కనబడకుండా' పోవటం జరిగింది.

చర్చ చాలాసేపు జరిగింది.

ఈ ముందు పదిరోజులూ యెలా వుంటుందో తెలీదు. ఎప్పుడు ఎవరి అవసరం వస్తుందో తెలీదు, అలా అని సైన్యాన్ని 'బలవంతంగా' ఆపలేం.....మొత్తానికి ఓ నిర్ణయం జరిగింది.

కెప్టెన్ లెవల్ నుంచీ పైనవున్న అధికారులు మాత్రం వుండాలి. మిగతావారు ఆగష్టు పన్నెండు నుంచీ వెళ్ళిపోవచ్చు.

రాత్రి పదింటికి సమావేశం ముగిసింది.

ఇక్కడ ఇది ముగుస్తున్న సమయంలో.....

## ప్రపంచం

లిబియా రాజధాని ట్రిపోలీలో ఒక రహస్య సమావేశం జరిగింది.

ఇరాన్, సిరియా, యమెన్, సుడాన్, జోర్డాన్ ప్రధానమంత్రులు అందులో పాల్గొన్నారు.

ఇంతమంది ఒకచోట కూడేరంటే, దానికి గమ్యం ఒక్కటే. ఇజ్రేల్.

"జెరూసలేం" అంటే "శాంతినిలయం" అని అర్థం కానీ అదేం చిత్రమో? ఆ నగరంలో "శాంతి" అన్న పేరే వినపడదు. క్రీస్తుశకం డెబ్భైలో రోమన్లు దానిని సర్వనాశనం చేసేరు. దాదాపు 10 లక్షలమంది యూదుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేరు. మూడంతస్తుల భవనాలమీద నుంచి పసిపిల్లల్ని రోడ్లమీదకు విసిరేసేరు. జెరూసలేంలోకి యూదుల ప్రవేశం నిషేధించబడినది.

ఇది జరిగిన పంతొమ్మిదివందల సంవత్సరాల తరువాత ఇజ్రేల్‌కి విముక్తి లభించింది. ఈ మధ్య కాలంలో ఆ నగరం నలభైఆరు దండ యాత్రలకి గురి అయింది.

ప్రవక్త మహమ్మద్ స్వర్గానికి వెళ్ళింది ఇక్కణ్నుంచేనని మహమ్మదీయుల నమ్మిక. మక్కా మదీనాల తర్వాత ముస్లిమ్‌లకు ఇదే పవిత్ర స్థలం. అయితే క్రీస్తుని శిలువ వేసింది కూడా యిక్కడే. అందుకు క్రైస్తవులకి యిది "దేవుడు తన పేరు వ్రాసిన నగరం" అయింది.

1948లో బ్రిటీషు వలన రాజ్యం నుంచి ఇజ్రేల్ స్వాతంత్ర్యాన్ని పొందిన కొన్ని గంటల్లోనే చుట్టూ వున్న ఎనిమిది అరబ్బు రాజ్యాలు మూకుమ్మడిగా దండెత్తి దాన్ని నామరూపాలు లేకుండా చెయ్యాలని చూసి ఓడిపోయింది.

యూదుల గుడి-ముస్లిమ్‌ల మసీదు వున్న 'డూమ్ ఆఫ్ ది రాక్' భూమ్మీద మనుషులున్నంత వరకూ సమస్యగానే వుంటుందని మేధావుల అంచనా-

*   *   *   *   *   *

కమేండర్ ఇన్ ఛీఫ్ సూడాన్- "ఈ ఆఖరి రోజుల్లో జెరూసలేంని జయించకపోతే దేవుడు క్షమించడు"అని అన్నారు.

ఈజిప్టు ప్రెసిడెంట్ ఒకే ఒక మాట అన్నాడు. "ఇజ్రేల్‌ని సముద్రంలోకి తోసెయ్యాలి. త్రో ఇట్ ఇన్ ది సీ-"

అందరూ హర్షధ్వానాలు చేసేరు.

అయిదు నిమిషాల అనంతరం ఒక తీర్మానం చెయ్యబడింది.

"ప్రపంచపు ఆఖరి రోజుని 'సెలబ్రేట్' చేసుకోవటానికి మేమంతా జెరూసలేంలో కల్సుకొంటాం- అని ప్రతిజ్ఞ చేస్తున్నాం. జెరూసలేంని దక్కించుకోవటానికి, మా పవిత్ర స్థలాన్ని ఆఖరి రోజుల్లో మా అధీనంలో ఉంచుకోవటానికి ప్రాణాలైనా అర్పిస్తాం. యుద్ధాన్ని ప్రకటిస్తున్నాము".

ప్రతి ఒక్కరూ ప్రమాణం చేసేరు.

ప్రపంచపు రాజకీయాలు ఇలా మారుతూవుంటే, ఇంకోవైపు సాంఘికమైన మార్పు ఇంకోలా వుంది. మత్తుమందు మనిషిని మానసికంగా బలహీనుడ్ని చేస్తుంది. అమెరికాలో దాదాపు కోటిన్నర జనాభా, ముందు అలవాటుపడిన వారున్నారని అంచనా. ప్రపంచం అంతమవబోతుందనగా అది మూడు కోట్లకి పెరిగింది. మార్జువానా, హెరాయిన్‌ల ధర రెండింతలైంది.

చావు భయాన్ని మత్తులో పోగొట్టుకోవడం మనిషికి సులభంగా కనిపించింది.

భూమి పేలిపోయినా పర్వతాల ఉపరిభాగం సురక్షితం అనే నమ్మకాన్ని కొంత మంది శాస్త్రజ్ఞులు వ్య క్తం చేసేరు. ఆ మాటల మీద నమ్మకం వున్న వాళ్ళు పదిరోజులకు సరిపడా ఆహార పదార్థాల్ని మూటకట్టుకొని కాంచనగంగ, మకాలు మౌంట్ బ్లాంక్, ఆల్ఫ్స్ పర్వతాల మీదకు వెళ్ళి పోయారు.

అయితే, ప్రపంచంలో ఎత్తయిన ఈ పర్వతాలు ఆ తర్వాత రెండు రోజుల్లోనే పేలిపోయేయి. వెళ్ళిన వాళ్ళు సజీవసమాధి అయిపోయేరు- నిశ్శబ్దంగా- మిగతా ప్రపంచానికి గుర్తులు కూడా మిగల్చకూండా....

## ఆగష్టు పన్నెండు

ప్రొఫెసర్ ఆనందమార్గం తన ఇంట్లో గదిలో కూర్చొని వున్నాడు. అతడి ముందు కప్పులో

టీ డికాక్షన్ వుంది. అది చల్లారిపోయి రెండు గంటలయింది. దాన్ని గురించి పట్టించుకోకుండా ఆలోచిస్తున్నాడు. దాదాపు డెబ్బై గంటల్నుంచీ ఒకటే ఆలోచన.

పదిహేడో తారీఖు పదకొండు గంటలా- పన్నెండు నిముషాలకు మూడు సెకన్లపాటు భూమిని ఆ నక్షత్ర ఆకర్షణ నుంచి తప్పించటం ఏలా?

ప్రొఫెసర్ ముందో కాగితం వుంది. దాన్నే చాలాసేపటి నుంచీ పరీక్షిస్తున్నాడు.

ఇంతలో తలుపు చప్పుడైంది.

రమణ!

"ఆఫీసు కెళ్ళలేదా?" అడిగాడు.

రమణ క్షణం విస్తుపోయి సర్దుకున్నాడు. మతిలేని ప్రొఫెసర్ మాటిమాటికీ తన పేరు సార్థకం చేసుకుంటూ వుంటాడు.

"మీరు బయటకొచ్చి ఎన్ని రోజులయింది?"

"నాలుగురోజులు. ఇప్పుడే బయటకు వెళ్దామనుకుంటున్నాను. ఇంట్లో ఏమీ లేవు."

"బయట కూడా ఏమీ దొరకవు" అన్నాడు రమణ. "ఒకసారి బయటికొచ్చి చూడండి. అంతా స్మశానం.... స్మశానంలా వుంది."

ప్రొఫెసర్ ఒక్క క్షణం మాట్లాడలేదు. రమణే అన్నాడు "మా నాన్న చివరిరోజులు కాశీలో గడపాలన్నాడు. ప్రయత్నిస్తే రైళ్ళు నడవటం మానేసి రెండ్రోజులయిందని తెలిసింది."

"మొత్తం స్థంభించిపోయించిందన్నమాట."

"అంతా కాదు...." రమణ కంఠంలో గంభీరత చోటుచేసుకుంది. "మనిషిలో రాక్షసత్వం పురులు విప్పుకుంటుంది."

"అంటే....?"

"అందమైన ఆడవాళ్ళున్న యిళ్ళలోకి జొరబడి గూండాలు మానభంగాలు చేస్తున్నారు. ఆహారపదార్థాల్ని దోచుకుంటున్నారు. అడ్డుకొనేవారు లేకపోవడంతో పైశాచికత్వం విజృంభించింది. చావెలాగూ తప్పదని తెలిసి మనిషి అన్నిటికి తెగించాడు. ఈ చీకట్లో చిన్న వెలుగురేఖ ఒకటే. పాపభీతితో డబ్బున్నవాళ్ళు చేస్తున్న సంతర్పణలు...."

"పాప భీతా?"

"అవును" అన్నాడు రమణ. "చాలా విషయాల్ని బయట పెడుతుందది. పాపం ఒక శ్రేష్ఠిగారు - ఎన్ని తరాలనుంచి సంపాదించిన పాపపు డబ్బుని బంగారంగా మార్చుకున్నాడో- తన మూడో అంతస్థుమీదకి యెక్కి నాణేల్ని వెదజల్లి పిచ్చివాడైపోయాడు."

"ప్రళయం తప్పదనే నమ్మకం అంత బలంగా ఏర్పడిందా అందరికీ."

"మామూలుగా అయితే నమ్మకమూ, అపనమ్మకముల మధ్య కొట్టుమిట్టాడేవారు. కానీ

ఇప్పుడు ప్రత్యక్షంగా భూమి బీటలు వారడం కనిపిస్తూనే వుంటే- ఇంక తమనెవరూ రక్షించలేరని నమ్మకం ప్రబలుతోంది."

ప్రొఫెసర్ ఉలిక్కిపడి "భూమి బీటలు వారుతోందా?" అని అడిగేడు.

రమణకి విసుగేసింది. "ఒక్కసారి బయటకు రాకూడదూ" అన్నాడు. "జరుగుతున్న విధ్వంసకాండ కాళ్ళారా చూడొచ్చు."

"లేదు లేదు ఇక్కడే వుండాలి. ఏదయినా చెయ్యాలి. ఏదయినా ఆలోచించాలి. ఏదయినా చేసి ప్రపంచాన్ని రక్షించాలి."

రమణ జాలిగా ఆ మతిలేని ప్రొఫెసర్‌కేసి చూసేడు. ప్రళయకాలపు ఝంఝామారుతంలా దూసుకు వస్తున్న ఈ నక్షత్రాన్ని ఈ అల్పజీవి ఎలా ఆపుతాడు?

లేచి "వెళ్ళొస్తాను" అన్నాడు.

"అప్పుడేనా?" అన్నాడు.

"వంతుల ప్రకారం కాపలా కాస్తున్నాం."

ప్రొఫెసర్ ఆశ్చర్యంగా "ఎందుకు?" అన్నాడు.

"ఎందుకా...." పేలవంగా నవ్వాడు రమణ.

"ప్రభుత్వం యంత్రాంగం పూర్తిగా స్థంభించి పోయినందుకు. ప్రజల్ని ప్రజలే రక్షించుకోవలసి వచ్చినందుకు."

ప్రొఫెసర్ లేచి, "ఇక్కడ ఇలా వుంటే మిగతా దేశాల్లో ఎలా వుంది?"

"తెలీదు."

"ఏం?"

"రేడియోస్టేషన్లు పని చెయ్యటం మానేసి రెండ్రోజులయింది."

ప్రొఫెసర్ నిశ్చేష్టుడయ్యాడు.

"వెళొస్తాను" అన్నాడు రమణ.

ప్రొఫెసర్ మాట్లడలేదు.

రమణ లేచి బైటకొస్తూ తలుపు బలంగా వేసి ముందుకు నడిచేడు. లోపల ప్రొఫెసర్ తిరిగి కాగితాలు పరిశీలించసాగేడు.

తలుపు బలంగా వేసినప్పుడు ఆటోమాటిక్ లాక్ పడిపోయిందని బయట రమణకిగానీ, లోపలున్న ప్రొఫెసర్‌కిగానీ తెలీదు.

* * * * * *

ఆ రోజు బాగా చీకటిపడ్డాక పెద్ద పెద్ద చప్పుళ్ళు వినబడ్డాయి. ఇళ్ళలో తలుపులు బిగించుకొని కూర్చున్నవాళ్ళంతా హాహాకారాలు చేస్తూ బైటకొచ్చేరు అంతకుముందుకన్నా

యెక్కువగా భూమి బీటవాలువారుతోంది. ఫెళ- ఫెళా చప్పుళ్ళు చేస్తూ, రెండుగా విడిపోతూంది.

ఆ ప్రదేశంలో వున్న యిల్లూ, చెట్లు భూస్థాపితం అయిపోతున్నాయి. రోదనలు.... అరుపులు.... ఇంకా అయిదు రోజుల తర్వాత రావల్సిన ప్రళయం ఆ రోజే వచ్చినట్లుంది.

దాదాపు పది సెకండ్లు తరువాత అంతా సర్దుమణిగింది.

పదకొండు గంటలా రెండు నిమిషాలయింది.

నిన్నటి రోజూ అదే సమయానికి.

ఆగష్టు పదిహేడు అదే సమయానికి.

ఆరోజు నుంచీ ప్రతిరోజూ అదే సమయానికి.

అయితే భీభత్సానికి చెదరనివాళ్ళు ఆ పల్లె ప్రజలే. స్వామివారు ఆ ఒక్క పల్లెని రక్షిస్తామని మాట యిచ్చేరు. ప్రార్థనలు నిర్విరామంగా జరుగుతున్నాయి.

రాజయ్య కూడా వెళ్ళి తృణమో, ఫణమో అర్పించుకొన్నాడు.

వస్తూంటే చీకట్లో యిద్దరు వ్యక్తులు మాట్లాడుకొంటూ వుండటం కనిపించింది. ఒకడు భూషణం, ఇంకొకరు ప్రెసిడెంటు. మాటలో తనపేరు వినిపించటం చూసి అతడు చీకట్లో ఆగాడు. చెట్టుచాటున వున్న అతణ్ని గమనించని వాళ్ళు అతడి గురించి మాట్లాడుకొంటున్నారు.

"రంగారావు ఆపు సేస్తాడంట- రాజయ్య పొలం మన స్వాధీనమవకుండా."

"అంత పెద్దోడయ్యాడా రంగారావు?".

"ఎట్టయినా మనమీద దెబ్బ కొట్టాలని చూస్తున్నాడు" అన్నాడు భూషణం.

"అణ్ని జూసుకొనేనా యీ రాజయ్యగాడు ఇన్ని కబుర్లు చెప్తున్నాడు?".

భూషణం మాట్లడలేదు.

"సరే- అయితే ఆడేం సేస్తాడో- ఏం సెయ్యగలడో సూద్దాం. ఆడి కళ్ళముందరే ఆ రాజయ్య గాణ్ని సెట్టుక్కట్టి నిప్పెడ్తే....? ఆడేం సేస్తడో...."

వింటున్న రాజయ్య వణికిపోయేడు. రెండు ఏనుగులు ఢీకొంటే మధ్య నలిగిన కుందేలులా వణికిపోయేడు.

పరుగెత్తేడు. అక్కుండా పరిగెత్తీ రంగారావు దగ్గరకు చేరుకొన్నాడు వగరుస్తూ. విషయం అంతా విని మీసం తిప్పుతూ"అంత ధైర్యం వుందటరా వాళ్ళకి?" అన్నాడు రంగారావు.

రాజయ్యకి భయంతో మాట రావటంలేదు.

"సరే- నేను చూసుకుంటాలే ఆళ్ళ సంగతి."

దూరం నుంచి "మము బ్రోవరా" అని భుక్తులు ముక్తకంఠంతో పాడుతున్నారు.

అక్కడ స్వామివారు శేషశయనం మీద విష్ణుమూర్తిలా పడుకొని వున్నారు. అక్కడున్న వారి చేతులకు తాయెత్తులు కట్టబడి వున్నాయి. పూజలు జరుగుతున్నాయి.

డాక్టరు మెట్లుదిగి వస్తూంటే రంగారావు కనబడి నమస్కారం చేశాడు.

“ఎక్కడకో వెళుతున్నట్టున్నారే” అని అడిగేడు ఇంటి ముందున్న స్కూటర్‌ని చూస్తూ.

“వెళ్ళిపోతున్నాను రంగయ్యా! ఈ ఆఖరి అయిదు రోజులూ పట్నంలో గడుపుదామని” అన్నాడు డాక్టర్.

“అదేమిటి బాబూ- ఈ పల్లెలో ఉండాలని, ఈ పల్లెకు కావాలని అందరూ కోరుకొంటూ వుంటే మీరు వెళ్ళిపోతున్నారే!”

“ఈ పల్లెకా?” అర్థంకాక అడిగేడు.

“మొత్తం ప్రపంచం అంతా నాశనం అయిపోద్ది, ఈ తాయెత్తు కట్టుకున్నోళ్ళే బతుకుతారు”

డాక్టర్‌కి అతణ్ని చూస్తే జలేసింది.

పల్లెని వదిలి వెళ్తున్న డాక్టర్ని చూస్తే రంగయ్యకి జాలేసింది. అమాయకుణ్ని చూసి వేదాంతి ఎంత జాలిపడ్తాడో.... వేదాంతిని చూసి అమాయకుడూ అంతే జాలిపడ్తాడు. డాక్టర్ మౌనంగా స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఆఖరిసారి తనింతకాలం వున్న ఇంటివైపు చూసుకున్నాడు. ముందుకు సాగిపోయేడు.

ఊరు దాటుతూంటే గుడి కనిపించింది. స్కూటర్ ఇంజన్ ఆపుచెయ్యకుండానే అలా ఆగి అటు చూసేడు!

బాబావారి చుట్టూ చేరి భక్తులు భజనలు చేస్తున్నారు. భక్తి పారవశ్యంగా ఊగిపోతున్నారు. ప్రపంచాన్నీ ప్రళయాన్నీ జయించిన ఆనందం వాళ్ళ మొహాల్లో కనిపిస్తూంది. అసలు మృత్యువు వాళ్ళ దరిచేరదనే నమ్మకంతో- ఆనందంతో వూగిపోతున్నారు.

అతడికో విషయం అర్థమైంది.

అక్కడ బాబా కాదు ముఖ్యం.

నమ్మకం!

అదే వాళ్ళని కోటలా కాపాడుతూంది. ఐదురోజులపాటు వాళ్ళు ఆ నమ్మకంతోనే బ్రతుకుతున్నారు. తరువాత చచ్చిపోతారు. అది వేరే సంగతి. ఈ ఐదురోజుల సంగతి? తనకున్న మానసిక వ్యధ వాళ్ళకి లేదు. చావు దగ్గరవుతూందన్న చింతలేదు. భక్తి వాళ్ళని కాపాడుతూంది. ఆ గొడుగు క్రింద  వాళ్ళు రక్షణ తీసుకొంటున్నారు.

అజ్ఞానం మనిషిని రక్షిస్తుంది. తను దాన్ని నమ్మలేడు. నమ్మలేకపోవటం తన ఖర్మ. నమ్మితే ఎంత బావుణ్ను. నమ్మగలిగితే చాలు. ఇంక ఏ ఘర్షణా వుండదు.

వాళ్ళెంత ఆనందంగా వున్నారు.

తన వాస్తవికతా వాదనతో వాళ్ళ ఆనందాన్ని ఎందుక్కాదనాలి? అసలు అనటానికి తనకేం హక్కుంది?

అతడు స్కూటర్ మీద సాగిపోయేడు.

ఇంక అయిదు రోజులు.... తన ఆనందాన్నీ- విషాదాన్నీ పంచుకోవడానికి తన కెవడూ లేరు. ఈ అయిదురోజులూ హాయిగా, నిశ్చింతగా గడపాలి. ఎలా వస్తుంది నిశ్చింత? ఎలా దొరుకుతుంది ఆనందం? వాటీజ్ ది వెస్ట్ వే ఆఫ్ స్పెండింగ్ ది లాస్ట్ ఫైవ్ డెస్ ఆఫ్ ది హ్యూమన్ లైఫ్!

అతడు నగరంలో ప్రవేశించాడు. ఆ నగరం నగరంలాలేదు. పాడుపడిన స్మశానంలా వుంది. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. కొన్ని ఇళ్ళు రాత్రి జరిగిన భీబత్సానికి కూలిపోయి వున్నాయి.

అతడొక పెద్ద హోటల్ ముందు ఆగి లోపలికి ప్రవేశించాడు. కౌంటర్ దగ్గర ఎవరూ లేరు. సర్వర్లూ, వెయిటర్లూ కూడా లేరు. తిను బండారాలన్నీ నేలమీద చల్లినట్లున్నాయి. బాగా తిని వదిలేసినట్టున్నారు.

రిసెప్షన్ పక్కనుంచి మెట్లెక్కి రూమ్స్ వైపు వచ్చేడు.

స్టార్ హోటల్ అది.

మొదటి అంతస్తులో ఎయిర్ కండిషన్డ్ గదులున్నాయి. కరెంట్ పోకపోయినా, ఎవరో జనరేటర్ 'ఆన్' చేసినట్టున్నారు. సన్నగా చప్పుడు వినిపిస్తూంది.

కారిడార్ నిర్మానుష్యంగా వుంది.

రూమ్ నంబర్ నూట ఒకటి దగ్గర నిలబడ్డాడు. నెమ్మదిగా డోరునాబ్ తిప్పి తోసేడు. లోపల ఎయిర్ కండీషనర్ పనిచేస్తున్న శబ్దం వినిపిస్తూంది. తలుపు తియ్యగానే చల్లటి గాలి మొహం మీదకు కొట్టింది. సన్నగా వణికేడు. అయితే ఆ వణుకు చల్లగాలివల్ల వచ్చిందికాదు, లోపల దృశ్యం చూసి.

లోపల డబుల్ కాట్ మీద ఇద్దరు బిచ్చగాళ్ళు పిల్లోసుకుని కూర్చొని వున్నారు. ఇంకో మూల ఒక కుష్ఠురోగి భోజనం చేస్తున్నాడు.

అతడు తలుపు తెరవటం చూస్తూనే పక్కమీద కూర్చొన్నవాడు చప్పున లేచి బిగ్గరగా, "మేం వెళ్ళం, మేం వెళ్ళం" అని అరిచేడు. యుద్ధానికి సిద్ధపడినవాడిలా వున్నాడు.

డాక్టర్ క్షణంపాటు అలానే నిలబడ్డాడు. నెమ్మదిగా అతని పెదాల మీద చిరునవ్వు వెలిసింది. "ఎంజాయ్ ఫ్రెండ్స్, ఎంజాయ్" అని తలుపు దగ్గరగా వేసాడు.

హోటల్ అంతా వెతగ్గా వెతగ్గా అతనికి అయిదో అంతస్తులో ఒక రూమ్ ఖాళీగా దొరికింది. మళ్ళీ కిందకొచ్చేడు. కౌంటర్లో వెతికితే ఫ్రిజ్ తాళాలు దొరికినయ్. కిచెన్‌లోకి వెళ్ళి ఫ్రిజ్ డోర్ తెరిచాడు.

పై వరుసలో ఉడకబెట్టిన కోడిగుడ్లూ, కోళ్ళూ వున్నాయి. క్రింద వరుసలో బీరు బాటిల్స్ వున్నాయి. అల్మైరా తెరిచాడు. స్కాచ్ దొరికింది.

రెండు స్కాచ్‌లూ అరవై బీర్లూ, ఆరు కోళ్ళూ తీసుకెళ్ళి తన రూమ్ లో ఫ్రిజ్‌లో పెట్టుకున్నాడు. తలుపు లోపల తాళం వేసుకున్నాడు.

కుర్చీలో కూర్చొని ఎదుటి బల్లమీదకు కాళ్ళు తన్నిపెట్టి బాటిల్ తెరుస్తూ అనుకున్నాడు, 'వెధవ ప్రపంచం పోనీ.... ఇంకేమైనా అయిపోనీ.''

*　　*　　*　　*　　*　　*

ట్రిపోలోలో ఆరబ్ దేశాలు ఇజ్రాయెల్‌మీద దండెత్తటానికి తీసుకొన్న నిర్ణయం బగ్గింగ్ చేయబడింది.

ఆగస్టు 14 రాత్రి అన్ని వైపులనుంచీ ఇజ్రాయెల్‌ని హఠాత్తుగా చుట్టుముట్టాలన్న అరబ్బుల ప్రయత్నం దారుణంగా ఫెయిలయింది. అంతకు ముందురోజే ఇజ్రేల్ ఎయిర్ ఫోర్సంతా సమీకరించబడింది. రహస్యంగా సంపాదించిన న్యూక్లియర్ ఆయుధాలు సిద్ధం చెయ్య బడ్డాయి.

అరబ్ దేశాల చేతిలో నూనె ఆయుధాన్ని చూసి ఇంతకాలం ఓపిక పట్టిన అమెరికా- ఇంక ఆ అయిదురోజుల కోసం ఇజ్రాయెల్ మీద జరుగుతున్న పోరాటాన్ని సహించలేకపోయింది.

అమెరికా అకస్మాత్తుగా దాండెత్తితే తమ నూనె గనులను పేల్చెయ్యటానికి అరబ్ దేశాలు కొన్ని సంవత్సరాల క్రితమే బాంబులను తమ గనుల ప్రక్కే అమర్చి వుంచాయి.

మూడు మిలియన్‌ల ఇజ్రాయెల్ జనాభా యుద్ధానికి ఆయత్తమయింది. మూడు లక్షలమంది. మూడు లక్షలమంది సుశిక్షితులయిన సైనికులు "క్రీస్తు వస్తున్న ప్రదేశాన్ని" రక్షించటానికి కంకణం కట్టుకున్నారు.

ఇజ్రాయెల్ స్వంతంగా తయారుచేసుకొన్న "జేంకోమిస్సిల్స్" మోహరింపబడ్డాయి. కొత్తగా కనుక్కొన్న ఆయుధం "యం.డి. 6660. సర్ఫేస్- టు సర్ఫేస్ మిస్సిల్స్" సిద్ధమయ్యేయి. ఐదువేల టాంకులూ, ఆరువందల ఎయిర్ క్రాఫ్టూ సరిహద్దుల్ని రక్షిస్తున్నాయి.

ఈ లోపుగా అమెరికన్ ఇంటర్ కాంటినెంటల్ మిస్సిల్స్ అరబ్ దేశాలవైపు దూసుకురాసాగాయి. అరబ్ దేశాధినేతలు నూనెగనుల్ని పేల్చివెయ్యమని ఆర్డర్ ఇచ్చేరు.

ప్రేలుళ్ళు.... పెద్ద పెద్ద ప్రేలుళ్ళు, ఆకాశానికి అంటిన మంటలు. ప్రళయం అప్పుడే వచ్చిందేమో అన్నంత మంటలు.

మండిపోతున్న నూనె గనులు.　　ఎర్రగా నాలుకలు సాచిన మంటలు.　　క్షణంలో ప్రపంచపు నూనె సముద్రం అంతా దగ్ధమైపోయింది. ప్రపంచంలో లభ్యమయ్యే పెట్రోలులో డెబ్బైశాతం- ప్రపంచం ఆఖరవటానికి నాలుగు రోజులు ముందుగానే నాశనమైపోయింది.

## *ఆగస్టు పధ్నాలుగు*

తన గదిలో కూర్చొని వున్నాడు ప్రొఫెసర్, అతడు గుక్కెడు టీ నీళ్ళుతాగి అప్పటికి

రెండు రోజులయింది. అతడు ఆలోచిస్తున్నది ఏమీ లేదు. మెదడు ఆలోచించి, ఆలోచించి శూన్య మైంది.

అతడి గెడ్డం బాగా పెరిగిపోయింది.

తైలసంస్కారం లేక జుట్టు పీచులా తయారైంది. చెంపలు పీక్కుపోయేయి.

కుర్చీలో కూర్చొని, అరచేతుల్లో గెడ్డం ఉంచుకొని శూన్యంలోకి చూస్తున్నాడు.

ఒక ఎలుక అతడి కాలు మీద నుంచి దూకి వెళ్ళిపోయింది. పట్టించుకోలేదు. ఇంకో ఎలుక కొద్దిగా ధైర్యంచేసి అతడి బల్లయెక్కి, ఆర్రోజుల క్రితం తిని వదిలేసిన బ్రెడ్ ముక్క అందుకొని పారిపోయింది.

ప్రొఫెసర్ కదల్లేదు.

ఎలా.....?

ఆ ప్రాక్సిమా సెంక్చువరీ ఆయస్కాంత శక్తి నుంచి భూమిని ఎలా రక్షించటం.....?

అతడాలోచిస్తున్నాడు.

నాలుగు రోజుల్నుంచీ ఒకటే ఆలోచన.

ఎలా రక్షించటం....?

తిండీ తిప్పలు లేక శుష్కించిపోయిన ఆ వృద్ధుడి శరీరం ఆలోచించటానికి కావల్సిన శక్తిని మెదడుకి ఇవ్వలేక పోతూంది. ఐనా ఆలోచిస్తూనే వున్నాడు. అనుభవం నేర్పిందీ, పుస్తకాలలో చదువుకొన్నదీ అంతా రంగరించి ఆలోచిస్తున్నాడు. కంప్యూటర్ కన్నా వేగంగా అతడు లెక్కలు కడుతున్నాడు. అయినా సమస్య పరిష్కారం కావటంలేదు.

ఎలుక ఒక అడుగు దూరంలో రెండుకాళ్ళ మీద నిలబడి, రెండు చేతుల్తో బ్రెడ్‌కి అంటిన మట్టిని విడదీయటానికి ప్రయత్నిస్తోంది.

ప్రొఫెసర్ కాగితం మీద భూమి బొమ్మ వేసేడు. రింగు రింగులుగా దానిచుట్టూ సర్కిల్సు గీచి, ఒక్కొక్క రింగులోనూ వాతావరణపు పేర్లు వ్రాసేడు. దానివైపే గంటస్సేపట్నుంచీ చూస్తున్నాడు. మాగ్నటోస్ఫియర్ అవతలనుంచి ఒక బాణం గుర్తు- ఆ నక్షత్రం ఏ దశలో వెళుతుందో ఆ దశలో గీచేడు.

ఆగష్టు పదిహేడు. రాత్రి పదకొండు పన్నెండు సెకన్లకి-

ఎలుక అతడివైపే చూస్తోంది- అతడు దానివైపే చూస్తున్నాడు. 'హల్లో!' అన్నట్టు మీసాల్ని కదిపింది. ప్రొఫెసర్ కదలలేదు. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా వుండే ప్రొఫెసర్ ఈసారి తన అలోచనలతో గంభీరంగా వున్నాడు.

ఎలుక తన పనిలో నిమగ్న మైంది.

ప్రొఫెసర్ తన కాగితం వైపు చూసేడు.

భూమిపై వరుసగా వాతావరణపు పొరలు ట్రోపోస్పియర్ స్ట్రాటోస్పియర్, అయినోస్పియర్.....ప్రొఫెసర్ ఆగేడు.

......అయినోస్పియర్-మూడు పరమాణువుల ఆక్సిజన్.

ఎలుక బ్రెడ్ మీద దుమ్మును దులుపుతోంది. దుమ్ముతోపాటుగా బ్రెడ్ పొడుం పొడుంగా రాలుతోంది! క్రిందపడిన పొడుంతో దుమ్ము మళ్ళీ కలుస్తోంది.

మూడు పరమాణువుల 'ఓ' జోన్‌ని ఆక్సిజన్‌గా విడగొడితే.... మిగిలిన ఒక పరమాణువూ దాని చుట్టూ తిరుగుతూ దాంట్లో కల్సిపోవటానికి ప్రయత్నిస్తుంది. ఈ ఘర్షణలో భూమిచుట్టూ 'యాంటి మేగ్నటిక్ ఫీల్డ్' తాత్కాలికంగా ఏర్పడుతుంది.

చాలు.... ఆ స్వల్పకాలం ఆకర్షణని నిరోధించగలిగితే చాలు.... చేయవలసిందల్లా 'ఓ'జోన్స్‌ని సూపర్ సానిక్ వైబ్రేషన్స్ ద్వారా ఆక్సిజన్‌గా విడగొట్టడమే.... వచ్చేసింది! సమస్యకి పరిష్కారం దొరికింది!

ప్రొఫెసర్ కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి "యురేకా" అని బిగ్గరగా అరిచేడు. తన వయసు కూడా మర్చిపోయి చేతులు గాలిలోకి విసిగి నాట్యం చేసేడు. భయపడి పరిగెడుతూన్న ఎలుకని చూసి గట్టిగా నవ్వేడు. కుర్చీని వెనక్కి తోసి గుమ్మం దగ్గరికి వచ్చి తలుపు తోసేడు.

పది అడుగుల ఎత్తున్న తలుపు హుందాగా నిలబడి వుంది.... బయట తాళం వేయబడి ఆటోమేటిక్ లాక్.

ప్రొఫెసర్ మొహం మీద చిరునవ్వు మాయమైంది. తలుపు దబదబా బాదసాగేడు.

*　　*　　*　　*　　*　　*

దాదాపు నాలుగు రోజుల్నుంచీ ప్రతీరోజూ రాత్రి పదకొండు గంటలకి భూమి కంపించటం, బీటలు వారటంతో పల్లె ప్రజల్లో కొంతమందికి బాబావారిమీద విశ్వాసం సన్నగిల్లింది. అందులో భూషణం ఒకడు.

అంతకు క్రితంరోజు రాత్రి వచ్చిన భూకంపంలో బాబావారు శయనించివున్న ఇంటి కప్పుకూలి, మీదపడి, అయన కుడి కాలు విరిగింది. అందరికీ తాయెత్తులు కట్టడంలో నిమగ్న మై తన చేతికి కట్టుకోవటం మర్చిపోయినందువల్లే ఈ అనర్థం జరిగిందని భక్తులు ఏకగ్రీవంగా నిర్ణయించేరు. పెద్ద కామందు భూషణం దగ్గరికి వచ్చాడు.

"ఏమనుకుంటున్నారయ్యా ప్రజలు?" చుట్ట నుసి రాలుస్తూ అడిగేడు భూషణం.

"మన పల్లెకి పర్లేదంటున్నారు".

"ఎందుకంట?".

"వూరు చుట్టూ మన బాబాగారు నిమ్మకాయలు కోసి రసం పిండుతారంట.

"నాకు నమ్మకం లేదయ్యా, సావు తప్పదేమో అనిపిస్తూంది."

ఆ విషయం నమ్మడానికి ఇష్టపడని కామందు విషయం మారుస్తూ, "రాజయ్యగాణ్ని ఏం చేద్దాం?" అన్నాడు.

"ఒకేపున మడిసి పేణాలే పోతావుంటే ఇక రాజయ్య సంగతంటావేమిటి?" అన్నాడు భూషణం చుట్టముక్కను తుపుక్కున వూస్తూ.

"దేన్దారి దాన్దే, అయినా మన పేణాలు పోతాయనే అపనమ్మకం ఎందుకు? బాబావారు వున్నంతవరకూ పర్లేదు."

"సూద్దాంలే. ఆ పదిహేడో తారీకేదో దాటనీ-"

"అంతకాలం ముడుసుక్కూసుంటే అవతలోళ్ళు నవ్వుకుంటారు. ఆణ్ని ఎట్టాగయినా కాల్చెయ్యాల. లేకుంటే, అన్నమాట నిలబెట్టుకోలేనోళ్ళమని రేపణ్నుంచి సిన్న కుర్రోడు కూడా మనని లెక్క సెయ్యడు".

"ఆణ్ని కాల్చెయ్యటమే కదా కావల్సింది, ఇదో ఈ పదిహేడో తారీఖు కానివ్వు. ఆ తర్వాత సూసుకుందాంలే-"

"ఆ తర్వాతంటే...."

"సూద్దాంలేవయ్యా తొందరేముంది?" లేచిపోయేడు భూషణం.

అరగంటలో ఈ వార్త రంగాగావుకి పాకింది, రాజయ్యకి తెలిసింది అతడూ సంతోషించాడు. పొలం పో....తే ఫర్లే....దు....ప్రాణా....లు....పో....క....పో....తే....చాలు....

## *ఆగష్టు పదిహేను*

తెల్లవారు ఝాముమున ఐదున్నర.

ప్రకాశరావుకి మెలకువ వచ్చింది. అసలు నిద్రపోయిందెక్కడ? కన్ను మూస్తే చావు గుర్తుకొస్తుంది.

మనిషి చచ్చి ఎక్కడి కెళ్తాడు?

భ్రూణ హత్యచేస్తే గౌరవ నరకానికీ, సోదరికి వాంఛిస్తే తప్తలోహ నరకానికీ, తండ్రిని ద్వేషిస్తే క్రిమిభక్ష నరకానికీ, అవేమి కాకపోతే రుధిరాంధ నరకానికికో- వైతరణికో....

తనే నరకానికి వెళ్తాడు?

అతను వణికిపోయేడు. కాలుతున్న పెనాలూ, వ్రేలుడకట్టుబడిన శవాలూ, భయంకరమైన యమభటులూ- ప్రజ్వరిల్లుతున్న మంటలూ- వూహించుకొని వణికిపోయాడు.

ఇంక మూడు రోజులే.

మరణం అనివార్యం.

చచ్చిపోవల్సిందేనా....

అందరూ.... అందరూ చావల్సిందేనా....

ఈ సాయంత్రాలూ....యీ తోటలూ....యీ ఆఫీసు....క్యాంటీన్‌లో కబుర్లూ.... సినిమాలూ... గోపీతో ఆడుకోవటం.... భోజనం చెయ్యటం.... ఇవేమీ వుండవా....

శరీరాన్ని ప్రాణం వదిలేసిన తర్వాత ఇంకో జీవిని చేరుకొంటుందని అంటారు. అసలు భూమ్మీద జీవి అన్నదే లేకపోతే ఈ ప్రాణాలన్నీ ఏమవుతాయి? నిర్మానుష్య మైన యీ నల్లటి భూగోళం చుట్టూ ప్రేతాత్మలన్నీ తిరుగుతూ వుంటాయా? తనూ అందులో ఒకడవుతాడా?

అసలు చావు అంటే ఏమిటి? కపాలమోక్షం అంటే ఏమిటి? గుండె ఆగిపోవటం తెలుస్తుందా? బాధతో శరీరం సుడులు తిరుగుతుందా?

అతనికేడుపొచ్చింది. ఎవరన్నా ఇదంతా కల అని చెప్తే యెంత బావుణ్ను? లేదులేదు.... ఇది కలకాదు.

పక్కమీద బోర్లాపడుకుని అతను తలగడలో మొహం దాచుకొని చాలాసేపు ఏడ్చేడు.

తనో అల్పజీవి.

ఎవరూ తనని రక్షించలేరు.

ఆఫీసులో హెడ్‌క్లర్క్ బారినుంచీ, భూమ్మీద చావుబారినుంచీ తనని ఏవరూ రక్షించలేరు.

అతను లేచాడు-

అందరూ నిద్రపోతున్నారు.

లేచి బయటికొచ్చేడు.

సర్కస్ అయిపోయిన తర్వాత వుండే డేరాలా వుంది బయట. రోడ్డు వూడ్చేవాడు లేక- నీళ్ళురాక- కరెంట్ లేక- చెత్తకాగితాలు, దుమ్ము.... అంతా అస్తవ్యస్తంగా.... అయోమయంగా వుంది. చెత్తకుండి పక్క కుక్క ఒకటి నిర్లిప్తంగా పడుకొని వుంది. అంతా నిర్లిప్తతే. ఎక్కడ చూసినా స్తబ్ధతే శూన్యం.

దూరంగా ఎక్కడో పెద్ద చప్పుడు-

వెనుక నుంచి తరుముకొంటూ వస్తున్నట్టుగా.

అతడు పరిగెత్తేడు.

వెనుక నుంచి చావు పరుగెత్తుకుంటూ వస్తూ వుంది. అతడు పరుగెత్తుతున్నాడు. రాళ్ళు, గుట్టలు, కొండలు.... అన్నీ దాటుకొంటూ వెళుతున్నాడు.

ఆఫీసు నుంచీ, ఫైళ్ళ మధ్యనుంచీ, భయం నుంచీ దూరంగా పరుగెత్తుకు వెళ్ళిపోవటానికి పరుగెడుతున్నాడు ప్రకాశరావు.

ప్రళయం తరుముకొంటూ వస్తూంది.

ఊరి బయట స్మశానం చేరుకున్నాడు.

కపాలాల మధ్యనుంచీ, సమాధుల మధ్యనుంచీ పరిగెడుతున్నాడు. ముళ్ళు అతడి శరీరాన్ని గాయపరుస్తున్నాయి. కాళ్ళు రక్తంతో తడిసిపోయేయి. చెమట ధారాపాతంగా కారుతోంది. ఆయాసంతో వగర్పొస్తూంది.

చప్పున అతడు ఆగేడు.

శ్మశానం మధ్యలో అతడు ఆగేడు.

తూర్పు దిక్కునే సూర్యుడు ఉదయిస్తున్నాడు ప్రత్యూష అంతా ప్రకాశవంతమవుతోంది.

ఎర్రటి సూర్యుడుకేసి చూస్తూ అతనోక్షణం నిలబడ్డాడు.

అప్పుడో చిత్రం జరిగింది.

దూరంగా ఎక్కడో గుడ్లగూబ వికృతంగా అరిచింది. ఓ కోడిపిల్ల రెక్కలు కొట్టుకుటూ హృదయ విదారకంగా అరుస్తూంది.

సూర్యుడు కొద్దిగా పైకి వచ్చేడు.

క్రిందనుంచి- తూర్పుకొండల వెనుకనించి. ప్రాక్సిమా సాంక్చువరీ దాని వెనుకే ఉదయించింది. నల్లటి ముద్దలా వుంది. గోళీలా గుండ్రంగా వుంది. సూర్యుడికీ, భూమికీ మధ్య వచ్చి నిలబడింది. చిన్న కుదువు.

సూర్యుడూ, నక్ష త్రం, భూమీ ఒకే రేఖలోకి రాగానే ఉషస్సు అంతర్థానమైపోయింది.

గ్రహణం!

సూర్యుడు కనపడటం మానేశాడు. అడ్డుగా భయంకరమైన నక్ష త్రం, అదే దిశలో భూమివైపు వస్తూ....

అంతా అంధకారం, ఎక్కడ చూసినా చీకటే.

ఇక మిగిలిన మూడు రోజులూ రాత్రీ పగలూ వుండదు.

యోగవాసిష్టంలో చెప్పింది నిజమవుతూంది.

బైబిల్ చెప్పింది ఋజువవుతూంది.

ప్రపంచం అంధకారం బంధురమైపోయింది.

ఒక నక్క మోర యెత్తి వూళ పెట్టింది. ఒక గ్రద్ద రెక్కలు టప టపా కొట్టుకుంది.

పగిలిన కపాలాల మధ్యనుంది గాలి వీచినప్పుడల్లా యెవరో ఏడుస్తోన్న ధ్వని.

ప్రకాశరావు గట్టిగా అరవాలనుకున్నాడు. గొంతుక్కేదో అడ్డుపడినట్లు నోటమాట రాలేదు. పండుటాకులా వణికిపోయేడు. అంతలో చెట్టు మీదనుంచి ఓ ఎండుకొమ్మ అతడిమీద పడింది.

అంతే!

రావల్సిన కేక గొంతులో ఆగిపోయింది.

రావల్సిన ఊపిరి గుండెలో ఆగిపోయింది.

కుప్పలా కూలిపోయేడు.

మానసికంగా ఎప్పుడో చచ్చిపోయిన ప్రకాశరావు ఈసారి నిజంగా.... శారీరకంగా కూడా చచ్చిపోయేడు.

*        *        *        *        *        *

శైలజ గదిలో మంచంమీద వెల్లకిలా పడుకొని పైఆకప్పుకేసిచూస్తూ ఆలోచిస్తూంది. ఆమె తన పద్దెనిమిదేళ్ళు (వూహ వచ్చిన తర్వాత) జీవితాన్ని సమీక్షించుకొని ఆలోచిస్తే ఆమెకి అది చాలా నిస్సారంగానూ, అర్థరహితంగానూ కనిపించింది.

ఏం సాధించింది తను?

ఈ ప్రపంచంలో చాలామంది ఏమీ సాధించరు. కానీ వాళ్ళకి బ్రతుకుతున్నామనే తృప్తి అన్నా వుంటుంది. మరి తనకుందా?

ఆలోచిస్తే.... ఉన్నట్టే వుంది.

ఒక కుటుంబాన్ని పోషిస్తున్నానన్న తృప్తి. తమ్ముళ్ళనీ, తండ్రినీ....

మిగతా కోర్కెల గురించి ఆలోచిస్తే.... ఈ చివరి నాల్గురోజుల్లో కూడా తను శృంఖలాలు తెంచుకొని అనుభవించకుండా ఏది ఆపుతుంది? ఒక పెళ్ళికాని స్త్రీ జీవితంలో పెళ్ళికాదని తెలిసికూడా (జీవితం యింకో నాలుగు రోజులే కాబట్టి) ఎందుకు నైతిక విలువలకి కట్టుబడి వుంటుంది? కేవలం కుటుంబ గౌరవం రక్షించటానికేనా?

'కుటుంబం'

చాలా మంచి.... గౌరవప్రదమైన పదం అది.

ఒక నిశ్శబ్దపు అర్థరాత్రి అకస్మాత్తుగా మెలకువ వస్తే కోరలు బయట పెట్టి చుట్టుముట్టే కోర్కెలు గుర్తొచ్చేయి. రాణీ అన్నట్టు అది మానసిక వ్యభిచారమా? కోర్కె శారీరకము, అందులో ఎవరినయినా వూహించుకొంటే అది వ్యభిచారం.

ఆమెలో చిన్న కోర్కె బలంగా పురలు విప్పుకొంటోంది. చాలా చాలా చిన్న కోర్కె. ఆ నిర్మానుష్యమైన వీధులగుండా విశృంఖలంగా పరుగెత్తాలని.

పిచ్చి కోర్కె.

ఫ్రాయిడ్ చెప్పినట్టు అంతర్గతపు టాలోచన అసంకల్పిత చర్యని అనిబద్ధం చేస్తుంది.

ఆమెకి నవ్వొచ్చింది. అంతలో తలుపు చప్పుడయింది. తండ్రి లోపలికి వచ్చేడు. ఆమె లేవబోతూవుంటే వారించి ప్రక్కనే కూర్చున్నాడు.

"నీ దగ్గరెంత డబ్బుందమ్మా?"

ఆమె ఆశ్చర్యపడినా, దాన్ని పైకి కనుపించనివ్వకుండా "పదో ఇరవయ్యో ఉండొచ్చు నాన్నా!" అంది.

"అబ్బే, అంత తక్కువ కాదు, అయిదొందలన్నా కావాలి?"

"అయిదొందలా? అంత నా దగ్గరెక్కడిది నాన్న?"

అతడు కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండి, ఆ తర్వాత నిశ్శబ్దాన్ని చెదరగొడ్తూ అన్నాడు-

“పోనీ నీ గొలుసు అమ్మేస్తే?”

ఆమె చప్పున తనవైపు చూసుకొని, విస్మయంగా తలెత్తి, “ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది నాన్న?” అంది.

ఇంకా నాల్గురోజుల్లో ప్రపంచం ఆఖరవబోతూ వుంటే యిప్పుడెందుకు అంత డబ్బు? ఆమె రెట్టించి అడిగింది అతడికి చెప్పక తప్పలేదు.

“పక్క పల్లెలో బుద్బుధానందపు స్వామివారు వెలిసేరమ్మా. ఆయన యిచ్చిన తాయెత్తు కొంటే ప్రళయం ఏమీ చెయ్యదట” నసుగుతూ అన్నాడు.

ఆమెకి ముందు నవ్వొచ్చింది. ప్రాణభయం చదువుకున్న వాళ్ళనీ, చదువుకోని వాళ్ళనీ అందర్నీ మూర్ఖుల్ని చేస్తూంది. కానీ ఆమెకి సంతోషం కూడా వేసింది. ఏ విధంగానైనా తమ ప్రాణాల్ని నిలబెట్టటానికి తమ తండ్రి.... ఈ కుటుంబ పెద్ద శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు.

“ఎంతట నాన్నా, ఆ తాయెత్తు?”

“అయిదొందలట” అన్నాడు ఆయన. కూతురు ఆ మాత్రం ఆసక్తి చూపించటం ఆయనకి సంతోషకరంగా వుంది. తన మాటలు తేలిగ్గా కొట్టి పడేస్తుందనుకున్నాడు. ఇంటిల్లిపాదినీ పోషిస్తున్న కూతురంటే అతనికేమూలో భయం.

ఆమె మెడలోంచి గొలుసుతీసి యిస్తూ అంది: “ఒక తాయెత్తు ఇంట్లో ఉంచుకొంటే ఆ ఇల్లు నిలబడ్తుందీ అన్న నమ్మకం నీకుంటే దాన్ని నేనెందుకు పాడుచెయ్యాలి నాన్నా...తీసుకో...”

వెంట్రుకల మధ్య హుక్కు చిక్కుకొని ఒక పట్టాన రావడం లేదు.

“ఇంట్లో పెట్టుకోవడం కాదమ్మా, చేతికి కట్టుకోవాలి. నా చేతికి కాదనుకో....” నవ్వేడు. అయితే ఆ నవ్వులో జీవంలేదు. “ఉన్నవి ఒక ఐదొందలే. ఇంటిల్లిపాదికీ ఎక్కడ్నుంచి తేగలం?”

“నాకు వీటిమీద నమ్మకంలేదు నాన్నా” అన్నది. లోలోపల మనసులో మాత్రం- ‘నాకు బ్రతుకు మీద పెద్ద ఇష్టం లేదు నాన్నా’ అనుకొన్నది.

హుక్కు విడివడింది. గొలుసు ఆమె చేతిలోకి వచ్చింది.

“పోన్లే అమ్మా, ఎవరి నమ్మకాలు వాళ్ళవి” అతడు గొలుసు వంక చూస్తూ అన్నాడు. “ఒక చిన్న తాయెత్తు తమ్ముడి చేతికి కడితే వాడు వంశం నిలబెడతాడు.”

గొలుసు అందిస్తున్న చెయ్యి క్షణంపాటు స్థంభించింది. గుండెల్లో ఆవేశం ఆవేదన రూపంలో ఉవ్వెత్తున పొంగింది. అతడి ఒళ్ళోకి గొలుసు విసురుగా వచ్చిపడింది. అది తీసుకుని అతడు వెళ్ళిపోయేడు. ఆమె మిగిలిపోయింది ఒంటరిగా.

అప్పుడొచ్చింది ఆమెకు దు:ఖం తెరలు తెరలుగా కట్టలు తెంచుకొని.

తాయెత్తు మనిషిని రక్షిస్తుందా లేదా అన్నది కాదు అక్కడి ప్రశ్న. కుటుంబంలోని వ్యక్తుల మధ్య బంధాల గురించిన ప్రశ్న అది. కుటుంబం.

చాలా మంచి పదం అది. తల్లి, తండ్రి, తమ్ముడు.... సున్నితమైన బంధాలూ.

ఇన్ని సంవత్సరాలు రెక్కలు ముక్కలా చేసుకుని తను యీ కుటుంబాన్ని నిలబెట్టింది. తన సర్వస్వం ధారపోసింది అయినా ఎవరో ఒకరే బ్రతకల్సివస్తే దానికి తన కొడుకునే తప్ప వంశం నిలబెట్టేవాడుగా తండ్రి ఎన్నుకొంటున్నాడు. ఏమి వ్యవస్థ యిది? ఇందులో బ్రతకటం కన్నా స్త్రీ చచ్చిపోవటం నయం.

ఆమె కన్నీటితో తలదిండు తడిసిపోయింది. ఎక్కిళ్ళు పైకి వినిపించకుండా ఏడుస్తూంది.

ఈ ప్రపంచంలో తనెంత ఒంటరో ఆమెకి ఆ క్షణం అర్థమైంది. తనమీదపడి తింటున్న వాళ్ళంతా తమ నిజస్వరూపాల్తో రాబందుల్లా కనిపించసాగేరు.

"నాక్కొంచెం ప్రేమ కావాలి ఎంత కొంచెమైనా చాలు. కొంచెం ఆప్యాయతా...." ఆమె జాలిగా ఆర్థిస్తూంది. కొంచెం సేపటికి ఆమె తేరుకొంది. అదే అనిర్వచనీయమైన స్థితిలో ఆమె చేయి ముందుకు జరిపితే తలదిండు క్రింద ఒక ఫోటో తగిలింది. ఆమె అప్రయత్నంగా బైటికి తీసింది.

స్త్రీ జీవితంలోకి యెప్పుడో ఒక్కసారి, ఒక పురుషుడు మాత్రమే దగ్గరికి వస్తాడు.... ఒకే ఒకసారి, నిశ్చయంగా ఆ పురుషుడు తండ్రిగానీ, అన్నగానీ, తమ్ముడుగానీ అవడు. ఆ ఒకరి కోసమే స్త్రీ కలలు కంటుంది.

అయితే శైలజలాంటి దురదృష్టవంతులు చాలా మూగగా తమ బంధాల్ని పెనవేసుకొంటారు. ప్రపంచపు చివరి నాలుగు రోజుల్లో కూడా శైలజలాంటివాళ్ళు తమ సంస్కారపు పరిధినుంచి బయటకొచ్చి, తమ మనసు వెల్లడించలేరు. అతడు వప్పుకొంటాడా లేదా అన్నది వేరే ప్రశ్న ఆమె చెప్పలేదంతే.

ప్రేమ యెందుకు ఎప్పుడు ఎలా ఎవరిమీద కల్గుతుందో చెప్పటం కష్టం. అది జామెట్రీకాదు, ఆల్జీబ్రా కాదు. ఆమె తన ఒంటరితనాన్ని ఇన్నాళ్ళూ మనసులో ఎలా దాచుకొన్నదో, తన ప్రేమను కూడా అలాగే ఈ నాలుగు రోజులూ దాచుకొంటుంది.

ఆమె కంటినుండి ఓ నీటిచుక్క జారిపడి ఫోటోని తడిపింది.

అతడిని యింకో అమ్మాయి ప్రేమిస్తోందని తెలుసు. తనకన్నా అతడి వయసు తక్కువనీ తెలుసు. అయినా ప్రేమ ప్రేమే.

ఆమె ఫోటోని వెనక్కి తప్పింది, ఎండిన జిగురు అతుక్కొని వుంది అక్కడక్కడా.

అప్లికేషన్ ఫారమ్నుంచి చింపిన ఫోటో అది.

ఇక శైలజ గురించి రాయటానికేమీ లేదు.

నాల్గురోజుల తర్వాత ఆమె సమాధి అయిపోవచ్చు గాక. కలల్లో సమాధి ఎప్పుడో అయిపోయింది.

*　　　*　　　*　　　*　　　*　　　*

'భవతి భిక్షాందేహి మాతా అన్నపూర్ణేశ్వరి....' చేతులమధ్య భిక్ష పాత్రతో ఎలుగెత్తి అరిచేడు వృద్ధుడు.

జానకి బయటకొచ్చింది. ప్రొద్దుట యెనిమిదయింది. అయినా చీకటిగానే వుంది. సూర్యుడు కడ్డుగా ఒక నల్లటి గోళం నక్షత్రాలు కనబడుతున్నాయి. కొన్ని కోట్ల సంవత్సరాలనుంచి వస్తున్న ఒక నిర్ణీతమైన పగలూ, రాత్రీ మరిక లేవు. అంతా రాత్రే. అంతా చీకటే.

"....భవతీ బిక్షాందేహి...."

అంత వ్యధలోనూ జానకికి నవ్వొచ్చింది "ప్రపంచం ఆఖరయి పోతూంటే ఇంకా బిచ్చమెత్తుకోవటం యెందుకు తాతా.... ఎవర్ని అడిగితే యెవరు కాదనరు? అయినా అసలు అడగటం ఎందుకు? కావల్సింది దొరికే చోట ఎవర్నీ అడక్కుండానే తీసుకోవచ్చుగా?"

"ఊహ తెలిసినప్పట్నుంచీ మధుకర వృత్తేనమ్మా! ఈరోజు మనుగడకే ప్రమాదమొచ్చిందని మానుకోమంటావా తల్లీ...."

ఆమె స్థాణువైంది.

ఆ చిమ్మచీకటిలో.... ఆ స్థబ్దపు వాతావరణంలో తన ఇంటి ముందు నిలబడివున్న ఆ బిచ్చగాడి నిజాయితీ చూసి ఆమె కంటనీరు వచ్చింది.... అదే నిజాయితీ ప్రతి మనిషిలోనూ వుంటే.... మనిషి చావుని యెంత హుందాగా ఆహ్వానించగలిగి వుండేవాడు.

తన ఆలోచనని నొక్కిపట్టి లోపలికెళ్ళి హరికేన్ లాంతరు సాయంతో రాత్రి తాలుకు అన్నం కొద్దిగా ఉంటే పట్టుకొచ్చింది.

"బాగా చీకటిగా వుంది తాతా! ఎలా వెళతావు?"

"వెలుగెలా వుంటుందో తెలీదమ్మా! నేను పుట్టుగుడ్డిని" అన్నాడు వృద్ధుడు. అతడి గాజుకళ్ళు హరికేన్ లాంతరు వెల్తుర్లో నిస్తేజంగా వున్నాయి. అతడి మొహం దీప్తితో వెలుగుతోంది.

ఆమె అతడి పాత్రలో అన్నం వేసింది.

అతడు చెయ్యెత్తి "దీర్ఘ సుమంగళీ భవ" అన్నాడు. నెమ్మదిగా చీకట్లో కల్సిపోయేడు.

ఆమె అటే చూస్తూ నిలబడింది.

ఇంతలో లోపల్నుంచి రమణ వచ్చేడు.

"ఎవర్ని వదినా చూస్తున్నావ్."

"మనిషిని"

అతడికి అర్థంకాలేదు. అయినా దానిగురించి ప్రశ్నించకుండా... "అన్నయ్యేడి?" అన్నాడు.

"తెలీదు బాబూ! ప్రొద్దున్నే ప్రక్కమీద లేరు" అంది.... ఆందోళన నిండిన కంఠంతో.

"ప్రొద్దున్నే యెక్కడికి వెళ్ళేడు? అంతలోనూ ఇంత చీకట్లో?"

కిటికిల్లోంచి జనం బయటకు చూస్తున్నారు. అందరి మొహాల్లోనూ భయం పేరుకుపోయింది. పగలు ఎనిమిదయినా చీకటి.... వళ్ళు గగుర్పొడుస్తూంది. ఆక్రోశించటానిక్కూడా శక్తిలేదు.

అంతా స్థబ్దత.

"ఎక్కడికి వెళుతున్నావ్?"

"అన్నయ్య ఎక్కడున్నాడో చూస్తాను.... ముందోసారి ప్రొఫెసర్‌గారింటికి వెళ్ళి, ఆయనను చూసి చాలా రోజులయింది" అంటూ కదిలేడు రమణ.

* * * * * *

బల్లకీ కుర్చీకీ మధ్యగా పడివున్నాడు ప్రొఫెసర్ ఆనందమార్గం. నాల్గురోజుల్నుంచీ తిండీ నీరూ లేకపోవటంతో శోషవల్ల సొమ్మసిల్లి పడిపోయేడు ఈ క్షణమో మరుక్షణమో ఆఖరిశ్వాస పీల్చుకోవటానికి సిద్ధంగావుంది ఆ వృద్ధుడి శరీరం. తన ప్రాణం పోయినా పర్లేదు. తను కనుక్కున్నది ప్రపంచానికి తెలుస్తే చాలు. కనీసం సగం మందన్నా బ్రతుకుతారు. భూమ్మీద మనుష్యజాతి అంతరించదు.

ఈ విషయాన్నెలా బయటకు తెలియపరచటం?

అతడు చేతులమీద లేవటానికి ప్రయత్నించాడు.... అసలే వృద్ధుడు. అందులోనూ నాలుగు రోజుల్నుంచీ యేమీ తినలేదు. నీరసం ఒక్కసారిగా ఆవరించింది. కుప్పలా కూలిపోయేడు. మళ్ళీ లేవటానికి ప్రయత్నిస్తున్నాడు.

అప్పుడు విన్నాడు బయట అలికిడి.

రమణ కంఠం.

"లేడా ఈయన?"

ఎవరో కుర్రవాడు సమాధానం ఇస్తున్నాడు, "లేడు, నాలుగు రోజులక్రితం తాళం వేసుకొని వెళ్ళిపోయాడు"

"ఎక్కడికీ?"

"తెలీదు"

ప్రొఫెసరు గట్టిగా కేక వేయాలనుకున్నాడు. చిన్న మూలుగు మాత్రం బయటకొచ్చింది.

"నే వెళుతున్నాను. ఆయనొస్తే వచ్చి వెళ్ళేనని చెప్పు."

లోపల ప్రొఫెసరు గిజగిజలాడిపోతున్నాడు. టేబిల్ మీద గట్టిగా కొట్టటానికి ప్రయత్నించేడు. కుర్చీని బలంగా క్రిందకి తోసెయ్యాలని చూసేడు. సర్వశక్తులూ కూడగట్టుకున్నాడు. అయినా బలం చాల్లేదు. నిస్సత్తువ శరీరాన్ని తూలిపడేటట్టు చేసింది. లోపల నుంచి ఏడుపు తన్నుకొస్తూంది. నిస్సహాయంగా పడివున్నాడు.

బయట అడుగుల చప్పుడు నెమ్మదిగా దూరమయింది.

కొంచెంసేపు గాఢమైన నిశ్శబ్దం ఆ గదిలో పేరుకొంది. చావుకి ముందొచ్చే కళలాంటిది అతనిలో ప్రవేశించింది. నెమ్మదిగా చెయ్యి సాచి కలం అందుకున్నాడు. 'నన్ను రక్షిస్తే నేను ప్రపంచాన్ని రక్షించగలను' కాగితం తీసుకొన్నాడు.

వణుకుతున్న వ్రేళ్ళమధ్య బలం అంతా పొందుపర్చి వ్రాయటానికి ఉపక్రమించేడు. ఒక్కొక్క అక్షరమే, ఒక్కొక్క అక్షరమే "నన్ను రక్షిస్తే....!"

అంతే! అతడి చెయ్యి జారిపోయింది. కనురెప్పలు అచేతనమయ్యాయి. ప్రాణం శరీరాన్ని వదిలిపోతోంది. ఆఖరి శ్వాస ఊపిరితిత్తుల నుంచి బయటకి వస్తూంది. దాంతో పాటూ ప్రాణం కూడా. ఆత్మజ్యోతి ఆరిపోతున్న ఆఖరిక్షణం అతడి కళ్ళముందో దృశ్యం మెదిలింది.

రాయల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్- స్టాక్‌హోం. స్వీడన్. హాలు ఆహూతుల్తో కిక్కిరిసి వుంది. ఒక్కో రంగములో ఒక్కో విషయంలో పరిపూర్ణత సాధించిన మేధావులు కూర్చుని వున్నారు. రాయల్ డిగ్నిటీయరి ఆఫ్ హాలెండ్- ది కింగ్ ఎత్తయిన వేదిక మీద కూర్చొని వున్నాడు.

ఇన్‌వెస్టిట్యూర్ సెరిమనీ మొదలైంది.

ప్రపంచాన్ని రక్షించినందుకు ఆ సంవత్సరపు అత్యున్నతమైన బహుమతి...."ప్రొఫెసర్ ఆనంద మార్గం".

ట్రంపెట్స్ మోగుతున్నాయి. అతని బయోడేటా- అతడు సాశించిన విజయాలూ సంక్షిప్తంగా చదవబడుతున్నాయి. గ్రే కలర్ సూట్‌లో అతడు మెట్లెక్కుతున్నాడు.

ది స్క్రాల్! అతడి విషయం వ్రాయబడిన స్వర్ణపత్రం బహూకరించపబడినది.

ది మెడల్!!..... తళతళా మెరుస్తూన్న పతకాన్ని అతడి కోటు జేబుకి హాలెండ్ రాజు అలంకరించాడు.

చివరగా-

ది నోబుల్ ప్రైజు!....!....ఇరవై లక్షల రూపాయలు విలువ చేసే చెక్కు.

అతడు రెండు చేతులూ సాగేడు. చాచటానికి ప్రయత్నం చేస్తున్నాడు, కళ్ళముందు

దృశ్యంకరిగిపోతూంది. అయిపోతోంది....అంతా అయిపోతోంది....అంతా అయిపోతోంది.....అయి...
పో....యింది.......

అతడి ప్రాణం విశ్వంలో కలిసిపోయింది.

టు.వొ.త్రీని విడగొడ్తే త్రీ.వొ.టు.గా మారుతుందని మర్చిపోయిన ఆ ప్రొఫెసర్ తన కలల ప్రాంగణంలోనే సమాధి అయిపోయాడు.

* * * * * *

ఆ చీకట్లో ఆమె హరికేన్ లాంతరు పట్టుకొని నడుస్తూంది. ఆమె మొహంలో ఆందోళన కదలాడ్తూంది. నాలుగువైపులా చూస్తూ ముందుకదుల్తోంది. "ఏమండీ" అని పిలుస్తూంది.

బీటలు వారిన భూమిలోంచి పడుతూ లేస్తూ ఆమె గమ్యం లేకుండా సాగిపోతోంది. రాళ్ళు, గుట్టలు దాటుకొంటూ వెళుతోంది. కంగారుని అదిమిపెట్టి, భర్తకేమయిందోనన్న ఆందోళనని నొక్కిపట్టి ఆమె వెదుకుతూంది. రాళ్ళూ దాటుకుంటూ వెళ్తూంది.

ఆమె కాలికేదో తగిలింది. వంగి చూస్తే బోర్లాపడి వున్న శరీరం. ఎనిమిదేళ్ళ సాహచర్యం ఆమెలో అనుమానాన్ని రేపింది. తిప్పి చూసింది.

ప్రకాశరావు భయంనుంచి దూరంగా....దూరలోకాల్లో.

ఆమె కెవ్వున అరిచింది. లాంతరు చేతిలోంచి జారిపోయింది. అతని మృతకళేబరం మీద పడి గోడుగోడున ఏడుస్తూంది. చూపిస్తున్నట్టు భూమి, ఆకాశం నిస్తేజంగా అయ్యాయి. పడిపోయిన హరికేన్ లాంతరు మినుకు మినుకుమని వెలుగుతూ ఆరిపోవటానికి సిద్ధంగా వుంది.

ఆమె ఎంతసేపు అలా ఏడుస్తూ వుందో తెలీదు, చాలా సేపటికి తేరుకొంది. మోకాళ్ళ మధ్య తల పెట్టుకొని ఆ ఎండిన చెట్టుక్రింద అలానే కూర్చుండిపోయింది.

ఆమె మనసులో ఇప్పుడు బాధలేదు. అంతకన్నా భయంకరమైన స్థితి, నిర్వేదన.

ఆమె తలెత్తి చుట్టూ చూసింది. పిచ్చిమొక్కలు, ఎండుకొమ్మలు, రాళ్ళగుట్టలు. అన్నిటినీ దాచుకొన్న చీకట్లో పొదచాటునుంచి మెరుస్తున్న రెండు కళ్ళు, పిల్లివా? నక్కవా? తోడేలువా?

ఆమె వణికిపోయింది. భయంతో కాదు- భర్త శరీరానికి పట్టబోతున్న గతి తల్చుకొని-

మరిది ఎక్కడున్నాడో తెలియదు.

ఆమె లేచింది.

## ఆగష్టు పదహారు- లండన్

చీకట్లో థేమ్సనది జుట్టు విరబోసుకున్న స్త్రీలా వుంది. ఎప్పుడూ కళకళ్లాడుతూ వుండే

గ్రాస్వెనార్ రోడ్ నిర్మానుష్యంగా వుంది. అది పగలో రాత్రో తెలియటం లేదు. రెండ్రోజుల్నుంచీ అంతా చీకటే. చీకట్లో లండన్ నగరం నిద్రపోతున్నాయి. కింగ్స్ రోడ్‌మీద నుంచి హైడ్ పార్కు చేసి లోపలికి ప్రవేశించాడు.

"గుడ్ ఈవెనింగ్ రాబర్ట్ ఫిన్చ్."

"ఇది సాయంత్రమా?"

"సారీ.... గుడ్ మార్నింగ్."

మెక్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

రోగర్స్ ముందు మాప్ వుంది. కరోలిన్ ఐలెండ్స్.

చుట్టూ ఎర్రపెన్సిల్‌తో మార్కు చెయ్యబడి వున్నాయి.

కరోలిన్ ద్వీపాల్లోకన్నా చిన్న ద్వీపం, "లాండ్ ఆఫ్ యుటోపియా."

"లాండ్ ఆఫ్ యుటోపియా?" అడిగేడు మెక్.

"అవును" అన్నాడు వెనక్కి వాలుతూ రోగర్స్.

"ఏ లోహాలూ, ఏ మిశ్రమాలు లేని ప్రదేశం. రెండు చదరపు మైళ్ళ విస్తీర్ణమున్న ద్వీపం. మనుష్య జాతిని రక్షించడం కోసం మనం చేసే ప్రయత్నం సఫలమయ్యేది ఆ ఒక్కద్వీపం ద్వారానే. ఛాన్సెస్ ఫిఫ్టీఫిఫ్టీ, అయినా ఆ మాత్రం ఛాన్సెస్ కూడా ఈ పరిస్థితుల్లో దొరకటం కష్టం."

"ఈ ద్వీపంలో ఏ పదార్థమూ లేదని కనుక్కొన్నది ఎవరు?"

"క్రెడిట్ గోస్ టు ఎ బ్రిటిష్ జియాలజిస్ట్" అన్నాడు రోగర్స్ "మిండనోవా డీప్‌లో విస్ఫోటం జరిగి పసిఫిక్ పొంగినప్పుడు దగ్గరే వున్న యీ ద్వీపం చెక్కు చెదర్లేదు. దాంతో అతడికి అనుమానం వచ్చి పరశోధన సాగించేడు. ఫలితంగా యీ విషయం బయటపడింది."

"అప్పటి సంగతి వేరు. అప్పుడు ఆ నక్షత్రం దూరం నుంచి చంద్రుడ్ని ఆకర్షించింది. కానీ ఎల్లుండి అది దగ్గరగా వస్తోంది. అప్పుడు చుట్టూవున్న సముద్రం పొంగవచ్చు. అది పొంగితే రెండు చదరపు మైళ్ళు విస్తీర్ణము ఏ పాటిది?"

"పొంగవచ్చు. అయినా అంతవరకూ ఎందుకు భూమి అంతర్భాగంలో వుండే ఏ లోహపు మిశ్రపు చర్యవల్ల నయినా, మిగతా ప్రపంచంతో ఆ ద్వీపమూ పేలిపోవచ్చు. కానీ మిగతా ప్రపంచంతో పోల్చుకుంటే ఆ ద్వీపం మీద అడం ఈవ్‌లని వదిలి పెడ్దామా?"

ఫిన్చ్ నవ్వేడు. ఎవరూ నవ్వకపోవటం చూసి ఆపుచేసేడు.

"లాండ్ ఆఫ్ యుటోపియా ఎవరి ఆధీనంలో వుంది?"

"చైనా"

చాలా సేపు ఎవరూ మాట్లాడలేదు.

ఆస్ట్రేలియాకి ఉత్తరంగా, అమెరికాకి పశ్చిమంగా, జపాన్ క్రిందుగా వుండే ఒక అనామకమైన దీవి. ఆ క్షణం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయే స్థానాన్ని పొందింది.

"నిజానికి చైనా కూడా దానిమీద ఆసక్తి చూపించడంలేదు. రాళ్ళూ రప్పలూ తప్ప ఏమీలేని ద్వీపం అది. మిండానియో నుండి బెస్తగాళ్ళు ఆ ద్వీపం వరకూ సాధారణంగా వెళుతూ వుంటారు".

మళ్ళీ కొంచెంసేపు నిశ్శబ్దం.

"రెండు చదరపు మైళ్ళు విస్తీర్ణంలో ఎంతమందికి రక్షణ కల్పించగలం?"

"రెండు వందల మందికి."

"ఒక రక్షణే కాదు" ....రోగర్స్ అన్నాడు. "ప్రళయం తర్వాత మిగాతా ప్రపంచం ఎలా వుంటుందో తెలియదు. వాళ్ళ జీవితాంతంసపోయే ఆహారపదార్థాలుంచాలి. ఒక షిప్, ఒక హెలికాప్టర్. ఇంకా...."

"మన ప్రపంచం గురించిన విశేషాలు, ఫోటోలూ, పుస్తకాలు-"

"అవి అప్పుడే భూమిలో పాతి పెట్టడం జరుగుతూందిగా."

"లావాలో అవీ పాడవకుండా, ఆ ద్వీపంలో కూడా కొన్ని వుంచాలి."

బాణంలా సూటిగా వచ్చింది ప్రశ్న "హు యిజ్ మోస్టు ప్రిఫర్డ్? వరుసగా పేర్లువ్రాసుకొంటూ పోతే మొదటి రెండువందల మంది ఎవరు? ఆ తర్వాత మిగతా ప్రపంచం నివాసయోగ్యం కాకపోతే.... ఆహార పదార్థాలు సరిపోకపోతే.... మొదట ఎవర్ని సముద్రంలోకి తోసెయ్యాలి?"

గుండెల్ని లోతుగా తొలిచే సమస్యలు.

సమాధానం మౌనం.

నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ మెసెంజర్ చిన్న కాగితం అందించేడు. అది చదివిన రోగర్స్ మొహం ఎర్రబడింది.

అందరూ అతడివైపే చూస్తున్నారు. అమెరికా ప్రేసిడెంట్ నెమ్మదిగా తలెత్తేడు. ఒకే ఒక మాట "చైనా ఆధీనంలో వున్న లాండ్ ఆఫ్ యుటోపియాని రష్యన్ నౌకాదళం చుట్టుముట్టింది" అన్నాడు.

*        *        *        *        *        *

"ఒక కళేబరాన్ని పాతిపెట్టాలి ఎవరైనా రండి" ఆమె ఆర్థిస్తోంది.

"నా భర్త శరీరం నక్కలపాలు కాకూడదండీ...." ఆమె వేడుకొంటుంది.

"ఇంత పెద్ద ప్రపంచంలో ఇద్దరు మనుష్యులే లేరా? తోరి మనిషి దిక్కులేని చావు చస్తుంటే- శరీరాన్ని పాతిపెట్టటానికి యిద్దరు దయామయులే లేరా?"

ఇళ్ళ తలుపులు వేసి వున్నాయి. కిటికీ తలుపులు మూసిఉన్నాయి. రెండ్రోజుల్లో అందరూ చావబోతుంటే చచ్చినవాడి కోసం ఏడవటాం కొందరికి విచిత్రం, కొందరికి సహజం. ఎవరొస్తారు బైటికి?

చావుపట్ల భయం మనసు నిండా నింపుతోంది.

మనిషి నిర్లిప్తతని చుసి భూమి మరింత బీటలువారింది. చీకటి మరిమత నల్లగా రంగు పులుముకుంది. నక్ష త్రాలు విషాదంగా చూస్తున్నాయి.

రోడ్డు మధ్య నిలబడి ఆమె అడుగుతోంది.

చాలా చిన్న కోర్కె.

"నా భర్త చనిపోయేడండీ. కొంచెం ఖననం చెయ్యటానికి చెయ్యి అందించండి. ఒక్క పార

మట్టి వెయ్యండి. అలా వదిలెయ్యకండి. చికిపోయి శిధిలమవకుండా నాలుగడుగుల గొయ్యి తియ్యండి- అంతేనండీ. అంతకన్నా నేను మరేమీ కోరను. తోటి మనిషి చచ్చిపోతే అలా హృదయాలు శిలలు చేసుకొని నిర్లిప్తంగా వుండిపోకండి."

"ఎవరూ రారమ్మ...."

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

వృద్ధుడు.

తను అన్నం పెట్టిన అంధుడు.

"మనిషి ఎప్పుడో చచ్చిపోయేడమ్మా! ఇవి జీవచ్చవాలు. ఓ నిర్భాగ్యపు శవాన్ని పాతెయ్యటానికి ఈ జీవచ్చవాలు రావు."

ఆమె ముందు, వెనకే అతడు.

ఆమెలో ఇప్పుడు వేదనలేదు. రోదించటం లేదు. భయం లేదు. నిర్లిప్తత, అంతే. చుట్టూ వున్న వాతవరణం ఆమెలో సున్నితత్వాన్ని చంపేసింది.

చిన్న పారతో అతను మట్టి తవ్వసాగేడు.

ఆమె రెండు చేతులతోనూ మట్టి ఎత్తి పోయసాగింది. భర్త శవాన్ని పాతిపెట్టడం కోసం భార్య తవ్వడం....

మూడు గంటలు ఆ చీకటిలో, ఆ శ్మశానంలో వాళ్ళిద్దరూ నిర్విరామంగా పనిచేసిన తర్వాత ఆరడుగుల గొయ్యి ఏర్పడింది.

రెండు చేతులతోనూ మృత కళేబరాన్ని ఎత్తి పట్టుకొన్నాడు వృద్ధుడు.

అప్పుడిక ఆమె ఏడుపు ఆపుకోలేకపోయింది. కెర్టాలు కెరతాలుగా లోపల్నుంచి ఏడుపు తన్నుకొచ్చింది. అతనిమీదపడి ఏడుస్తూ, "నన్ను చచ్చిపోనీ తాతా! నన్నూ కప్పెట్టు...." అంది

గోడు గోడున విలపిస్తూ.

ఆ అంధుడు తడుముకొంటూ శరీరాన్ని గోతిలో ఉంచేడు. భర్త శరీరాన్ని వదలటానికి ఆమె వప్పుకోవటం లేదు. బలవంతం మీద ఆమెని విడదీసేడు.

వీడిన జుట్టుతో, చెదిరిన బొట్టుతో ఆమె మూర్తీభవించిన దైన్యములో వుంది.

మట్టి పెళ్ళలు పెళ్ళలుగా శవం మొహంమీద పడుతోంది- అయిదు నిముషాల్లో శవాన్ని కప్పటం పూర్తయింది.

"పదమ్మా యిక" అన్నాడా వృద్ధుడు. "ఏముందిక్కడ? మట్టిలో పుట్టిన మనిషి అందులోనే కలిసిపోతేడు. ఈ రోజు కాకపోతే రేపు నువ్వూ నేను కూడా కలిసిపోవల్సిందే. మనసు దిటవు పరచుకో. యీ ఒక్కరోజు ఏడుపు దిగమింగుకో ఎంత ఆత్మస్థయిర్యంతో నువ్వీ కార్యం నిర్వహించావో తల్చుకుంటే నాకే వళ్ళు గగుర్పొడుస్తూంది. మీ వాళ్ళకెవరికీ ఈ సంగతి చెప్పకమ్మా, ఎందుకు చెప్పటం? రేపు చనిపోయేవాళ్ళకి ఈ రోజు చనిపోయిన వాడి సంగతి చెప్పి వేదన కలిగించడం ఎందుకు? నీలోనే ఈ అగ్నిపర్వతాన్ని దాచుకో?"

అతడు అలాగే నిలబడి వున్నాడు.

ఆమె కదిలింది.

చీకట్లో హరికెన్ లాంతరు వెల్తురు నెమ్మదిగా అదృశ్య మైపోయింది.

* * * * * *

"ఇంకా పన్నెండు గంటలు...." అనుకొన్నాడు రమణ.... రాత్రి పదకొండు గంటలకి. ఆది రాత్రో పగలో అనవసరం. కేవలం గడియారంవల్లే అది తెలుసూంది.

క్రితం నాలుగు రోజులూ ఉన్న అలజడి లేదు.

మరణం దగ్గరవుతున్న కొద్దీ మనిషిలో స్తబ్దత ఆవరించింది.

రమణ ఆలోచిస్తున్నాడు.

'చావబోయే ముందు క్షణం మనిషి ఏం కోరుకొంటాడు? స్త్రీ ఏం కోరుకుంటుంది.

మానసిక వ్యభిచారిణి అయితే.... పక్కింటివాడితో హాయిగా ఏ ఏకాంత ప్రదేశంలోనో విహరిస్తూ- ద్రాక్షతోటలూ, ప్లీమత్ కారూ.... సెంట్రల్లీ ఎయిర్ కండిషన్డ్ ఇల్లూ, చివరి రోజు అందంగా, ఆనందంగా-

వ్యభిచారిణి తన జీవితంలో తారసపడిన విటుడ్ని.... తనతో మనస్సు విప్పి మాట్లాడిన ఒకే ఒక వ్యక్తిని తన భర్తగా ఊహించుకొంటూ మరణిస్తుంది.

మరి పురుషులు?

అతనికి ఆలోచన అందలేదు.

రకరకాల వ్యక్తులు.

రకరకల మానసిక బలహీనతలు.

కెలిడియో స్కోప్.

అతడు ఆలోచనలో ఉండగానే బయట తలుపు కొట్టిన చప్పుడు లీలగా వినిపించింది. వెళ్ళి తీసేడు.

ఎదురుగా మాలతి.

అతడు అడుగు వెనక్కి వేసి ఆశ్చర్యం నిండిన కంఠంతో, "మాలతీ!"అన్నాడు

అస్పష్టంగా.

ఆమె మాట్లాడలేదు. తలెత్తి అతని వైపు చూసి కళ్ళు దించుకొంది.

అతడు తడబడుతూ, "ఇంత రాత్రిపూట ఒంటరిగా...." అన్నాడు.

ఆమె నెమ్మదిగా చేతిని పైకెత్తింది.

మసక చీకట్లో మెరుస్తూ ఆమె చేతిలోంచి క్రిందకు జారింది-

పసుపుతాడు. అతడు దిగ్భ్రమతో నిలబడిపోయేడు. సర్వశక్తులు కూడ గట్టుకొని, "ఏమిటి.... ఏమిటిది మాలతీ" అన్నాడు.

ఆమె ఎక్కువ మాట్లాడలేదు. ఎంతో లోతయిన ఆలోచననయినా మౌనంగా.... కళ్ళతో చెప్తుంది. అప్పుడు మాత్రం ఒకే మాట మాట్లాడింది.

"వచ్చేశాను రమణా- అన్నీ వదులుకొని."

అతడి మనసు ఆర్థ్రమయింది. ఆమె చేతిని అందుకొని "మాలతీ...." అన్నాడు. ఆ రాగరంజితమైన రసానుబంధపుటాస్వాదనలో వాళ్ళిద్దరూ అలా ఎంత సేపు వున్నారో తెలీదు.

రమణే ముందు తెప్పరిల్లేడు.

తల విదిలించి "పద" అన్నాడు.

'ఎక్కడికి?'

"మీ ఇంటికి."

ఆమె వుపుక్కున తలెత్తింది.

అతను అన్నాడు "ఈ సమాజపు కట్టుబాట్లనీ- మీ నాన్నగారు విధించిన ఆంక్షల్ని దాటటం ఈ జీవితపు ఆఖరి రోజు మనకి కష్టంకాదు. అసలు దాటటమే మన ఆశయమయితే ఇంతకాలం దానికోసం మనం ఆగటం ఎందుకు? వద్దు మాలతీ మన ఇరవైనాలుగు గంటల వైవాహిక జీవితం మీ వాళ్ళకి వ్యధని కలిగింస్తుంధని తెలిసినప్పుడు.... యీ వివాహం మాత్రం ఎందుకు? వివాహం కన్నా ప్రేమ గొప్పది మాలతీ! మన అదృష్టంకొద్దీ అది మనకి లభ్యమైంది. దాన్నే అనుభవిద్దాం. నా తలపుల్లో నువ్వూ. నీ తల్పుల్లో నేనూ హాయిగా ప్రాణాలు వదిలేద్దాం. దానికి ఒకరికొకరం దగ్గరగా ఉండటమెందుకు? నేను నీకన్నా నిన్ను ప్రేమిస్తున్నానన్న భావనని ఎక్కువగా ప్రేమిస్తున్నాను మాలతీ! నీ కన్నా నీ తలపుల్ని ఎక్కువ ప్రేమిస్తున్నాను. అది చాలు నాకు."

ఆమె వెనుదిరిగింది.

ఆమె మౌనంతో అతడు కంగారుపడి, "మాలతీ" అన్నాడు, "నేను.....నేను నీ మనసు నొప్పించానా".

ఆమె లేదన్నట్లు తల అడ్డంగా వూపింది.

"పద, మీ ఇంటి దగ్గర దింపుతాను".

ఆమె మౌనంగా అతన్ని అనుసరించింది.

అతడి మనసుతో ఏదో అస్పష్టమైన వ్యధ. ఆమె నిజాయితీ ముందు తను ఓడిపోతున్నానేమో అన్న బాధ.

"వ్యవస్థను ఎదిరించటం-మన వాళ్ళని కాదనటం-ఇలాటి పెద్ద పెద్ద మాటలొద్దు. మనం ఏ కారణం వల్ల ఇంతకాలం వివాహం చేసుకోలేదో- ఆ కారణం వల్లే ఈ ఒక్క రోజూ ఆగుదాం".

దూరంగా పదకొండు కొట్టింది.

పదకొండుగంటలా ఐదు సెకన్లు.

అదే సమయం.

ఉన్నట్టుండి పెద్ద కదుపు. ఫెళఫెళారావాల్తో భూమి కంపించింది. మూడు సెకన్‌లపాటు ఊగిపోయింది. పెద్ద శబ్దంతో బీటలు వారింది.

వాళ్ళిద్దరూ ప్రేక్షకులే అయ్యారు. చూస్తూ ఉండగానే రెండు మూడు ఇళ్ళు కూలిపోయేయి. దూరంగా ఎవరో ఏడుస్తున్న ధ్వని.

రమణ చప్పున ఆగి "అరె!" అన్నాడు.

మాలతి అటు చూసింది.

వృద్ధుడు తడుముకొంటూ వస్తున్నాడు. ముందో గొయ్యి వుంది. భూమి విడిపోవటంతో ఇరవై అడుగుల కందకంలా ఏర్పడింది. అటువైపు వెళుతున్నాడా అంధుడు.

"ఆగు" అని అరిచేడు రమణ. అప్పటికే ఆలస్యం అయింది. వృద్ధుడు కందకంలోకి జారిపోయేడు. రమణ పరుగు పరుగున అక్కడికి చేరుకున్నాడు. క్రిందికి తొంగి చూసేడు. నాలుగడుగుల క్రింద రాయిని పట్టుకొని వేలాడుతున్నాడు వృద్ధుడు. ఏ క్షణమన్నా జారిపోయేట్టు ఉన్నాడు.

రమణ లోపలికి దిగటానికి ఆయత్తమయ్యేడు. అతడి చేతిని ఆమె పట్టుకొని ఆపింది. ఒక్క క్షణం ఇద్దరి కళ్ళూ కలుసుకొన్నాయి.

ఒక వృద్ధుడి జీవితకాలాన్ని ఒకరోజు పొడిగించటం కోసం తన జీవితాన్ని ఒకరోజు తగ్గించుకొనే రిస్క్ తీసుకోవాలా? కషంలో వెయ్యోవంతు ఆలోచించి అతడో నిర్ణయానికి వచ్చేడు.

ఆమె చేతిని విడిపించుకొని అతడు నెమ్మదిగా కందకంలోకి దిగుతూ, "వస్తున్నా తాతా! ఒక్క క్షణం ఓర్చుకో" అన్నాడు. కాలికింద మట్టిజారి, అడుగు చీకట్లో ఎక్కడికో వెళ్ళి పడ్తూంది.

ఒక్క అడుగు క్రిందికి దిగేడు.

వృద్ధుడు చేతులు బలహీనంగా వణకటం కనిపిస్తూంది.

పైనుంచి మాలతి ఆత్రంగా చూస్తూంది. ఇంకో అడుగు నెమ్మదిగా దిగేడు. ఒక చేత్తో రాతిని బలంగా పట్టుకొని ఇంకో చేయి ముందుకు సాచి, వృద్ధుడి చేతిని అందుకొని బలంగా పైకి తోసేడు. ఒక్క ఊపుతో వృద్ధుడు పైకి వచ్చేడు కానీ, రమణ పట్టుకొన్న రాయిమాత్రం పట్టు వదిలేసింది.

కెవ్వున అరచిన కేక చుట్టూ ప్రతిధ్వనిస్తుండగా అతడు క్రిందకి జారి, రాళ్ళ మధ్య పడిపోయేడు. క్షణం పాటు, ఏమీ తోచలేదు. కాలు విరిగిందో- చెయ్యి విరిగిందో తెలియలేదు. తడిమి చూస్తే పక్కన ఇంకో శరీరం.

"ఎంత పనిచేశావు మాలతీ...." అన్నాడు. ఆమె నుంచి సమాధానం రాలేదు. కంగారుగా ఆమెని కుదుపుతూ, "మాలతీ- మాలతీ" అన్నాడు. ఆమె హీనస్వరంతో "ఊ" అంది. ఆమె తలనుంచి స్రవిస్తున్న రక్తాన్ని చేతితో అదిమి పెట్టేడు.

తల పైకెత్తి చూసేడు. ఇరవై అడుగుల ఎత్తులో చిన్న రంధ్రం. బయట చీకట్లో సరిగ్గా కనబడటం లేదు. మట్టి కొద్దికొద్దిగా జారి పడ్తూంది. కొంచెం సేపట్లో రాళ్ళు కూడా పడ్తాయి. మనిషిని సజీవ సమాధి చేసే రాళ్ళు.

"రమణా" అందామె సన్నగా.

"ఊ."

"నేను.... నేను నీ చేతిని ఒకసారి.... ఒకేసారి చెంపకు ఆన్చుకోనా?"

అతడు కదిలిపోయి, "మాలతీ" అన్నాడు.

"నీ.... నైతిక విలువలూ, మానసిక బంధాలూ దానికి అడ్డొస్తాయా?"

అతడు చప్పున ఆమె తలని చేతుల్లోకి తీసుకొని హృదయానికి జత్తుకొంటూ "అంతమాట అనకు మాలతీ!" అన్నాడు నిండా నీరున్న కళ్ళతో. ఆమె అతని చేతిని పట్టుకొని అలాగే వుండిపోయింది.

నాలుగు సంవత్సరాల స్నేహపు మొదటి స్పర్శ ఏదో అద్భుతమైన లోకాలలో విహరిస్తున్నట్టూ ఆమె కళ్ళు మూసుకుంది. ఆ కల చెదిరిపోయిందేమో అన్నట్టు అతడు ఆమెను గట్టిగా పట్టుకొని వున్నాడు. భూమికి ఇరవై అడుగుల లోతులో వాళ్ళిద్దరూ అలా ఎంతకాలం వున్నారో తెలియదు. ఏ రాయి వాళ్ళని పరలోకానికి తీసుకెళ్ళిందో తెలీదు.

ఏ ప్రకంపనం వాళ్ళని సజీవసమాధి చేసిందో తెలీదు. ఒకరి కోసం ఒకరు ప్రాణాలు అర్పించిన ప్రేమికుల చరిత్ర వ్రాయటానికి చరిత్రకారు లెవరయినా భూమ్మీద ఇంకా మిగిలి వుంటే వాళ్ళ కథ కూడా చరిత్రకెక్కి ఉండేదేమో!

## ది లాస్ట్ డే

## ఆగష్టు పది హేడు

Bloaw ye the Trumapet ian sion alarm in my holy Mountain.... the day of lord cometh: a day of darkness and of gloominess, a day of clouds.... there has not been ever the like, neither shall be any more after it. (Jeel 2 : 1-2)

సముద్రంలో తరంగాలు ఉవ్వెత్తున లేస్తాయి. గాలి ఝుంఝూనూరుత మవుతుంది. కారు చీకట్లు కమ్ముకుంటాయి. సూర్యుడు నల్లబడతాడు. నక్ష త్రాలు కాంతి హీనమవుతాయి. విరుచుకు పడుతున్న కెరటాల చప్పుడు తప్ప ఇంకేమీ వినబడదు. రాజులు, రాజ్యాలు- గొప్పవాళ్ళు, బీదవాళ్ళు అందరూ నాశనమవుతారు. ఏడు నీళ్ళు విడగొడ్డబడ్తాయి. ఏడు ట్రంపెట్లు మ్రోగుతాయి. ఏడు కప్పులతో "రాత్" భూమ్మీద జారవిడువ బడుతుంది.

అప్పుడు దయ్యం విజృంభిస్తుంది. ప్రజలు దేవుడిమీద యుద్ధం ప్రకటిస్తారు. ది వార్ ఆఫ్ ఆర్మగాడెన్. దయ్యాన్ని నమ్మని మనుషులని రక్షించటానికి క్రీస్తు మౌంట్ ఆలిల్స్ మీంచి దిగివస్తాడు. దయ్యాన్ని నమ్మని మనుషులని ఊచకోత కొయ్యటానికి కల్కి శ్వేతాశ్వం ఎకి రుద్రభైరవుడిలా వస్తాడు.

దయ్యాన్ని చంపటానికి అల్లా చివరిసారి శంఖం వూదగానే ఆకాశం తెరువబడుతుంది. ప్రజలు గుంపులు గుంపులుగా లేచివస్తారు. యోమాయున్ ఫిక్క్ ఫిసూరీ, నిస్సందేహంగా నిర్ణాయ దినం ఒక నిర్ణీత సమయం.

ఓమెన్. అలాగే జరుగుతుంది.

పరిత్రాణాయ సాధూనాం. మంచివాడు రక్షింపబడతారు.

రక్షించబడటం అంటే దేవుడ్ని చేరుకోవటమా?

అవును మరి. మంచివాడు తొందరగా చచ్చిపోతున్నాడు.

ఎక్కడుంది ఈ దయ్యం?

మనిషిలో దయ్యాన్ని చంపటానికి ప్రళయం రావాలి.

వ్యవస్థని మార్చటానికి ప్రళయం కావాలి.

* * * * * *

రాత్రి ఎనిమిదయ్యింది.

ఇంకా మూడు గంట్లా పన్నెండు సెకన్లు.

పల్లెతో....

భజనలు జరుగుతున్నాయి.

స్వామివారు పూనుకంతో వూగిపోతున్నారు.

ఆయన మీద నమ్మకం వున్న ప్రజలు నిశ్చింతగా వున్నారు.

అందులో రంగారావు వున్నాడు. ఇటు రంగారావుకీ అటు భూషణానికి మధ్య మాటలు చేరవేసే పెద కామందూ వున్నాడు. "ఏమంటాడయ్యా భూషణం?" అడిగాడు రంగారావు.

"బెదిరిపోయేడు. ఇంకేమంటాడు?" నవ్వేడు కామందు.

"చెట్టుక్కట్టి కాలుస్తానన్నాడుగా రాజయ్యని. కాల్చడంటావా?" తెలియనట్టే అడిగేడు.

ఈ సంభాషణ జరుగుతున్నప్పుడు రాజయ్య అక్కడికి చేరుకుంటున్నాడు. తన పేరు వినిపించి ఆగాడు.

"ఇంకేం కాలుస్తాడు మీ అండ వున్నాక."

"అయితే రాజయ్యకు మన అండ వున్నదంటావ్?" ముసి ముసిగా నవ్వేడు రంగారావు.

కామందుకి చదరంగం కాదు మాట అర్థంకాలేడు. అతగాడికి అర్థం కాలేదన్నది రంగారావుకి అర్థమయింది.

"రాజకీయాల్లో ఒకటి అండ ఇంకోడికి పరమనెంట్‌గా ఎప్పుడూ వుండాదయ్యా కామందూ. వినుకో. పైకి రావాల్సినోడిని ఆ భూషణం తగలెట్టకపోతే మనమే తగలేద్దాం."

వింటున్న రాజయ్య వణికిపోయేడు.

"మనమా?" అన్నాడు కామందు అర్థంకాక.

"ఆడ్ని నడివీధిలో సెట్టుక్కట్టేసి కాలుత్తానని ఆ భూషణంగాడు అందరికీ సెప్పుకున్నాడు కదయ్యా. ఇయ్యాల ఏదో పెళయం వస్తూందని ఆడు ఆగిపోతే మనం ఆగుతామా? అదే సమయానికి ఓ సెట్టు నీడన రాజయ్యగాడి శవం కాలిపోయి పెజలకి కనిపించిందనుకో! ప్రవాహం ప్రవాహంలా ఆ భూషణం మీద ఇచ్చుకు పడరూ! భూమ్మీద యీ అరిష్టానికి కారణం ఇదో-ఇట్టా ఈ రాజయ్యగాడ్ని ఆ భూషణం కాల్చెయ్యడమే అని ఓ "రూమరో" దిల్సామనుకో-ఇంక తరువాత మిగిలింది నువ్వే ఆలోచించు...."

ప్రళయాన్ని కూడా తన స్వార్థానికి ఉపయాగించుకొనే తోటి మనిషిని చూసి, రాజయ్య బెదిరిపోయేడు. కంచెకదిలి తనను మేయటానికి వస్తుంటే విస్తుపోయిన చేనులా అల్లల్లాడి పోయాడు. రెండు పులులు దెబ్బలాడుకొంటూంటే, దానికి కారణమైన కుందేలులా భీతి చెందేడు.

చావటం ఖాయం, ఏ పులి నోటిలోపడి అన్నదే ప్రశ్న.

వెళ్ళిపోవాలి. అక్కణ్నుంచి దూరంగా పారిపోవాలి. ఈ మనషులకి అందనంత దూరానికి..

కాలికింద ఎండుటాకు విరిగింది.

"ఎవరదీ?" అరిచేడు రంగారావు.

రాజయ్య వణికిపోయాడు. కామందు బయటకి వచ్చి చూస్తే, పరుగెడుతున్న రాజయ్య కనపడ్డాడు.

విషయం తెలిసిన రంగారావు కంగారు పడ్డాడు. "ఆణ్ని పట్టుకో" అరిచాడు. విషయం బైటకు రాకూడదు.

రాజయ్య పరుగెత్తుతున్నాడు. వెనకే రంగారావు.

## తొమ్మిదయింది.

ముసలాయన అసహనంగా కదిలాడు. "ఏమయ్యారు వీళ్ళిద్దరూ?" అన్నాడు. అలా అడగడం అది అరవయ్యోసారి. జానకి మాట్లాడలేదు. మోకాళ్ళ మీద తల పెట్టుకొని, ఓ మూల కూర్చుని వుంది. ఆమె మాట్లాడియెంతో కాలమయింది. మౌనంగా నిర్లిప్తంగా రాబోతున్న ప్రళయాన్ని తొందరగా ఆహ్వానిస్తున్నట్టూ సమాధిలో కూర్చొని వుంది......బాబు తల్లి వంక భయంగా చూస్తూ వున్నాడు.

భయం.

అంతా భయమే.

హాట్‌లైన్ మీద సంప్రదింపులు జరుగుతున్నాయి. చైనాని ఎలిమినేట్ చేసి యుద్ధానికి సిద్ధపడాలా? లాండ్ ఆఫ్ యుటోపియాలో దానికీ భాగం యివ్వాలా? ఒకవైపు సంప్రదింపులు జరుగుతూనే.... అంతర్గతంగా యింకో సమావేశం....ఆఖరి నిముషంలో 'ఇంకో' దేశాన్ని కూడా అక్కణ్నుంచి తోసేస్తే?

యుద్ధం తప్పదు. ఎలాగూ చచ్చిపోతున్నప్పుడు యుద్ధం తప్పనిసరి అయితే మాత్రం నష్టం ఏముందీ?

ప్రపంచమే ఒక హిరోషిమా, నాగసాకి అవబోతూంది. బలాబలాలు తేల్చేసుకుంటేనే సరి. శాంతి అనేది చాలా అస్పష్టమైన మాట, మనిషిలో లేదది. ప్రపంచం వరకూ యెందుకు? చైనాతో కలిసి రష్యా మీద యుద్ధం ప్రకటించాలా?

మనిషి చావబోయే రెండు గంటల ముందు ఇదీ సమస్య ఇంకో పెర్వర్షను. అసలు లాండ్ ఆఫ్ యుటోపియానే బ్లాస్ట్ చేసేస్తే? ఏమీ మిగల్దుగా?

ఆయా దేశాల మారణాయుధాలు అన్నీ సిద్ధం చెయ్యబడ్డాయి. ఇరవై ఔన్సులతో ప్రపంచాన్ని నాశనం చేసే బొటోలినన్ టాక్సిన్ నైనేడ్‌కన్నా మూడువందల మిలియన్ రెట్ల ప్రమాదకరమైన విషమ.

ముప్పై సెకన్లలో మనిషిని పక్షవారానికి గురిచేసే నెర్వ్ గ్యాస్ ట్యూబ్ఫ్- మినిట్ మెన్!!! న్యూక్లియర్ మిసిల్స్ ఫిఫ్టీ, మిలియన్ టాన్....టి యస్టీ బాంబ్స్.... ప్రళయం రావటానికి ప్రకృతే అక్కరలేదు.

మనిషికీ మనిషికీ మధ్య వైషమ్యం చాలు.

## పదయింది.

ఆకాశం రక్తంతో తడిసినట్టూ యెర్రబడింది. జలచరాలు రాబోయే ప్రమాదాన్ని గుర్తించినట్టు గుంపులుగా పరుగెడుతున్నాయి. పక్షుల చెట్లమీద చేరి రెక్కలు టపాటపా కొట్టుకొంటూ అరుస్తున్నాయి.

హోరున శబ్దం. సముద్రాలన్నీ ఏకమవుతున్నాయి. ముల్లోకాలను ముంచటానికి తరంగాలు పర్వతాల్లా లేస్తున్నాయి. పృథ్వి, ఆకాశమ, జలం, శిలలు, అగ్ని, కాలం, క్రియ అన్ని నాశనమవటానికి ఆయత్తమవుతున్నాయి.

.................

పదిన్నర.

..............

ప్రాక్సిమా సెంక్సువరీ భూమిని తన ఆకర్షణ పరిధిలోకి లాక్కోవటానికి వస్తూ వుంది. ప్రపంచాన్ని నాశనం చెయ్యటానికి మిస్సైల్స్ సిద్ధంగా వున్నాయి. స్విచ్ నొక్కగానే పరుగెత్తటానికి.

రాజయ్య పరుగెడుతున్నాడు. వెనుకే రంగారావు.

మేఘాలన్నీ ఒకచోటచేరి ఏడుస్తున్నట్టు కుండపోతగా వర్షం!

.... ..... .... .......

పదిగంటలా యాభై నిమిషాలు.

ప్రపంచం ఆఖరవటానికి ఇంకా పదినిమిషాలు. మనిషి చచ్చిపోవటానికి ఇంకా పదినిమిషాలు.

చచ్చిపోకుండా వుండటం కోసం రాజయ్య పరుగెడుతున్నాడు.

సాంఘికంగా మనిషి ప్రతిక్షణమూ రావకుందా రక్షించగలిగేది ఏది?.

గడియారం టిక్ టిక్ మన్న శబ్దం తప్ప ఇంకేమీ విన్పించటంలేదు. ఒక్కొక్క క్షణమే మనిషిని మృత్యువు దగ్గరగా తీసుకెళుతుంది!

మనిషి చచ్చిపోతున్న క్షణంలో మనిషిలోని రాక్షసుడు బ్రతుకుతున్నాడు. వేయి చేతులు సాచి విజృంభిస్తున్నాడు.

---

"ఆగు" అంది జానకి.

ముసలాయన అడుగు ముందుకేసేడు.

"ఆగు మూర్ఖుడా! ఆగు".

ఆఖరి క్షణంలో ఆఖరి అనుభవం పొందాలనుకుంటున్న రాక్షసుడు.

ఆమె చేతికి దొరికిన హరికేన్ లాంతరు విసిరేసింది.

కెవ్వున కేక.

మంటలు ఎర్రటి మంటలు.

అర్తనాదాలు?

పాపాన్ని భరించలేక భూమి బీటలు వారుతోంది.

పదకొండు గంటలయింది.

ఒకటి-రెండు-మూడు-సెకన్లు.

పరుగెడుతున్న రాజయ్య కాలుజారి పడిపోయేడు. వెనుకనుంచి మృత్యువు వస్తోందని

తెలుసు. చేతులెత్తి "దేవుడా" అని అరిచేడు.

ఐదు-ఆరు-ఏడు-సెకన్లు.

ఒక్కసారిగా తుఫాను వచ్చేముందు వుండే ప్రశాంతత ఏర్పడింది.

ఇంకో రెండు సెకన్లలో భూమి పేలిపోతుంది.

అంతా నిశ్శబ్దం. మానసికంగా చచ్చిపోయిన ప్రకాశరావు, సాంఘికంగా చచ్చిపోయిన రాజయ్య, నైతికంగా చచ్చిపోయిన ముసలాయన- అందర్నీ తనలో కల్పుకున్న నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దంలో రెండు చేతులూ యెత్తి, జానకి భగవంతుడితో ఇలా అంది:

"ప్రభూ! ఈ ప్రపంచాన్ని సర్వనాశనం చేస్తున్నావు, చెయ్యి, తొందరగా అందరినీ నీలో కలుపుకో. భగవంతుడా! ఈసారి మళ్ళీ సృష్టి అంటూ చేస్తే ఆ క్రొత్త ప్రపంచంలో మనిషి నిజమైన మనిషిలా బ్రతకాలి. మానసికంగా, సాంఘికంగా, నైతికంగా చావకూడదు. అలాంటి ప్రపంచాన్నేగాని నువ్వు మళ్ళీ సృష్టిస్తే అందులో రాయిగానో, ఓ పిచ్చి మొక్కగానో మళ్ళీ పుట్టడాన్ని నేను కోరుకుంటాను. అలా పుట్టడం కోసం చావుని ఆహ్వానిస్తాను. ప్రళయాన్ని ఆహ్వానిస్తాను......"

ఆమె ప్రార్థన ముగిసింది. ఆ తర్వాత భయంకరమైన శబ్దంతో భూమి పెతేలున విడిపోయింది. ముక్కలు విశ్వంలో ఐక్యం అయిపోయేయి.

(అయిపోయింది)